ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక

సంపుటి 5 | సంచిక 3 జులై-సెప్టెంబర్ 2025

మమత-సమత-మానవత
www.gurajada.org





# సంపాదక మండలి


**వ్యవస్థాపక సంపాదకులు**
మహాకవి గురజాడ అప్పారావు

**ప్రధాన సంపాదకులు**
ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ(USA)

**నిర్వాహక సంపాదకులు**
శ్రీమతి అరుణ గురజాడ (USA)
శ్రీ గురజాడ రవీంద్రుడు *(విశాఖపట్టణం)*

## విద్యాసంబంధిత ప్రచురణ విభాగ సంపాదకులు

**కార్యనిర్వాహక సంపాదకులు**
ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు
*(హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్)*

**సంపాదక సలహాదారులు**

ఆచార్య, సూర్యా ధనంజయ్
*(ఉపకులపతి, చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, హైదరాబాదు)*

ఆచార్య చల్లా శ్రీరామచంద్రమూర్తి
*(అధ్యక్షులు, తెలుగుశాఖ, బెనారస్ హిందూ యూనివర్శిటీ, వారణాసి)*

ఆచార్య మాడభూషి సంపత్ కుమార్
*(సంచాలకులు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు)*

డా. వి.ఆర్. రాసాని
*(విశ్రాంత ఆచార్యులు, తిరుపతి)*

**సంపాదకులు**

ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వర రెడ్డి
*(యోగి వేమన విశ్వ విద్యాలయం, కడప)*

ఆచార్య రాచుగాల్ల రాజేశ్వరమ్మ
*(శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి)*

ఆచార్య జొన్నలగడ్డ వెంకటరమణ
*(మదురై విశ్వవిద్యాలయం, మదురై)*

**సహ సంపాదకులు**

డా. నందవరం మృదుల, *(సహ ఆచార్యులు & తెలుగు విభాగాధిపతి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) బేగంపేట, హైదరాబాద్)*

డా. వి. వింధ్యవాసినీ దేవి, *తెలుగు ఉపన్యాసకులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) క్లస్టర్ యూనివర్సిటీ, కర్నూలు*

## కథలు, కవితలు, వ్యాసాల విభాగం

**సంపాదకులు**
డా. ఎస్. రఘు, *(సహాయ ఆచార్యులు, ఉస్మానియా విశ్వ విద్యాలయం, హైదరాబాదు)*



ISSN 2766-0168 | అంతర్జాల త్రైమాస పత్రిక | www.prakasika.org | editor@prakasika.org

# అవలోకనం అవశ్యం

భారత దేశం 78 వ స్వాతంత్ర్య దినం జరుపుకుంటున్న సందర్భంగా దేశ విదేశాలలో నివసించే ప్రజలకి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. గత 77 సంవత్సరాలలో దేశం గణనీయమైన ప్రగతి సాధించడం భారతీయులందరికీ గర్వకారణం.

సాధించిన విజయాలను, ఇంకా చేయవలసిన కార్యక్రమాలను బేరీజు వేసుకుంటూ ప్రగతిపథంలో సాగడం వ్యక్తులకైనా, దేశానికైనా అభిలషణీయం. భుజాలు తట్టుకుంటూ, ఛాతీ విరుచుకుని మనమే గొప్పవారమని విర్రవీగడం వ్యక్తులకు ఎంత హానికరమో, దేశాలకీ అంతే హానికరం. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన దేశాలు ఇప్పుడు ఎలా ఉన్నాయో కళ్ళముందు చూస్తున్నాం. ప్రగతి గమ్యం కాదు, నిరంతర ప్రయాణం. శ్రీ శ్రీ అన్నట్టు స్వాతంత్ర్యం వచ్చెనని సభలే చేసి సంబర పడగానే సరిపోదు; సాధించిన దానికి సంతృప్తిని పొంది అదే విజయమనుకుంటే పొరపాటు.

ప్రపంచ మూడవ ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచిందన్న వార్త ఎంత ఆనందకారకమో, ధనవంతుల, పేదల మధ్య అంతరం ఏటా పెరుగుతుందన్న వాస్తవం అంతే బాధాకరం. దేశ స్థూల ఆదాయం కంటే తలసారి ఆదాయం సూచికలు దేశ ఆర్థిక ప్రగతికి సంకేతాలు. తాజా అంచనాల ప్రకారం 65 శాతం సంపద 10 శాతం మంది అత్యంత ధనికుల చేతిలో ఉండగా, కేవలం 64 శాతం సంపద మాత్రమే కింది 50 శాతం సామాన్య ప్రజల దగ్గర ఉంది. అదీకాక, 1 శాతం అత్యంత ధనవంతులు 40 శాతం సంపదని అనుభవిస్తున్నారు. ఆర్థిక అసమానతలు సమాజ ఆరోగ్యానికి, ప్రజాస్వామ్య మనుగడకి మంచిది కాదు.

ఈ పరిస్తితికి ఎవరిని నిందిద్దాం ? ఎప్పుడో వెళ్ళిపోయిన పూర్వ పాలకులను, గత ప్రభుత్వాలని నిందిస్తే పరిస్థితి చక్కబడదు, ప్రజలు ఆమోదించరు. ప్రజారంజక విధానాలు తీసుకొచ్చి అమలు చేయడం పాలక ప్రభుత్వాల బాధ్యత. పూర్తి స్థాయి పెట్టుబడిదారీ విధానం భారతదేశానికి అనువైన వ్యవస్థ కాదు. అమిత ఆర్థిక బలం ఉన్న వ్యక్తులు ప్రభుత్వాలను శాసించే స్థితికి చేరే ప్రమాదం భారత్ తో పాటు ప్రపంచ వ్యాప్తంగా పొంచి ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

ఎందరో వీరులు, కవులు, సామాజిక తత్త్వవేత్తలు, సామాన్య ప్రజలు పోరాడి సాధించిన స్వతంత్ర భారత దేశం మళ్ళీ దాస్య శృంఖలాలలోకి పోకుండా జాగ్రత్త పడవలసిన అవసరం ఉంది. ఆధునిక ప్రపంచంలో ఆర్థిక శృంఖలాలు యుద్ధం కంటే ప్రమాదకరమైనవి. విదేశీ వస్తువులు, ఉద్యోగాల మీద ఆధారపడి నడిచే ఆర్థిక వ్యవస్థ దేశ ఆరోగ్యకర మనుగడకి మంచిది కాదు. పాలకులు ఏ పార్టీకి చెందినవారైనా పాలక, ప్రతిపక్ష పార్టీలు దేశ భద్రత, విదేశాంగ విధానం లాంటి విషయాలలో అహాన్ని పక్కనపెట్టి వ్యవహరించవలసిన అవసరం ప్రస్తుత పరిస్థితులలో ఎక్కువ ఉంది.

నకారాత్మకంగా అనిపించినా ఆవేశంతో, ధర్మాగ్రహంతో రాసిన గేయాలు, పాటలు నిద్రాణంలో ఉన్న జాతిని మేలుకొల్పే ఉత్తేజకాలు. సిరివెన్నెల సీతారామశాస్త్రి గారు రాసిన పాటలోని కొన్ని వాక్యాలని పునఃపరిచయం చేయడం కంటే వేరే సందేశం ఏముంటుంది!!

కులాల కోసం గుంపులు కడుతూ, మతాల కోసం మంటలు పెడుతూ
ఎక్కడలేని తెగువను చూపి తగువుకి లేస్తారే, జనాలు తలలర్పిస్తారే
సమూహక్షేమం పట్టని స్వార్థపు ఇరుకుతనంలో ముడుచుకు పోతూ
మొత్తం దేశం తగలడుతోందని నిజం తెలుసుకోరే, తెలిసి భుజం కలిపి రారే

---

నడిచే శవాల సిగలో తురిమిన నెత్తుటి మందారం, ఈ సంధ్యా సిందూరం
వేకువ వైపా, చీకటి లోకా ఎటు నడిపేవమ్మా! గతి తోచని భారతమా!
అర్ధ శతాబ్దపు అజ్ఞానాన్ని స్వతంత్రమందామా! స్వర్ణోత్సవాలు చేద్దామా!

యుద్ధ నినాదపు అరాజకాన్ని స్వరాజ్యమందామా! దాన్ని సవాలు చేద్దామా!

తన తలరాతను తనే రాయగల అవకాశాన్నే వదులుకొని
తనలో భీతిని తన అవినీతిని తన ప్రతినిధులుగ ఎన్నుకుని
ప్రజాస్వామ్యమని తలిచే జాతిని ప్రశ్నించడమే మానుకొని
కళ్ళు వున్న ఈ కబోది జాతిని నడిపిస్తుందట ఆవేశం
ఆ హక్కేదో తనకే ఉందని శాసిస్తుందట అధికారం

– –

నిత్యం కొట్టుకు చచ్చే జనాల స్వేచ్ఛను చూద్దామా! దాన్నే స్వరాజ్యమందామా!

భవదీయుడు

**డాక్టర్ కొవ్వలి గోపాలకృష్ణ**

ప్రధాన సంపాదకులు, ప్రకాశిక

" When I despair, I remember that all through history the way of truth and love has always won. There have been tyrants and murderers and for a time they seem invincible, but in the end, they always fall... think of it, always. "

– మహాత్మా గాంధీ

## ముఖచిత్రం




## లోపల


తెలుగు గజల్ పరిణామ క్రమం – 2015 నుండి 2025 వరకు ......... 11
తెలుగు గజల్ నేపథ్యం, నియమాలు, లక్షణాలు ......... 33
తెలుగు గజళ్ళ లో చమత్కార సౌరభం......... 57
సి.నా.రె. గజళ్ళ లో సామాజిక అంశం ......... 77
అందం ......... 86
తెలుగు సినిమాపాటల్లో గజల్ సౌందర్యం ......... 87
గజల్ ...భావుకతా సౌందర్యం......... 95
తెలుగు గజల్ – ప్రేమతత్త్వము ......... 102
ప్రణయ గీతి ......... 110
సినారె తెలుగు గజళ్ళలో సాహిత్యం ......... 111
తెలుగు గజళ్ళలో సూఫీ తత్వం – మధుర భక్తి ఆత్మ పరవశం ......... 121
విరహం ......... 131
తెలుగు గజళ్ళు...ప్రగతిశీల భావాలు......... 132


ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు, ఆయా రచయితల స్వంతం. పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధమూ లేదు.

# తస్మాత్ జాగ్రత్త! జాగ్రత్త!

– కాళోజీ

“అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు
ఏపాటి వాడో చూడు
ఎన్నుకుంటే వెలగ బెట్టడం కాదు
ఇందాక ఏం చేశాడో చూడు
ఇప్పుడు కట్టే ముడుపులు కాదు
ఇందాక చెల్లించింది చూడు
పెట్టుకునే టోపీ కాదు
పెట్టిన టోపీ చూడు
ఎగ రేసిన జండాకాదు
చాటున ఆడరచిన దందాచూడు
మనిషిని చూడు, చరిత్రను చూడు
నుడువులు కాదు, నడవడిచూడు”




శ్రీ తుంబలి శివాజీ
✆ 98492 27509

పల్లవి) నమోస్తుతే నమోస్తుతే భారతమాతా...
సమస్త ప్రపంచ ప్రజ సన్నుత చరిత....

చ.1) ప్రాతస్సంధ్యా పులకిత రుచిర సుప్రభాతా
వైతాళిక గళ స్వనిత వైదిక శుభ గీతా...
ఆతత నాసేతు సీత సిత హిమాద్రి సహితా...
భూతిపూర్ణ మహా మహిత, కృషిక సస్య హరితా....

చ2) సుస్మిత జ్యోత్స్నా వర్షిత..సుభాషిణి సుజాత...
విస్మయ కాశ్మీర మకుట విభాసిత పునీతా...
సుస్మృతి యుత చతుశ్రుతీ వాదనబల విదితా...
ప్రస్ఫుట కీర్తిప్రసూన సాలంకృత సమతా...

చ3) సంపన్మయ రత్నగర్భ, సకల ఖనిజ కలితా...
సాంపరాయ జయ విదగ్ధ, జీవనదీ భరితా...
సంప్రదాయ సద్వరేణ్య విశ్వోన్నత చరితా
గుంఫిత సాహిత్య రుచిత, స్వేఛ్ఛాయుత సరితా...
" నమోస్తుతే

ప్రపంచ ప్రజలందరి చేత పొగడబడే చరిత్ర కలిగిన భరతమాతా నీకు నమస్కారం.....

1

ప్రాతఃకాల వేళ సంధ్యాకాంతులతో పులకించే అందమైన సుప్రభాతాలు కలిగినదానవు నీవు...
వైతాళికుల గొంతులో పలికే అందమైన వైదిక శుభగీతాలు కూడినదానవు ...
ఆసేతు హిమాచలము అనేక విభూతులతో సంపదలతో గొప్పవైనదానవు...
పంటచేల ఆకుపచ్చదనంతో విలసిల్లే దానవు....

2

చిరునవ్వుల వెన్నెల కురిసే దానవు....
మంచిని మాట్లాడే దానవు, మంచి పుట్టుక కలిగినదానవు....
ఆశ్చర్యం గొలిపే కాశ్మీరును కిరీటంగా కలిగి వెలుగొందిన దానవు....
నాలుగు వేదాలు, స్మృతుల వాదనాబలంతో తెలియబడేదానవు...
కీర్తి పుష్పాలతో అలంకరింపబడిన దానవు...సమతకు ప్రతీకవు...

3

సకల ఖనిజాలు,సంపదలతో కూడిన రత్నగర్భవు....
యుద్ధ విజయాలతో వెలిగేదానవు...జీవనదులు కలిగినదానవు...
సంప్రదాయంతో విశిష్టతను పొందే విశ్వంలోనే ఉన్నతమైన చరిత్ర కలిగినదానవు...
చక్కగా కూర్చబడిన సాహిత్యంతో వెలిగేదానవు...స్వేచ్ఛా ప్రవాహానివి....



బహుముఖ ప్రజ్ఞాశాలి
కీ.శే. గురజాడ అప్పారావు గారికి
ఈ గజల్ సంచిక అంకితం.

# తెలుగు గజళ్ళు

## ప్రత్యేక సంచిక

సమన్వయ సంపాదకత్వం, నిర్వహణ :
**డాక్టర్ గడ్డం శ్యామలాదేవి**

"తొలిసారిగా తెలుగులో గజల్ తో ప్రభావితులై ఒకానొక గజల్ ఛందస్సుకు దగ్గరగా ముత్యాలసరం సృష్టించిన గౌరవం యుగకర్త శ్రీ గురజాడ అప్పారావు గారికి దక్కుతుంది"

– దాశరథి (జ్వాలాలేఖిని-పీఠికలో )

# తెలుగు గజల్ పరిణామ క్రమం - 2015 నుండి 2025 వరకు

డాక్టర్ గడ్డం శ్యామలాదేవి
97041 75183

## తెలుగు గజల్ వస్తువు విస్తరించిన తీరు

గజల్ అంటే తెలుగులో సల్లాపము అని, ఇంతులతో మంతనాలు అని మొదలైన అర్థాలు చెప్పారు. ఈ ప్రక్రియ అరబ్బీ, పారసి, ఉర్దూ నుండి భారతదేశానికి వచ్చి అనంతరం వివిధ భారతీయ భాషల్లోనికి వచ్చింది.

గజల్ అతి సుకుమారమైన సుందరమైన ప్రక్రియ. అలభ్య అయిన లేదా అప్రాప్య అయిన ప్రేయసి కొరకు ప్రియుడు చేసే అందమైన ఆలాపన గజల్. ఇది ఉర్దూ భాషలో అత్యంత ప్రాచుర్యమైన ప్రక్రియ. ఒకప్పుడు రాత్రంతా మేలుకొని గజల్ షేర్లు గాయకులు లేదా కవులు ఆలపిస్తూ ఉంటే శ్రోతలు లేదా ప్రేక్షకులు కూడా ఎంతో శ్రద్ధతో ఉత్సాహంతో వినడం జరిగేది.

గాఢత, క్లుప్తత, గుప్తత గజల్ లక్షణం. కనీసం ఐదు షేర్లతో మొదలై ఎన్ని షేర్లైనా రాసుకోవచ్చు. విదేశీయులు రాసిన గజల్స్ అన్నీ కూడా దాదాపు విరహంతో కూడినవి. ప్రేమ భావనలు, అమలిన శృంగారము, ప్రియురాలి గురుతులు, తన కురులు, అలాగే ఆమె వాడిన వస్తువులు... ఇలాంటి వస్తువులతో కూడినవే అయి ఉన్నాయి. ఉర్దూ భాషలో కూడా చాలావరకు ఈ ప్రక్రియ ఇదే విధంగా కొనసాగింది. హిందీ, ఉర్దూ వంటి భాషలలో ఒక్కో సందర్భంలో దేశభక్తి, విప్లవం వంటి అంశాలతో గజళ్ళు మనకు కనిపిస్తాయి. ఇక్బాల్ వంటి





కవులు పారసి, ఉర్దూ భాషలో గజళ్ళు రచించారు. అలాగే జలాలుద్దీన్, మహమ్మద్ రూమీ (13వ శతాబ్దం), హాఫీజ్ (14 వ శతాబ్దం) భారత కవులు మీర్జా గాలిబ్ (1797-1869) మహమ్మద్ ఇక్బాల్ (1877-1938) ఇరువురు పారసి, ఉర్దూ భాషలలో గజల్స్ రచించారు.

1965 ఏప్రిల్ 14 ఆంధ్రప్రభ ఉగాది సంచికలో ప్రచురించబడిన దాశరథి గారి "వలపునై నీ హృదయ సీమల నిలువ వలెనని ఉన్నది / పిలుపునై నీ అధర వీధుల పలకవలనని ఉన్నది" అనే మత్లాతో తెలుగు గజల్ ప్రస్థానం మొదలైంది. ఇది తొలి తెలుగు గజల్ గా పిలవబడుతోంది. మొట్టమొదటి గజల్ గాయకుడు పి. బి. శ్రీనివాస్ గారు దాశరథి గారు రాసిన "అధరాల వీధిలోన మధుశాలలున్నదానా..." అనే గజల్ గానం చేశారు.

గజల్లో వస్తువు విషయానికి వస్తే ప్రధానంగా ప్రియురాలి గురించి, ఆమె సౌందర్యం గురించి, ఆమె తనని ప్రేమతో చూడాలని ఆశిస్తూ, అభ్యర్థిస్తూ... రాయడం ప్రధానం. ఇది ఉర్దూ నుండి వచ్చిన సంప్రదాయం. అలాగే దాశరథి గారి మొదటి గజల్ లో వస్తువు ప్రియురాలి గురించి ప్రియుడు పడే ఆరాటం, ఆశ, ఆకాంక్ష. ఆమెను ప్రస్తుతిస్తూ ఆమె హృదయంలో నిలవాలని ఆమె అధరాలలో పలుకునై వశించాలని కోరుకుంటున్నాడు.

గజల్ వస్తువు ప్రేమకు సంబంధించింది అయినా కూడా ఎక్కడా అసభ్య శృంగారము, సంయోగ శృంగారము ఉండదు. ఒక విధంగా చెప్పాలి అంటే అమలిన శృంగారము అని చెప్పవచ్చు.

"రమ్మంటే చాలుగాని రాజ్యాలు విడిచి రానా / నీ చిన్ని నవ్వు కోసం

స్వర్గాలు గడచి రానా” లాంటి గజల్స్ దాశరథి గారు ఈ బాటలోనే రాశారు. ఒకటి రెండు దేశభక్తి ఇతర వస్తువులకు సంబంధించిన గజళ్ళు కూడా దాశరధి గారు రచించారు. ఉదాహరణకు జ్వాలాలేఖినిలో సాఖీ నామా పేరుతో 9 గజళ్ళను ప్రచురించారు దాశరధి.

1965 – 66 నుండి 1980 దశకం వరకు మరల ఎవ్వరు గజల్ ప్రక్రియను తాకడానికి సాహసించలేదు. గజల్ కి ఉన్న నియమాల గురించి కావచ్చు, విషయం గురించి కావచ్చు, ఉర్దూకి సంబంధించిన ప్రక్రియ అని కూడా కావచ్చు. 1980 దశకంలో సినారే మళ్లీ గజల్ ప్రక్రియను ప్రారంభించారు.

“గజల్ అంటే మనది కాదనే గజిబిజి నీకెందుకు” అంటూ సినారే గజల్ ప్రక్రియను చేపట్టారు. దాదాపు 20 సంవత్సరాల తర్వాత తెలుగులో వచ్చిన గజల్ కొంత వస్తువును రూపాన్ని మార్చుకుంది. వస్తువు కేవలం వియోగ శృంగారమే కాకుండా సామాజికాంశాలు, లోక నీతులు, లోక రీతులు, మానవ సంబంధాలు, తాత్వికత, మానవుల నైజం... ఈ మొదలుగా గల వస్తువును గ్రహించింది గజల్. గజల్ ప్రక్రియలో ఈ విధమైనటువంటి పెను మార్పుకు కారణమైన వారు సినారే గారు.




వారు రాసిన “సినారే గజళ్ళు” “తెలుగు గజళ్ళను” గమనించినట్లయితే ఈ విషయం బోధపడుతుంది. వారి గజళ్ళలో మానవీయ సంబంధాలు తెలుగుతనం ఉట్టిపడే విధంగా ఉంటాయి. అలాంటిదే అమ్మ గజల్.

“అమ్మ ఒకవైపు దేవతలంతా ఒకవైపు / సరితూచమంటే నేను ఒరిగేను అమ్మవైపు” అంటారు సినారే. అమ్మకు ప్రత్యామ్నాయం అంటూ ఏదీ లేదు అన్నది మన తెలుగువారి భావన. అందరిలో ఈ భావన ఉన్నా కూడా తెలుగువారిలో ఈ సెంటిమెంట్ చాలా ఎక్కువగా ఉంటుంది. అంటే సినారె గజల్ వస్తువు రీత్యా తెలుగీకరించబడింది. లోకస్వభావం ఉపదేశం క్లుప్తత, గాఢత కలిగి సినారె గజళ్ళలో కనిపిస్తూ ఉంటుంది.

“చిన్న దీపమని అనుకోకు అది చీకటినే కాల్చేస్తుంది/జనమేం

చేస్తారనుకోకు అది జాతకాలు మార్చేస్తుంది"

"ఎంత చీకటి కాల్చెనో ఇంత చల్లని తారక / ఎంత వెలుగును పంచెనో ఇంత సన్నని దీపిక"

"మరణం నను వరించి వస్తే ఏమంటాను నేను ఏమంటాను / పాట పాడి జోల పాడి పడుకోమంటాను, పడుకోమంటాను"

ఇలా ఎన్నెన్నో గజళ్ళను విభిన్న వస్తురకాలుగా రాశారు నారాయణరెడ్డి గారు. ఏదైనా దేనిలోనైనా "మార్పు నా తీర్పు" అంటారు సినారే. ఈ విధంగా తెలుగులో గజల్ తన ఆంతర్యాన్ని సమాజ పరం చేసింది. సమాజంలో జరిగే అవినీతి, అక్రమాలను ఎండగట్టింది సినారే గజల్. అంతేకాదు మనసు మాలిన్యాన్ని తొలగ చేసేలా అరిషడ్వర్గాల గురించి చెప్పి ఎలా అణిచివేయాలో చెప్పారు. తెలుగు గజల్ సినారే చేతిలో తన స్వభావాన్ని, రూపాన్ని కూడా మార్చుకుంది. వారు ఎక్కువగా కాఫీయా, రదీఫ్ లతో కాక అంత్యప్రాస గజళ్ళను రాశారు. ఆ తరువాత "తెలుగు గజళ్ళు" అనే పేరుతో కొన్ని గజళ్ళు రాసి కొన్నింటిలో కాఫియా, రదీఫ్ నియమాలను పాటించారు. ఆ విధంగా గజల్ తన స్వరూప స్వభావాలను కాలానుగుణంగా మార్చుకొని తెలుగు తోటలో స్వేచ్ఛగా విహరించింది.

గజల్ రెండు మార్గాలుగా అయ్యింది ఒకటి దాశరథి మార్గం, రెండు



సినారే మార్గం. ఉర్దూ కవులను అనుసరించి, దాశరథి మార్గాన్ని అనుసరించి రాసిన కవులలో ప్రధానంగా పెన్నా శివరామకృష్ణ గారు ఒకరు. వారి గజళ్ళు అచ్చంగా ఉర్దూ గజల్ భావాలను పుణికి పుచ్చుకొని ప్రియురాలితో సల్లాపం చేస్తూ భావాంతర సీమల్లోనికి ప్రయాణం చేస్తుంది. "సల్లాపం", "శిశిరవల్లకి", "గజల్ సౌందర్యదర్శనం" అనే పుస్తకాలను పెన్నా శివరామకృష్ణ గారు ప్రచురించారు. అలంకారిత, ధ్వని, చమత్కారం ప్రధానంగా వీరు తమ గజళ్ళను రాశారు. ఉర్దూ పదాలను కూడా స్వేచ్ఛగా ప్రయోగించారు.




"మనసులో జప మంత్రముగా నిలిచినది
నీ నామమే../పెదవి వీడని మద్యపాత్రగా
మిగిలినది నీ నామమే..."

పెన్నా శివరామకృష్ణ గారు రచించిన ఈ షేర్ లో ఎంతో లోతైన అర్థం ఉంది. వియోగ ప్రేమ... ప్రధాన వస్తువుగా కనిపిస్తుంది.

రెంటాల వెంకటేశ్వరరావు గారు సినారే మార్గంలో మరింత తెలుగుతనంతో చమత్కారయుతంగా గజల్స్ రాశారు. అయినా వారు వస్తు రీత్యా భావాన్ని వదలకుండా కొన్ని సామాజిక గజళ్ళను కూడా రాశారు. అవి గజల్ శ్రీనివాస్ గారి గానంతో ప్రపంచ వ్యాప్తి పొందాయి. "మంత్రశాల" అనే పుస్తకాన్ని వీరు ప్రచురించారు. వారు రాసిన నాన్న గజల్ :

"ఏమి తండ్రి రెంటాల, కన్నీళ్ళను కూడా దాచి
నాకై చెమటగా ఖర్చు పెడుతున్నది తెలియలేదు
చేయిపట్టి నన్ను నడిపించడమే తెలుసుగాని
నా యాత్రకు శ్రీకారం చుడుతున్నది తెలియలేదు"

ఈ గజల్ పలు వేదికలపై గజల్ శ్రీనివాస్ గారు గానం చేయగా జనాదరణ పొందింది.

గజల్ కవి దిగ్గజం శ్రీ సూరారం శంకర్ గారు అధ్యయనశీలి. వారు అంత్యప్రాస గజళ్ళలోనూ ఎక్కువగా రాస్తూ తాత్విక భావనలకు పట్టు కొమ్మగా నిలిచారు. అద్భుతమైన కాఫీయా పదప్రయోగాలు చేయడంలో వీరు దిట్ట. తాత్విక భావాలు కూడా ఉర్దూ గజల్ సాహిత్యంలో ఉన్నవే. వీరు "సౌగంధిక", "సౌపర్ణిక", "నీహారిక", "లహరిక" అనే గజల్ సంపుటాలను వేశారు.

డాక్టర్ గడ్డం శ్యామల గారు "మయూరి" అనే కలం పేరుతో రచనలు చేస్తూ ఉంటారు. "వాసంత సమీరాలు" (2017), "హేమంత తుషారాలు" (2019), "శరద్వల్లరి" (2022) గజల్ సంపుటలను ప్రచురించారు. వీటిలో మొదటి రెండు దాశరధి మార్గానికి చెందినవిగా వస్తువు విషయంలో చెప్పవచ్చు. శరద్వల్లరి కొంత తాత్వికత సామాజికాంశాలతో కూడి ఉన్నది. ఇవే కాక "సారంగి స్వరాలు", "సాంధ్యవర్ణాలు" అనే గజల్ సంకలనాలకు సంపాదకత్వం వహించారు.

గజల్ ప్రక్రియ సాహిత్య ప్రక్రియగా వెలుగొందడానికి గజల్ సాహితీ సప్తాహం నిర్వహించారు. కొమర్రాజు ఫౌండేషన్ ద్వారా గజల్ సినారె పురస్కారాన్ని ప్రధానం చేస్తున్నారు. గడ్డం శ్యామల గారు రాసిన కొన్ని గజల్స్ నుంచి కొన్ని షేర్లను ఇక్కడ గమనిద్దాం.

**శ్రీ కొరుప్రోలు మాధవరావు గారు వేల సంఖ్యలో గజళ్ళను రాస్తున్నారు.**

"నిదుర లేక కనురెప్పలు అలసిపోయె కథేమిటో
విడువలేని వాసంతం మరలిపోయె కథేమిటో"

ఈ గజల్లో ప్రేమ, విరహం ప్రధానమైనటువంటి వస్తువులుగా కనిపిస్తాయి అలాగే మరో గజల్లో...

"కాలం నదిలో కాయం పయనం ఎందాకా
శోకం మదిలో గాయం శయనం ఎందాకా"

ఈ గజల్లో ఆధ్యాత్మికత, తాత్వికత, వేదాంతం ప్రధానమైనటువంటి వస్తువుగా మనం గమనించవచ్చు.

ఆచార్య ముకుంద సుబ్రహ్మణ్య శర్మ గారు మరో గజల్ కవి. వీరు పుస్తకాలు ప్రచురించకున్నా అత్యంత ప్రతిభావంతంగా అధ్యయనశీలతతో ఉర్దూ బహర్ చందస్సులో గజళ్ళను రాశారు. గజలియత్ తో గజళ్ళు రాసి సామాజిక అంశాల వస్తువుతో కూడా చాలా అద్భుతమైన గజళ్ళను రాస్తున్నారు. ఉదాహరణకి వీరు రాసిన గజల్లోని ఒక షేర్ పరిశీలిద్దాం.

"సాయం అయ్యే చేయి కన్నా బంధం ఎక్కడ ఉన్నదోయి
ప్రేమ నిండిన మనసు కన్నా దైవం ఎక్కడ ఉన్నదోయి"

అంటూ సామాజిక సమస్యలపై స్పందిస్తూ వీరు గజళ్ళను రాశారు. ఇంకా రాస్తూనే ఉన్నారు.

శ్రీ కొరుప్రోలు మాధవరావు గారు వేల సంఖ్యలో గజళ్ళను రాస్తున్నారు. వీరి గజల్ పుస్తకాలు "మాధవ మందారాలు-1", "మాధవ మందారాలు -2", "మాధవ మంజరి", "ఆరాధ్య" అనే గజల్ సంపుటాలను ప్రచురించారు.

వీరి గజళ్ళలో వస్తువు ప్రేమైకమయం, ఆధ్యాత్మికత, వేదాంతం, సూఫీ తత్వం కలగలిసి ఉంటాయి.

ఉదాహరణకు వీరి గజల్స్ లో కొన్ని షేర్లను పరిశీలిద్దాం.

నీ సిగలో మల్లెలింటి..రాగసుధకు ఊయలనే..!
నీ వాడని వలపుపూల..పాటలయకు ఊయలనే..!
లేదు ఆశ ఒకేధ్యాస..నీ ఊసుల సాక్షికాగ..
పలుకుతేనె వర్షించే..శుభవేదకు ఊయలనే..!
అక్షరరమ్యత నిండిన..గజలే నీదోయ్ మాధవ..
నా మనసే నీదుచెలిమి..వెన్నెలలకు ఊయలనే..!

శ్రీ అనే కలం పేరుతో రచనలు చేసే గజల్ కవి ఆర్ వి ఎస్ ఎస్ శ్రీనివాస్ గారు గజల్లలో తఖల్లూస్ గా "నెలరాజా" అని వాడతారు. వీరు "పున్నమి పూలు", "కలల కౌముది", "శ్రీరాగచంద్రిక", "వెన్నెల సుమాలు", "శీతల తరంగిణి" అనే గజల్ పుస్తకాలను ప్రచురించారు. వీరి ప్రచురణకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ కూడా వచ్చింది. వీరి గజల్లలో ఎక్కువగా వియోగ శృంగారము, నాయక వర్ణనలతో చమత్కారయుతమైన షేర్లు ఎక్కువగా ఉంటాయి. ప్రధాన వస్తువు ప్రేమ. ఉదాహరణకు ఒక గజల్లోని షేర్ ను పరిశీలిద్దాం.

> **అమృతం కోసం చూస్తే గరళం ఒలికింది, ప్రేమను ఆశిస్తే వియోగం సంభవించింది అంటూ ఇలా..**

"భగ్న ప్రేమికుడికే ఎన్నెన్ని బాధలో...
గాయాల గుండెలో ఉబికింది ఒక పాట."

భగ్న ప్రేమికుడి గాయాల గుండెతో పాటను వినిపించాడు అనే అర్థం లో రాసిన ఈ షేర్ చాలా అత్యద్భుతంగా ఉంటుంది. అలాగే మరో షేర్ లో

"వలపు సుధను తాగాలని ఎంత తపము చేసిందో
ఏ గరళం ఒలికిందో మనసు విరిగిపోతున్నది.."

అమృతం కోసం చూస్తే గరళం ఒలికింది, ప్రేమను ఆశిస్తే వియోగం సంభవించింది అంటూ ఇలా చమత్కారభరితమైన షేర్లు ప్రేమ అనే వస్తువుతో రాశారు.

రోచిష్మాన్ గారు గజల్ పట్ల అవగాహన కోసం కొన్ని వ్యాసాలను రాశారు.. తెలుగులోనే కాక వీరు ఇతర భాషల్లో కూడా గజళ్ళు రాశారు. ప్రేమ ప్రధాన వస్తువుగా తీసుకొని వీరు గజల్ రాశారు.

సీనియర్ గజల్ కవయిత్రి వాణి వెంకట్ గారి గజల్స్ మానవ సహజమైన వేదనలకు, విషాదాలకు ఉద్వేగాలకు సంబంధించినవిగా ఉంటాయి. పుత్ర ప్రేమకు సంబంధించి అమ్మ పడే వేదన (తను దూరం కాగా) లాంటి మానవ సంబంధాలు ప్రధాన వస్తువుగా తీసుకొని వీరు గజల్స్ రాశారు.

**ముందుగా చెప్పుకున్నట్లుగానే దాశరథి గారు తొలి తెలుగు గజల్ కవి అని చెప్పుకోవచ్చు. వారు దాదాపు 12 గజళ్ళను మాత్రమే రాశారు.**

2015 నుంచి 2025 వరకు వచ్చిన గజల్ సంపుటాలను వస్తువులు బట్టి విభాగాలుగా చేసుకున్నప్పుడు ఏ కవులు ఎక్కువగా ఏ విభాగంలో గజల్ రచన చేశారో తెలుస్తుంది.

ప్రేమ—— (వియోగ శృంగారము, వర్ణనాత్మక ప్రేమ), సామాజికం, తాత్వికత, భక్తి , సూఫీ, వైరాగ్యం, కుటుంబం,ఆధ్యాత్మికం అనే వస్తు ప్రధానంగా దాదాపు ఒక దశాబ్ద కాలంలో వచ్చిన గజళ్ళ పుస్తకాలను, వాటిలో ఉన్న వస్తువును ఈ ఒక్క వ్యాసంలోనే ఆమూలాగ్రం సమీక్షించడం అసాధ్యం. నా అంచనా ప్రకారం ఈ దశాబ్దంలో దాదాపు 250 గజల్ సంపుటులు వచ్చి ఉండవచ్చు. అందులో అన్ని సంపుటులు లభ్యం కావడం సాధ్యపడదు కావున నాకు దొరికిన, నేను చదివిన, అలాగే ముఖ పుస్తకంలో ప్రచురించబడిన గజళ్ళలోని వస్తువును దాని భేదాలను చెప్పడానికి ప్రయత్నిస్తాను.

ముందుగా చెప్పుకున్నట్లుగానే దాశరథి గారు తొలి తెలుగు గజల్ కవి అని చెప్పుకోవచ్చు. వారు దాదాపు 12 గజళ్ళను మాత్రమే రాశారు. వాటిలో పది మాత్రమే మనకు లభ్యమవుతున్నాయి. వారు లక్షణయుతంగా రాసిన గజళ్ళలో ప్రధాన వస్తువు ప్రేమ. అది వియోగ శృంగారంతో కూడిన ప్రేమ. ఇవి కాక కొన్నింటిలో సామాజికం మరికొన్ని ఉద్యమానికి సంబంధించినవిగా ఉన్నాయి.

ఆయన గజళ్ళలో ఒక గజల్ 'కన్నీట తడిసిన గజల్' అని అనేది.

"ముజీబ్" అని ఒక ఉద్యమ వీరుడు చనిపోతే తన నేస్తం గురించి స్మృత్యంజలి గజల్ గా రాశారు. దాశరధి ఆదర్శంగా రాసిన గజల్లలో ప్రధానమైన వస్తువు మాత్రం "ప్రేమ" అని చెప్పవచ్చు.

> సల్లాపం, శిశిర వల్లకి ఉర్దూ భావ సౌందర్యానికి దగ్గరగా ఉన్నాయి.

దాశరధి గారి తర్వాత డాక్టర్ సి నారాయణ రెడ్డి గారు తెలుగు గజల్ ను ప్రాచుర్యంలోకి తీసుకొని వచ్చారు. వారు రచించిన "తెలుగు గజళ్ళు", "సినారె గజళ్ళూ" రెండింటిలోనూ వస్తువు సామాజికం, కౌటుంబికం, మానవీయం. గజల్ లో ప్రధాన వస్తువు అయిన ప్రేయసి ప్రియుల ప్రేమ నుండి పక్కకు వచ్చారు. వస్తువులో స్వేచ్ఛ తీసుకున్నారు. అదే తర్వాత గజల్ కవులకు మార్గదర్శకమైంది.

తరువాత రెంటాల శ్రీ వెంకటేశ్వర రావు గారు, రసరాజు గారు, తటవర్తి మొదలైన వారి గజళ్ళలో ప్రధాన వస్తువు కౌటుంబికం, నాన్న, అమ్మ, ఆలి, ఊరు, ప్రేమ... ఇలా తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే గజళ్ళు వచ్చాయి. అన్నింటిలోనూ చమత్కారం ప్రధానంగా సాగింది.

పెన్నా గారిది విలక్షణ పద్ధతి. వారు తెలుగు గజళ్ళపై సంపూర్ణ అవగాహన పెంచుకొని ఈ ప్రక్రియకు మూలమైన ఉర్దూ కవుల భావజాలాన్ని పట్టుకొని సాహిత్యం కొరకు మాత్రమే గజల్స్ రాశారు.

"సల్లాపం", "శిశిర వల్లకి" ఉర్దూ భావ సౌందర్యానికి దగ్గరగా ఉన్నాయి. తెలుగు గజల్ కు లక్షణ గ్రంథము అనదగిన "గజల్ సౌందర్య దర్శనం" కూడా వీరు రచించారు. ప్రధానంగా వియోగ శృంగారం, ప్రేమ వీరి వస్తువులు.

మాధవరావు కొరుప్రోలు, ఆర్ వి ఎస్ ఎస్ శ్రీనివాస్, వాహెబ్, గడ్డం శ్యామల, MBD శ్యామల, మొదలగు వారు వారి గజల్లలో ప్రధానంగా ప్రేమ, వియోగ శృంగారం, వస్తువుగా తీసుకొన్నారు. వీటిల్లో అంతర్లీనంగా ఆధ్యాత్మికత, మార్మికత ఉన్నప్పటికీ బాహ్య రూపం ప్రేమ అని చెప్పుకోవచ్చు.

అలాగే ముకుంద సుబ్రహ్మణ్య శర్మగారు, బైరి ఇందిర గారు వారి గజళ్ళలో సామాజికం ప్రధాన వస్తువుగా ఉంటుంది. "సవ్వడి" "తెలంగాణ గజల్ కావ్యం" మొదలైన గజల్ సంపుటాలను కీర్తిశేషులు బైరి ఇందిర గారు ప్రచురించారు. తెలంగాణ గజల్ కావ్యంలో మలిదశ తెలంగాణ ఉద్యమం గురించి గజళ్ళను రూపొందించారు. బైరి ఇందిర గారి ఒక షేర్ :

**ఖమ్మం కవులు పోతగాని సత్యనారాయణ గారు స్వప్న శిల్పాలు, అనే గజల్ పుస్తకం ఆవిష్కరించారు.**

"తాజు మహలు నిలిచేదా ప్రేమనేది బాధని అనుకంటె
గజలు సుధను కురిసేదా బాధనేది చేదని అనుకుంటె..."

ఇలా మనకు ఉర్దూలో మగ్దూమ్, మొహిద్దిన్ కూడా విప్లవాన్ని ప్రేయసిగా భావించి గజళ్ళను ఉర్దూలో రాశారు

MBD శ్యామల గారు నాలుగు గజల్ సంపుటాలను తీసుకొని వచ్చారు. ప్రధానంగా ప్రేమ ఉన్నా, సామాజికం, తాత్వికత గజళ్లు కూడా వారి సంపుటాలలో ఉంటాయి. ఆవిడ రాసిన ఒక గజల్ ను "నీది నాది ఒకే కథ" అనే సినిమాలో కూడా తీసుకున్నారు. అది ఒక వైరాగ్య గీతంలా ఉంటుంది.

ఉదా..

"హృదయమెంత తపిస్తే బ్రతుకు విలువ తెలిసింది...
గుండెనెంత మధిస్తే కన్నీటి విలువ తెలిసింది!
రాలిన పూలను తెచ్చి కొమ్మకు అతికిస్తావా?
మనిషి దూరమయ్యాక మనసు విలువ తెలిసింది!"

ఖమ్మం కవులు పోతగాని సత్యనారాయణ గారు "స్వప్న శిల్పాలు", అనే గజల్ పుస్తకం ఆవిష్కరించారు. ఈయన "తెలుగు గజళ్ళు – ఒక పరిశోధన" అనే అంశం మీద ఒక గ్రంథాన్ని రాసి పీహెచ్డీ డాక్టరేట్ పట్టా పొందారు. 2017, 2018 లో ప్రచురింపబడ్డ వీరి గజల్ సంపుటాలలో సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తూ గజళ్ళుగా రాశారు. వీటిలో వియోగ ప్రేమను తెలిపే గజల్స్ కూడా ఉన్నాయి. కానీ ప్రధానంగా వీరి వస్తువు గురించి చెప్పుకోవాల్సింది

వస్తే సామాజికం అని చెప్పవచ్చు.

ఉదా..
పోతగాని గారి గజల్లో ఓ షేర్:
“శంఖమంటి కంఠమున్న కలువకనుల కన్నెపిల్ల!
మరులుగొలుపు నాపాటల గాలానికి చిక్కిందీ!!

కన్నెగంటి వెంకటయ్య గారి “మమతల హృదయాలు” సంపుటిలోనుంచి ఓ షేర్ మచ్చుకి –

“కులం ఎంత కుటిలమైనదో కుములుతున్న జాతిని అడుగు/మతం ఎంత మలినమైనదో మండుతున్నా చితిని అడుగు”

సూరారం శంకర్ గారి గజళ్ళు ఎక్కువగా సినారే గజళ్ళ వలె అంత్యప్రాస గజళ్ళుగా ఉంటాయి. తాత్వికంగా ఉంటాయి ఒక్కోసారి సూఫీ కవిత అనిపిస్తుంది. ఆలోచింపచేస్తాయి, వస్తు పరంగా విలక్షణంగా ఉంటాయి.

**2020 నుంచి 2024 వరకు గజల్ సాహిత్యం చాలా విస్తరిల్లింది. దానికి కారణం కొంతమంది గజల్ నియమాలను సడలించడం కారణం కావచ్చు.**

ఉదా –

“నీవు ఎవరో నేను ఎవరో ఏరు దాటాకా...
నిప్పు ఏదో ఛాయ ఏదో నిజము తెలిశాకా...”
“ఏ అక్షరానికి తెలియదు తన ఉనికి బలమెంతో
ఏ పావురానికి తెలియదు తన రెక్క బలమెంతో”

అంటూ ఇలా అద్భుతమైన షేర్లను రాశారు. వీరి గజళ్ళు గానయోగ్యంగానూ ఉంటాయి. వీరివి దాదాపు 2005, 2006 నుండి పుస్తకాలు వచ్చినా “నీహారిక”, “లహరిక” పుస్తకాలను మాత్రమే ఈ వ్యాసంలో పేర్కొనడం జరిగింది. ఆ ప్రకారంగా వీరి గజల్లలో ప్రధాన వస్తువుగా తాత్వికతను చెప్పవచ్చు.

2020 నుంచి 2024 వరకు గజల్ సాహిత్యం చాలా విస్తరిల్లింది. దానికి కారణం కొంతమంది గజల్ నియమాలను సడలించడం కారణం కావచ్చు. 2017 లో కాసోజు లక్ష్మీనారాయణ “రసమంజుష” అనే గజల్ సంపుటిని

వేశారు. అది కూడా తాత్విక గజల్ వస్తు పరంగా అనుకోవచ్చు.

భక్తి గజళ్ళ లో మొదటిది శ్రీమతి రాజేశ్వరి రాసిన "ఆరాధన". ఇది భక్తి ప్రధానమైన వస్తువుగా కృష్ణుడిపై గోపికల ఆరాధన గురించి రాసింది. అలాగే ఉమాదేవి జంధ్యాల గారు గోదాదేవి పాశురాలను గజళ్ళుగా రాశారు. అవి శ్రీ రంగనాథుని గోదాదేవి గురించిన భక్తి గజల్ పుస్తకం వలనే గ్రహించవచ్చు. దీనిలో ప్రేమ ఉన్నప్పటికీ దానికి మూలం తమిళ పాశురాలు. వాటినే ఆమె తన గజల్ ఫార్మేట్ లో రాయడం అనేది విశేషం. ఇలాంటి భక్తి గజళ్ళనే ద్యావరి నరేందర్ రెడ్డి గారు "శ్రీ వెంకటేశ్వర భక్తి గజళ్ళు" అలాగే "శ్రీ లక్ష్మీ నరసింహ" అంటూ భక్తి గజల్ పుస్తకాలను ప్రచురించారు. వీరి గజళ్ళలో ఆధ్యాత్మికం, వైరాగ్యం, భక్తి ప్రధాన వస్తువులుగా కనపడతాయి.

**పిల్లనగ్రోవి గజల్ సంపుటి ఒక మధుర భక్తి వస్తువుగా తీసుకున్న గజల్ సంపుటి. సూఫీ తత్వం కూడా కొన్ని గజళ్ళలో కనిపిస్తుంది.**

ఈ మధ్యకాలంలో వివివి కామేశ్వరి గారు కూడా గోదాదేవి పాశురాలను గజళ్ళుగా రాశారు.

విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి పండిట్ "యోగ రేఖలు" మొదలైన నాలుగు గజల్ సంపుటాలను ప్రచురించారు. దాదాపు ఆధ్యాత్మికత వీటిలో ప్రధాన వస్తువుగా ఉన్నది. యోగ రేఖలలో యోగం అనేది త్రివిధాలుగా నడిచింది. భక్తియోగం, జ్ఞానయోగం, మోక్షయోగం ఇలా ఆధ్యాత్మికత అనేది వస్తువుగా తీసుకొని అనేక గజళ్ళను రచించారు.

మరొక చెప్పుకోదగిన కవయిత్రి విజయ గోలి గారు. వీరు రాసిన "చిత్ర వీణ", "పిల్లనగ్రోవి" గజల్ సంపుటాలలో ఎంతో ఆలోచనలు ఉన్నాయి.

పిల్లనగ్రోవి గజల్ సంపుటి ఒక మధుర భక్తి వస్తువుగా తీసుకున్న గజల్ సంపుటి. సూఫీ తత్వం కూడా కొన్ని గజళ్ళలో కనిపిస్తుంది. దీనిలో చివరి 8 గజళ్ళలో అష్టవిధ శృంగార నాయికల భావాలతో గోపికలు రాధమ్మ కృష్ణునికై పడిన ఆరాటం కనిపిస్తుంది.

"మేఘమంటి తెలి చీరలో మేని మెరుపు విరుపులుగా
మరు మల్లెల మాలలతో మురిపించెను మైమరపు"

మేలి ముసుగులో వెళ్లే రాధమ్మను అభిసారికగా అందునా జ్యోత్స్నాభిసారికగా చెప్తారు. ఇక్కడ మధురభక్తి, ప్రేమ, వస్తువుగా కనిపిస్తుంది. విరహ ప్రేమలో ఇది కూడా ఒక భాగం.

గజల్ సాహిత్యంలో మరొక ప్రముఖ కవి బిక్కి కృష్ణ గారు. వి. జి. ఎఫ్. కార్యదర్శి. వీరు "స్వాంతన", "వల్లరి", "శిథిల వసంతం" అనే గజల్ సంపుటాలను ప్రచురించారు. వీరు ప్రేమ, విరహం గజళ్ళుగా రాసినా ప్రధానంగా సామాజిక అంశాలను వస్తు ప్రధానంగా తీసుకొని గజళ్ళను రచించారు. స్వాంతనలో వీరు రాసిన ఒక షేర్

**బిక్కి కృష్ణ గారి గజళ్ళలో సామాజిక అంశాలు ప్రధాన వస్తువుగా గ్రహించినట్లుగా తెలుస్తుంది.**

"నిర్దయగ బాణమేసి ప్రాణం తీసింది ప్రేయసి
ప్రేమ పక్షిని విసిరేసి తలుపేసింది ప్రేయసి"
విరహ ప్రేమను నాయిక నిర్దయను హృద్యంగా చెప్పారు. అలాగే
"రైతులపై పూలు జల్లి దైవాలను పూజించడం
నాగళ్ళకు నమస్కరించి శ్లోకాలను పఠించడం",
"నీ దేశపు జెండాలో ఆకుపచ్చ రైతు కదా..."

ఇలాంటి ఎన్నో సామాజిక అంశాలను స్పృశిస్తూ గజల్స్ రాశారు ఆయన. వైవిధ్య భరితమైన వస్తువు తీసుకున్నప్పటికీ ప్రధానంగా శ్రమజీవుల కష్టం గురించిన గజల్ ప్రధానంగా ఉంటాయి. కనుక వీరి గజలలో సామాజిక అంశాలు ప్రధాన వస్తువుగా గ్రహించినట్లుగా తెలుస్తుంది.

T. V. S. రామకృష్ణమాచార్యులు, Dr. రామశర్మ గారు కూడా విభిన్న అంశాలను స్పృశిస్తూ, వివిధ అంశాలను వస్తువులుగా తీసుకొని గజల్స్ రాశారు.

Dr. రామశర్మ గారు తాను గజళ్ళు రాస్తూనే ఎంతోమందికి ప్రోత్సాహాన్ని

అందిస్తున్నారు....గజల్ ఛందో రీతులను వివరిస్తూ గజల్ కవులను గజళ్ళు రాసేలా చూస్తున్నారు. తమ రవళి పత్రికలో ఇతర కవుల గజళ్ళు ప్రచురించి వారిలో ఉత్సాహాన్ని నింపుతున్నారు.

రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి గారు మరొక గజల్ కవయిత్రి. వీరు పది గజల్ సంపుటాలను ప్రచురించారు. “మోహన”, “కైత”, “కైరవి... మొదలగునవి. వీరి వస్తువు వియోగ శృంగారం, ప్రేమ భావుకతతో ప్రధానంగా సాగే గజళ్ళు.

**కనిపిస్తూనే ఎంతగ బాధిస్తున్నావో తెలియదు నీకు -**
**ప్రేమిస్తూనే ఎంతగ వేధిస్తున్నావో తెలియదు నీకు**

అలాగే మరో గజల్ రచయిత్రి, గజల్ గాయని శ్రీమతి జ్యోతిర్మయి మళ్ళ గారు. తన పుస్తకం పేరు “చూపు ఎంత అలసిందో...” ఆమె గజల్ పుస్తకం నుంచి ఒక గజల్ను పరిశీలిద్దాము.

“ కనిపిస్తూనే ఎంతగ బాధిస్తున్నావో తెలియదు నీకు
ప్రేమిస్తూనే ఎంతగ వేధిస్తున్నావో తెలియదు నీకు “

ప్రేమను ప్రధానమైన వస్తువుగా తీసుకొని రాసిన ఈ గజల్లో... తన బాధ యొక్క తీవ్రతను తెలియజేసే ప్రయత్నం చేశారు.

ఇరువింటి వెంకటేశ్వర శర్మ గారు మరో గజల్ కవి. వీరు ఫేస్బుక్ మాధ్యమంలో “గజల్ సాహిత్య వేదిక” సమూహానికి అధ్యక్షులు. ఇది ఒక గజల్ సంస్థగా పరిణితి చెందుతోంది. “మధు వర్షిణి “, “మధురోహలు” రెండు గజళ్ళ సంపుటలే కాక మూడు గజల్ సంకలనాలు కూడా వెలువరించారు శర్మగారు. “గుల్బహార్” పేరుతో గులాబీల గజళ్ళు అని బహర్లలో తొలి తెలుగు గజల్ సంకలనం తీసుకువచ్చారు. వీరి గజల్ సంపుటాలు “మధురోహలు”, “మధు వర్షిణి”లో కూడా ప్రధాన వస్తువు ప్రేమ, విరహం ఆనుషంగికంగా సామాజిక, రాజకీయం మొదలుగు అంశాలు గజళ్లుగా రాశారు.

“అందానికి దాసుడనై వెళ్లలేక పోతున్నా
అనిమిషనై నా కనులను మూయలేకపోతున్నా”

మరో గజల్లో

"నేతిబీరకాయన నెయ్యి వెతకడమే మూర్ఖత్వం
నీతిలేని నేతను కీర్తించడమే మూర్ఖత్వం"
అంటూ చురక అంటించినట్లుగా చెప్తారు.

బెజ్జిపురం వెంకట్ గారు "సాలంకృత" అనే గజల్ పుస్తకాన్ని ప్రచురించారు. దీనిలోనూ ప్రధానంగా వస్తువు సామాజికం.

"మండేలా గుండెలోన మండితేనే విప్లవమోయి
బానిసత్వ శృంఖలాలు తెంచితేనే విప్లవమోయి"

ఇలాంటి సామాజిక చైతన్యం అందించే గజళ్ళు ఎన్నో రాశారు. వీరు ప్రేమకు సంబంధించిన గజళ్ళు కూడా రాసినప్పటికీ వాటి సంఖ్య చాలా తక్కువ. సామాజిక సమస్యలకు తక్షణం స్పందించి గజళ్ళను రాస్తుంటారు. ఎక్కువగా రైతులకు సంబంధించి సామాజిక అసమానతలను సంబంధించిన గజళ్ళు ఉంటాయి.

**విజయలక్ష్మి కందిబండ గారి గజళ్ళలో ఎక్కువగా విరహం,ప్రేమ వస్తువుగా ఉన్నది.**

విజయలక్ష్మి కందిబండ మరో గజల్ కవయిత్రి. "చంద్రసఖీ" పేరుతో గజల్ సంపుటిని ప్రచురించారు.

"మధురామృత రసయోగం విరహంలో సిద్ధించునులే
విజయ గజలు విశ్వ ప్రేమ వాహినిగా పొంగునులే"

అని విరహంలో రసయోగం ఉంటుందని చెప్పారు. వీరి గజళ్ళలో ఎక్కువగా విరహం, ప్రేమ వస్తువుగా ఉన్నది. వ్యక్తి ప్రేమను విశ్వప్రేమగా కూడా చూడడం ప్రత్యేకత. సామాజిక అంశాలలో మానవత్వవాదం, ప్రకృతి మొదలగున అంశాలతో కూడిన గజల్ కూడా వీరి రచనలలో మనకు ప్రధానంగా కనిపిస్తాయి. అయినప్పటికీ ప్రధాన వస్తువుగా చెప్పాల్సి వస్తే "ప్రేమ" అని చెప్పవచ్చు.

గద్వాల కిరణ్ కుమారి 2017, 2018 లలో "గజల్ కిరణాలు" అనే గజల్ సంపుటిని ప్రచురించారు. వీరి గజళ్ళలో ప్రధానంగా సామాజిక అంశాలు ప్రస్తావనకు వస్తాయి. మహిళల గురించి వారి శ్రమను గురించి అసమానతల

గురించి వేదనల గురించి గజల్స్ ఉంటాయి. ప్రధానంగా వస్తువు విషయానికి వస్తే సామాజిక గజళ్ళు అని చెప్పవచ్చు.

మహిళా గజల్ కవయిత్రులు అందరి గజళ్ళలో వారు రాసే గజళ్ళలో వారి ఆంతరంగిక వేదన సుస్పష్టమవుతుంది అని చెప్పవచ్చు.

**చీకటి వెలుగుల మధ్యన ఎన్నో స్వప్నాలున్నవి - రేపటి ఆశకు జీవం పోసే హర్షాలున్నవి**

గజల్ కి వేదన, ఆర్ద్రత అవసరమే. అది ఒక వ్యక్తి వలన కావచ్చు, ప్రేమ వలన కావచ్చు, సమాజం వలన కావచ్చు, అసమానతల వలన కావచ్చు, మనసు గాయపడినప్పుడు, మనసు పడిన సంఘర్షణ వేదనల పరితాపమే గజల్ అవుతుంది.

ఎంవి ఉమాదేవి మరో గజల్ కవయిత్రి. "హరిణ వల్లరి" అనే గజల్ పుస్తకాన్ని ప్రచురించారు. మంచి కవయిత్రి విమర్శకురాలు. తను ప్రధానంగా ప్రేమ విరహం గజళ్ళను అద్భుత చమత్కారంతో సృష్టించగలరు.

"చీకటి వెలుగుల మధ్యన ఎన్నో స్వప్నాలున్నవి
రేపటి ఆశకు జీవం పోసే హర్షాలున్నవి"

అంటూ ఆశాభావాన్ని వ్యక్తం చేసే గజళ్ళు రాశారు. వీరి గజళ్ళలో ప్రధానంగా వస్తువు ప్రేమా విరహం.

మరొక గజల్ కవయిత్రి రాజశేఖరుని శ్రీ శివలక్ష్మి. తను ఇంతవరకు పుస్తకం తీసుకురాకపోయినా ఒక 600 వరకు గజల్స్ రాసి ఉంటుంది. తాత్వికత ఆధ్యాత్మికత వస్తువులుగా కలిగిన ఆలోచింపజేసే గజళ్ళు ఆమె రాస్తారు.

"గుండె గొంతు ఎండుతోంది నా దాహం తీరనిదా!
చివరి శ్వాస విడుస్తోంది ఈ వేణువు మోగనిదా!"
మరో గజల్ లో ఓ షేర్..
"మనసు మారి తానొస్తే నీ హృదయం చదవద్దా...?
సమాధిపై తనకోసం ప్రేమలేఖ రాసి ఉంచు...."

ప్రేమ విరహం వీటితో ఒక తాత్వికత వేదనను కలగలిపి రాయడం ఒక

నేర్పు. సత్య స్వరాళి తఖల్లుస్ కలం పేరుగా కలిగిన శివలక్ష్మి రాసిన గజల్ ఇది. తను రాసిన గజళ్ళన్నీ చివరికి ఆధ్యాత్మిక వస్తువుగా పరిణామం చెందుతాయి.

నీ మనసును
తొలిచేసే ఆ కష్టం
నాకిచ్చేయ్ -
నీ పెదవుల చిరునవ్వై
ఉదయిస్తూనే
ఉంటా

మరొక గజల్ కవయిత్రి సుబ్బా జ్యోత్స్న. "నాతో నేను కాసేపు..." అనే పేరుతో గజల్ పుస్తకాన్ని ప్రచురించి గజల్ కవయిత్రిగా స్థానాన్ని ఏర్పరచుకున్నది జోత్స్నా. ప్రేమ ప్రధాన వస్తువుగా చాలా గజళ్ళు రాశారు. వియోగ శృంగారాన్ని తమ అక్షరాలలో బాగా పలికించారు.

"శిలను కాను వలపు నేను నా తలపుకు శిలువేయకు
జ్ఞాపకాల కత్తులతో గుచ్చుతోంది నీవేగా..."

ఈ షేర్లో విరహబాధ మనకి సుస్పష్టంగా కనిపిస్తుంది. ప్రధాన వస్తువుగా ప్రేమ విరహం వీటిని చెప్పవచ్చు.

మరో గజల్ కవయిత్రి హంస గీతి గారు. వీరి గజల్ సాధారణంగా ప్రేమ విరహం వస్తువులుగా ఉంటాయి. వారి గజల్ లో ఒక షేర్ని చూద్దాము.

"వలపు పిలుపు వినిపిస్తే మనసు తెలిసి రాలేవా...
మూసి ఉన్న రాతి గుండె తలుపు తెరిచి రాలేవా..."
ఒక తీక్షణమైన వియోగ బాధ ఈ షేర్లో కనిపిస్తుంది.

మరో గజల్ కవయిత్రి శిరీష ఉటూరి గారు. "వెన్నెల సిరులు" అనే పేరుతో గజల్ సంపుటిని ప్రచురించింది. పేరుకు తగ్గట్టుగానే వెన్నెలను కురిపించే విరహశృంగారాన్ని వర్ణించిన గజళ్ళను వస్తువుగా ఉన్న సంపుటి ఇది.

"నీ మనసును తొలిచేసే ఆ కష్టం నాకిచ్చేయ్
నీ పెదవుల చిరునవ్వై ఉదయిస్తూనే ఉంటా"

మరొక గజల్లో

"నీవు లేని కాలంతో సఖ్యంగా ఉండలేను
ఎడబాటుకు అప్పగించి బాధించకు సదా సఖీ..."

ఇలాంటి మధుర ప్రేమ, విరహం వస్తువులుగా గజళ్ళను రాసింది శిరీష.

సీతా సొంపాక వీరు సామాజిక కోణంలో గజల్ రాసి అందరి మెప్పులు పొందుతున్నారు. గజల్ కు మూలమైన ప్రేమ, విరహం గజళ్ళను రాస్తూనే సామాజిక సమస్యలకు స్పందిస్తూ గజళ్ళని రాస్తారు. పసి బాలుర అగచాట్లు, పర్యావరణం, దేశభక్తి, దేశ నాయకులు... ప్రధాన వస్తువులుగా వీరు గజల్స్ రాస్తూ ఉంటారు.

**చదలవాడ ఉదయశ్రీ గారు. ప్రేమ విరహం ఆధ్యాత్మికత అనే వస్తువులుగా వీరు చాలా గజల్స్ రచించారు.**

"గజల్ కౌస్తుభం" పేరుతో గజల్ పుస్తకాన్ని ప్రచురించారు. ప్రధాన వస్తువు సామాజికం అని చెప్పుకోవచ్చు.

"కార్మికుడా! నాటినావు పోరాటపు సంగీతం
శ్రమలోకము మెచ్చెను నీ జయగీతపు సంగీతం"
"ఓ సీత.. విముక్తిలో ప్రవహించెను భక్తి ముక్తి
బలిదానపు ఢమరుకమే సురలోకపు సంగీతం"

కార్మికుల కష్టాన్ని వస్తువుగా చేసుకొని గజల్ గా మలచిన తీరు ప్రశంసనీయం.

మరో గజల్ కవయిత్రి చదలవాడ ఉదయశ్రీ గారు. ప్రేమ విరహం ఆధ్యాత్మికత అనే వస్తువులుగా వీరు చాలా గజల్స్ రచించారు.

## ముగింపు

1965లో మొలకెత్తిన తెలుగు గజల్ ఈరోజున రెండు తెలుగు రాష్ట్రాలలో శాఖలుగా విస్తరిల్లింది. దాదాపు 500 మంది గజల్ కవులు తెలుగు గజల్ పట్ల ఆకర్షితులై ఆ ప్రక్రియలో తమ కృషిని కొనసాగిస్తున్నారు. ఇదివరలో ముగ్గురో నలుగురో గజల్ గాయకులు ఉండేవారు. ఇప్పుడు అనేకమంది గజల్ ని ఇష్టంగా పాడుతున్నారు.

సమాజంలో జరుగుతున్న వింత పరిణామాలకు సాత్వికులైన,

మానవీయత కలిగిన కవులందరూ గజల్ రచన బాట పట్టారు. మన మనసుకు ఓదార్పును, శాంతిని ఇచ్చే,పక్కవాడి పై ప్రేమను పంచే, సాహిత్య ప్రక్రియగా, తనను వ్యతిరేకించిన వారిని కూడా ప్రేమతో అక్కున చేర్చుకునే భావాల సముదాయంగా గజల్ ప్రక్రియను భావించవచ్చు.

**2013 లో ముఖపుస్తకం మాధ్యమంగా - తెలుగు గజల్ సమూహం - ఏర్పాటయింది.**

సమాజం అల్లకల్లోలంగా ఉన్నప్పుడు ప్రేమ ఒక్కటే ఆ అశాంతి అనే గాయానికి మలాము పూయగలదు. అందుకే తెలుగు గజల్ సాహిత్యం పట్ల అందరూ ఆకర్షితులవుతున్నారు. ముఖ్యంగా కవయిత్రులు గజల్ పట్ల సమ్మోహితం అవుతున్నారు. తాము ఇంటా బయట ఎదుర్కొనే సమస్యల మూలంగా ఎంతో వేదన చెందుతున్నప్పుడు కవిత్వం సాధనగా గుండె లోతుల్లోంచి ప్రవహించే పరివేదనకు పరాకాష్టగా గజళ్ళను సృష్టిస్తున్నారు. అక్షరబలంతో గజల్ వాహినిగా ఆత్మవిశ్వాసాన్ని పొందుతున్నారు.

ముఖ్యంగా దాశరధి, నారాయణ రెడ్డి గారి తర్వాత 2006, 2007 నుంచి గజల్ శ్రీనివాస్ గారు గజల్ రచన గురించి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడంతో, అందులో Mbd శ్యామల గారు, బైరి ఇందిరా, సూరారం శంకర్, జ్యోతిర్మయి వంటి కవులు, గాయకులు గజల్ రచన, గానం పట్ల ఆకర్షితులై రచనలు ప్రారంభించారు. ఇటుపక్క సామల సదాశివ ఉర్దూ గజల్ భావజాల ప్రభావం వలన పెన్నా వంటి కవులు ప్రభావితులైనారు. గజల్ పరిశోధనలు చేశారు. పెన్నా శివరామకృష్ణ గారు గజల్ సౌందర్య దర్శనం రాశారు. ఉర్దూ గజళ్ళ భావ వీచికలను ఒడిసి పట్టుకొని తెలుగు భాషలోనికి ఆ భావాల సౌందర్యాన్ని నింపుతూ ప్రయోగాత్మకంగా "సల్లాపం", "శిశిర వల్లకి" గజళ్ళను రాశారు. గజల్ సాహిత్యంపై వారి కృషి అనన్య సామాన్యం.

ఆ తరువాత 2013లో ముఖపుస్తకం మాధ్యమంగా "తెలుగు గజల్ సమూహం" ఏర్పాటయింది. దానిలో జ్యోతిర్మయిమళ్ళ, వాహెబ్, కొరుప్రోలు మాధవ రావు గారు, ఆర్ వి ఎస్ ఎస్ శ్రీనివాస్ గారు మొదలైన వారు వారం వారం ముషాయిరాలను నిర్వహించడం, ఛందో నిర్వహణ పద్ధతులను

తెలియజేయడం వలన నావంటి గజల్ కవులు 15, 20 మంది వరకు గజల్ సాహిత్య సాధన చేశారు. అందులో ఒక పది మంది వరకు తరువాత మంచి గజల్ కవులుగా ఎదిగి గజల్ పుస్తకాలను ప్రచురించుకున్నారు.

డాక్టర్ సినారే ప్రభావంతో పత్తిపాక మోహన్ గజల్ సాహిత్యం పై మొదటిసారిగా పరిశోధన చేశారు. ఇటుపక్క చల్లా రాంబాబు వంటి వారు గజళ్ళను రాసి చల్లా గజళ్ళుగా ప్రచురించుకున్నారు.

ఈ దశాబ్దిలో గజల్ సాహిత్యంలో వచ్చిన పెను మార్పు సామాజిక గజళ్ళు వస్తువుగా తీసుకున్న గజళ్ళు అసంఖ్యాకంగా వచ్చాయి.

2015 నుండి 2025 వరకు తెలుగు గజల్ సాహిత్యానికి స్వర్ణ యుగం. దాదాపు 500 మంది గజల్ కవులు వచ్చారు. పూర్వం గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్, గజల్ వాసుదేవ్, జ్యోతిర్మయి మళ్ళా వంటి కొద్ది మంది మాత్రమే ఉండగా పదుల సంఖ్యలో గాయకులు కూడా వచ్చారు. ఇప్పుడు ఏఐ టెక్నాలజీతో గానం, చిత్రీకరణ సులువు కావడంతో వీరి గజళ్ళను రచయితలు దృశ్యీకరణ చేసుకొని ఆనందిస్తున్నారు.

ముఖ్యంగా ఈ పది సంవత్సరాల మధ్య కాలంలో తెలుగు గజల్ ఎంత ఎదిగిందో అదే సందర్భంలో కొంత నీలి నీడలు కమ్ముకున్నాయి. గజల్ అంటే అది ఒక ప్రక్రియనా, ఒక రూపం మాత్రమేనా, ఛందో నియమానుసారమే రాయాలా, గజలీయత్ లేకుండా భావుకత మాత్రమే ప్రధానంగా రాస్తే ఏమవుతుంది? వంటి ప్రశ్నలు తలెత్తాయి. కొంతమంది ఛందో వ్యాకరణ రీత్యా స్వేచ్ఛను తీసుకొని గజళ్ళను రాస్తున్నారు. రాయేదో, రత్నం ఏదో పాఠకులే తేల్చాలి; కాలమే సమాధానం చెప్పాలి. మనం ఎంత ప్రచారం చేసుకున్న కాలం అనేది ఒక ప్రక్రియను గాని ఒక కవిని గాని నిలబెట్టే న్యాయ నిర్ణేతగా ఉంటుందనేది నా అభిప్రాయం.

ఇక ఈ దశాబ్దిలో గజల్ సాహిత్యంలో వచ్చిన పెను మార్పు సామాజిక గజళ్ళు వస్తువుగా తీసుకున్న గజళ్ళు అసంఖ్యాకంగా వచ్చాయి. అలాగే గజల్ కి మూలమైన ప్రేమ తత్వాన్ని మర్చిపోకుండా ఆగజళ్ళను కూడా సృష్టిస్తున్నారు. బాగా లోతైన ఆలోచింపచేసే భావగాఢత కలిగిన అలంకారికత కలిగిన గజళ్ళు

వచ్చాయి. అలాగే పేలవమైన రచనలతో కూడిన గజళ్ళు కూడా వచ్చాయి.

కాలానుగుణంగా దాశరథి నుంచి 20 సంవత్సరాలు తర్వాత సినారే వలన మారిన వస్తువు తర్వాత కాలంలో మరింత మార్పుకు గురైంది. వివిధ వస్తుకంగా గజల్ పరిఢవిల్లుతుంది.

ఏ గజల్ రచన కైనా మూల లక్షణం కవితాత్మకత. వస్తు ప్రధానంగా కవిత్వం మరుగున పడిపోకూడదు.

గజల్ వస్తు పరంగా కవులకు ఎవరూ గురువులు ఉండనవసరం లేదు. కాలమే గురువు. ఆడపిల్లకు అన్యాయం జరిగితే అప్పుడు గజల్ వస్తువు అవుతుంది. అడవిని అంతం చేస్తుంటే అది గజల్ వస్తువు అవుతుంది. దేశ నాయకులు మరణిస్తే గజల్ వస్తువు అవుతుంది. మాతృ దినోత్సవం నాడు గజల్ అమ్మ గజల్ అవుతుంది. ఇలా సందర్భానుసారం కవి స్పందనగా గజల్ వస్తు మార్పు చెందే స్థితిలో మనం ఉన్నాం. ఎవరు కాదన్నా అవునన్నా ఇది ఒక ప్రవాహంగా సాగిపోతుంది.

రైతులు, సైనికులు, కష్టజీవులు, కార్మికులు, వీరంతా గజల్ కవిత్వంలో వస్తువులు అవుతున్నారు. సమాజ స్థితిగతుల ప్రభావం ఏ స్పందించే కవికైనా ఉంటుంది. గజల్ కవి తనకు నచ్చిన ప్రక్రియలో దాన్ని చెప్పుకొని సంతోషిస్తాడు. ఇలా గజల్ వస్తు పరంగా వైవిధ్యమైన విలక్షణమైన తన రూపును మార్చుకుంటుంది.

కానీ ఏ గజల్ రచన కైనా మూలలక్షణం కవితాత్మకత. వస్తు ప్రధానంగా కవిత్వం మరుగున పడిపోకూడదు. అలాగే ఛందో నియమాలను ఉల్లంఘించకూడదు. వస్తువు దేని గురించి అన్నది తర్వాత చదివే రెండు పాదాలైనా మనసుకు హత్తుకు పోవాలి. గజల్ సంగీత సాహిత్య ప్రక్రియల ప్రధానం. చదవగానే మనలో మనం హమ్ చేసుకునే విధంగా ఉండాలి. భాష అర్థం అయ్యేలా ఉండాలి. మన పాండిత్యాన్ని గుమ్మరించకూడదు. గూఢత, క్లుప్తత, గాఢత ఉండాలి. శబ్దాలంకారాలు, అర్థాలంకారాలు, చమత్కారాలు గజలియత్,. గజల్ కవిత్వ లక్షణాలు ఇన్ని ఉండాలి కాబట్టి గజల్ రచన

అలవోకగా రాసేది కాదు. వస్తు పరంగా మన మనసు సందర్శించాలి. భావపరంగా సుకుమారంగా ఉండాలి. పదాలపరంగా చమత్కారం ఉండాలి. పాడడానికి లయ ఉండాలి. మాత్రలపరంగా సమంగా ఉండాలి. మిశ్రా సాని మిశ్రా ఊలా రెండింటికి సమన్వయం అంటే గజలియత్ ఉండాలి.

అందుకే గజల్ రచన అంత సులభం కాదు. గజల్ రచన చేయవచ్చు కానీ గొప్ప గజల్ రచన చేయడం కష్టం. ప్రక్రియల పోటీ ప్రపంచంలో, రచనల పోటీ ప్రపంచంలో మన గజల్ మంచి గజల్ రచన అనిపించుకోవాలి అంటే చాలా కష్టపడాలి. ఇప్పుడు రాసే యువ గజల్ కవులు ఈ విషయాలు తెలుసుకుని పూర్వపు గజళ్ళ రచనలను పరిశోధనా పుస్తకాలను అవగాహనతో గజల్ రాయడం చాలా అవసరం.

సర్వేజనాః సుఖినోభవంతు

"తెలుగు బిడ్డవయ్యు తెలుగు రాదంచును
సిగ్గులేక ఇంక జెప్పటెందుకురా?
అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు
సకిలించు ఆంధ్రుడా! చావవెందుకురా?"

– కాళోజీ

# తెలుగు గజల్ నేపథ్యం, నియమాలు, లక్షణాలు

డా. పోతగాని సత్యనారాయణ
9182531202



## తెలుగు గజల్ ఆవిర్భావం:

గజల్ కు మాత్రాఛందస్సును నిబద్ధం చేసి, గజల్ లక్షణాలైన కాఫియా, రదీఫ్ తదితర ముఖ్యమైన నియమాలను పాటిస్తూ మత్లా, షేర్, మక్తాలతో రూప పరంగాను, భావం, భాషాది విషయాల పరంగాను ఉర్దూ గజల్ సంస్కృతీ సంప్రదాయాలకు దగ్గరగా తెలుగు గజల్ ను సమగ్ర స్వరూపంతో తెలుగు సాహితీ వనంలో నాటారు దాశరథి. తెలుగులో తొలి గజల్ రాసిన కవిగా డా. దాశరథి గుర్తింపు పొందారు.

"తొలిసారిగా తెలుగులో గజల్ తో ప్రభావితులై ఒకానొక గజల్ ఛందస్సుకు దగ్గరగా ముత్యాలసరం సృష్టించిన గౌరవం యుగకర్త శ్రీ గురజాడ అప్పారావు గారికి దక్కుతుంది" అన్నారు దాశరథి. (జ్వాలాలేఖిని–పీఠిక–దాశరథి) అయితే ఆ ఒకానొక గజల్ ఛందస్సు ఏదో డా. సి.నారాయణరెడ్డి గారు తన పరిశోధనా గ్రంథమైన 'ఆధునికాంధ్ర కవిత్వం – సంప్రదాయములు, ప్రయోగములు' లో తెలిపారు.

"ముత్యాల సరములోని ఛందస్సున కనుకూలముగా నడచు ఫార్సీ గజలిది"

"వాయిజాకీ జల్వబర్ మహ్రాబొ మెంబర్ మీకునంద్

చూబఖిల్వత్ మీరవంద్ ఆం కారెదీగర్ మీకునంద్ (హాఫిజ్)"

"ఆ తరువాత చాలా కాలానికి నేను గజల్, రుబాయి ప్రక్రియలను ఉర్దూ, హిందీ, ఫారసీ, స్పానిష్ భాషలలో అధ్యయనం చేసి, పరిశోధన జరిపి తెలుగులో కొంత విస్తృతంగా ఈ ధోరణిలో రచన చేశాను" అని డా. దాశరథి 1984లో ప్రచురించిన తన 'జ్వాలాలేఖిని' అనే కవితా సంపుటి పీఠికలో రాసుకున్నారు.

**వలపునై నీ హృదయసీమల నిలువవలెనని ఉన్నది - పిలుపునై నీ అధర వీధుల పలుక వలెనని ఉన్నది**

### తొలి తెలుగు గజల్

'జ్వాలాలేఖిని' కవితాసంపుటిలో రెండవ భాగంగా 'సాఖీనామా' అనే పేరుతో తొమ్మిది గజళ్ళను, యాభై ఆరు రుబాయీలను ప్రచురించారు దాశరథి. ఈ సంపుటి ముద్రణ కంటే ముందే కొన్ని గజళ్ళు, రుబాయీలు చాలా పత్రికలలో అచ్చయ్యాయి. చాలా సభల్లోనూ వాటిని చదివి వినిపించానని" ఆయన రాసుకున్నారు.

జ్వాలాలేఖిని కి ముందు 1966లోముద్రించబడిన దాశరథి కావ్యసంపుటి 'కవితా పుష్పకం' లో 'కామన' అనే శీర్షికతో "వలపునై నీ హృదయసీమల నిలువవలెనని ఉన్నది" అనే ఒకే ఒక్క గజల్ ను ప్రచురించారు. అదేఈ గజల్:

"వలపునై నీ హృదయసీమల నిలువవలెనని ఉన్నది
పిలుపునై నీ అధర వీధుల పలుక వలెనని ఉన్నది

చైత్రమాస నవోదయమ్మున చల్లగాలికి ఆడుతూ
పువ్వునై నీ కొప్పులోనే నవ్వవలెనని ఉన్నది

నీవు నడిచే దారిపక్కన నింబ బూరుహ శాఖనై
పట్టుకుచ్చుల నీడ గొడుగులు పట్టవలెనని ఉన్నది

అంత చిక్కని అందమంతా గంతులేసే రీతిగా
చక్కనౌ నీ బొమ్మయొక్కటి చెక్కవలెనని ఉన్నది

నన్ను చూచీ కోపగించే కన్నులందలి కెంపునే
తారహారముగా గళమ్మున దాల్చవలెనని ఉన్నది

స్నేహ సూత్రము పడుగు పేకల జేరి రెపరెపలాడగా
పైటనై నీ ఎడద పైనే వ్రాలవలెనని ఉన్నది

కాలి కూలిన మదనునికి ప్రాణాలు పోసే కోమలీ
శివుని గుండెను నీదు చూపుల చీల్చవలెనని ఉన్నది

బుగ్గపైగల లేగులాబీ మొగ్గలోపలి నిగ్గుతో
కోటి శిశిర పిశాచ గణముల కూల్చవలెనని ఉన్నది

ముదిసిపోయిన కాలమునకే పదునుకలిగే రీతిగా
నేను నీవై నిఖిల జగముల నిండవలెనని ఉన్నది"
(కవితాపుష్పకం–పుట.65)

ఈ గజల్ లో కాఫియాలు: నిలువవలెనని, పలుకవలెనని, నవ్వవలెనని, పట్టవలెనని, చెక్కవలెనని, దాల్చవలెనని, వ్రాయవలెనని, చీల్చవలెనని, కూల్చవలెనని, నిండవలెనని.

రదీఫ్ పదము : 'ఉన్నది',

ఈగజల్‌లోతఖల్లుస్(నామముద్ర)వాడబడలేదు.ఇదిమాత్రాఛందస్సులో మిశ్రగతిలో రాయబడింది. గజల్ కు సంబంధించి సర్వలక్షణ సంపన్నమైన ఈ గజలే తెలుగులో తొలిగజల్ అని కొందరంటే, మరికొందరు జ్వాలాలేఖిని సంపుటిలోని "రమ్మంటే చాలుగాని రాజ్యాలు విడచి రానా" అనే గజలే మొదటి గజలని అంటారు. ఇదే అభిప్రాయాన్ని "దాశరథి రుబాయీలు–గజళ్ళు" అన్న గ్రంథంలో డా.తిరుమల శ్రీనివాసాచార్య పేర్కొన్నారు.

దాశరథి రచించిన గజళ్ళలో మొదట ప్రచురించబడిన గజల్ మాత్రం "వలపునై నీ హృదయసీమల నిలువవలెనని ఉన్నది" అనే గజలే. ఈ గజలే తొలి తెలుగు గజల్ అని గుర్తించడానికి హేతువులు:

1.ఈ గజల్ 1966లోప్రచురించ బడటం,

2. పెద్దలు తొలితెలుగు గజల్ గా గుర్తించిన "రమ్మంటే చాలుగాని" అనే గజలు 1984 లో ముద్రణకావడం

3. ఈ రెండింటి మధ్య సుమారు పద్దెనిమిది సంవత్సరాల వ్యత్యాసముండటం

ఇవన్నీ "వలపునై" అనే గజలే మొదటిదని చెప్పడానికి ఊతమిస్తున్నవి.

మొదట రాసి ఉంచిన గజల్ ను, ఆ తరువాత రాసిన గజళ్ళను ముద్రించిన పద్దెనిమిది సంవత్సరాలకు ప్రచురిస్తారనుకోవడం సమర్ధనీయంగా అనిపించడం లేదు.

'కవితాపుష్పకం' సంపుటిలో ఒకేఒక్క గజల్ ఉండటం, దాశరథి తొలి ప్రయత్నంగా రాసి ఉంటారని చెప్పడానికి సాక్ష్యమిస్తున్నది. అయితే విశ్లేషకులు లేదా పరిశోధకులు మరోవిధంగా అభిప్రాయపడటానికి కారణం లేకపోలేదు. దాశరథి 'గజల్' అనే పేరుతో ప్రచురించి, దానికి సాఖీనామాలో '1' వ సంఖ్యను ఇచ్చిన గజల్ కనుక 'రమ్మంటే చాలుగాని' అనే గజలే తెలుగులో తొలిగజల్ అని ఊహించి ఉండవచ్చు.

1966 లో ప్రచురించిన కవితాపుష్పకం సంపుటిలోని గజల్ 'కామన' అనే శీర్షికతో మిగతా కవితలలో ఒకటిగా కలిసిపోయి ఉంది.

కనుక దానిని గజల్ అని గమనించి ఉండకపోవచ్చు. కాని ఆ 'కామన' శీర్షికతో ఉన్న గజల్ కు సంపూర్ణ, సమగ్ర గజల్ లక్షణాలు ఉన్నాయి. కేవలం గజల్ కు శీర్షిక పెట్టి రాసినందువలన అది గజల్ కాకుండాపోదు కదా!

దీనిని బట్టి తేలిందేమంటే డా. దాశరథి 1966 లో వెలువరించిన 'కవితాపుష్పకం' సంపుటిలోని 'కామన' శీర్షికతో ముద్రించబడిన "వలపునై నీ హృదయసీమల నిలువవలెనని ఉన్నది" అనే గజలే ముమ్మాటికీ తొలితెలుగు గజలని ఘంటాపథంగా చెప్పవచ్చు.

ఇక దాశరథి రచించిన గజళ్ళసంఖ్య విషయంలోనూ ఏకాభిప్రాయం లేదు. కొందరు పదకొండు అంటే మరికొందరు పది అని అభిప్రాయ పడుతున్నారు. అయితే ఆయన రాసి అచ్చువేసిన గజళ్ళు రెండు సంపుటాలలో

(కవితాపుష్పకంలో ఒకటి, జ్వాలాలేఖినిలో తొమ్మిది) మొత్తం పది ఉన్నాయి. ఇవి కాక మరో రెండు గజళ్ళు వేరువేరు సందర్భాలలో మిత్రుల కోరికమేరకు రాసి ఇచ్చినవి ఉన్నాయి. మొత్తం పన్నెండు గజళ్ళు దాశరథి రచించారు.

**దాశరథి రాసిన మొత్తం గజళ్ళ సంఖ్య పన్నెండు వరకూ ఉన్నాయని చెప్పవచ్చు**

ముద్రించబడిన పది గజళ్ళ ప్రసక్తి అటుంచితే, పదకొండవ గజల్ గురించి ప్రముఖ సినీనేపథ్య గాయకులు పి.బి శ్రీనివాస్ గారు, కె.ప్రభాకర్ సంకలనం చేసిన 'దాశరథి సినిమా పాటలు' పుస్తకానికి రాసిన ముందుమాటలో తెలిపారు.

"ఇద్దరమూ గజల్ ప్రియులం. నేను కట్టిన ఒక్కొక్క మట్టుకి ఆయన (దాశరథి) అద్భుతమైన గజల్ రాసి ఇచ్చారు. అది పాడినప్పుడల్లా అందరూ మెచ్చేవారు. "చెలీ! కనవే గులాబీల, అదోలా నన్ను చూసేనే" అనేది మకుటం. అలా కాలక్షేపంలోనే గంటలు గడచేవి. అవి మరచిపోలేని రోజులు. ఆయన ప్రవర్తన అందరికీ అనుసరణీయం." అంటూ తన ఆత్మీయ మిత్రులు దాశరథి గురించి రాశారు. (దాశరథి సినిమా పాటలు–కె.ప్రభాకర్–పుట.14) దీనిని బట్టి దాశరథి రచించిన పదకొండవ గజల్ "చెలీ! కనవే" అనే గజల్ అని తెలుస్తున్నది.

1966లో దాశరథి రచించిన "అధరాల వీధిలోన మధుశాలలున్నదాన" అనే గజల్ ను పి.బి.శ్రీనివాస్ బాణీకట్టి పాడినట్లు తెలుస్తున్నది. ఇలా దాశరథి రాసిన మొత్తం గజళ్ళ సంఖ్య పన్నెండు వరకూ ఉన్నాయని చెప్పవచ్చు. అయితే 11,12 వ గజళ్ళు మాత్రం లభించడంలేదు.

గజల్ (1) అనే శీర్షికతో దాశరథి రచించిన గజల్:

"రమ్మంటే చాలుగానీ రాజ్యాలు విడచి రానా
నీ చిన్ని నవ్వుకోసం స్వర్గాలు గడచి రానా

ఏడేడు సాగరాలు ఎన్నెన్నొ పర్వతాలు
ఎంతెంత దూరమైనా బ్రతుకంత నడచి రానా

కనులందు మంచులాగా కలలన్ని కరిగిపోగా
కావేరివోలె పొంగే కన్నీరు తుడిచి రానా

నీవున్న మేడ గదిలో నను చేరనీయరేమో
జలతారు చీరగట్టి సిగపూలు ముడిచి రానా

పగబూని కరకువారు బంధించి ఉంచినారు
ఏనాటికైన గానీ ఈ గోడ పొడిచి రానా

ఈ గజల్ 'జ్వాలాలేఖిని' సంపుటిలో 'సాఖీనామా' అనే విభాగంలో రాయబడిన గజళ్ళలో మొదటి గజల్. దీనికి శీర్షిక 'గజల్' అని ఉంది. దీనిలో గజల్ కు ఉండవలసిన సర్వలక్షణాలలో ఒక్కటి మినహా (కవికి ఐచ్ఛికమైన 'తఖల్లుస్' వాడబడ లేదు) అన్ని లక్షణాలూ ఉన్నాయి. ఈ గజల్ లో కాఫియాలు: విడచి, గడచి, నడచి, తడిచి, ముడిచి, పొడిచి.

గజల్ పుట్టింది ఫారసీక దేశంలో కనుక అక్కడి ప్రజల వేషభాషలు, సంస్కృతీ సంప్రదాయాలు

రదీఫ్ పదం: "రానా"

దాశరథి గజల్ రచనా మర్మం తెలిసినవాడు. ఉర్దూ గజల్ రచనా సంవిధానాన్ని గౌరవించి, వాటిని తెలుగు గజల్ లో బాధ్యతగా పాటించాడు. తెలుగు ప్రబంధ కవులు, భావకవులు తమ ప్రేయసిని వర్ణించే విధానానికి, గజల్ కవి తన ప్రియురాలిని వర్ణించే విధానానికి ఎంత వ్యత్యాసముందో తెలుగు కవుల కవి సమయాలకు, గజల్ కవుల కవి సమయాలకు కూడా అంతే వ్యత్యాసముంది.

గజల్ పుట్టింది ఫారసీక దేశంలో కనుక అక్కడి ప్రజల వేషభాషలు, సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు తెలుగువారి కన్నా భిన్నంగా ఉండటం, ఆయా దేశాల భాషాసాహిత్యాలలో అవి ప్రదర్శితమవడం సహజం. అందుకే గజల్లో అక్కడి స్త్రీల వేషధారణ, సంప్రదాయాలే ఎక్కువగా కనిపిస్తాయి. అరబీ, ఫారసీక దేశాలలో ముస్లిమ్ మతస్థులైన స్త్రీలు పరదా పద్ధతిని పాటిస్తారు. అంటే శరీరాన్ని, ముఖాన్ని కప్పుతూ ఉండే పలుచని వస్త్రాన్ని ధరించడం అన్నమాట. దీని వలన తెరచాటునున్న ప్రియురాలి ముఖాన్ని

మాత్రమే పాక్షికంగా చూడగలిగే అవకాశం ప్రియునికి ఉంటుంది. అలాగే శిరోజాలనూ చూడగలుగుతాడు. అంతేకాని ఆమె శరీర సౌందర్యాన్ని తిలకించలేడు. కనుకనే పరదా పద్ధతిని పాటించే ఆచారం గల దేశంలో పుట్టిన గజల్లో స్త్రీల అంగాంగ వర్ణనలు కనిపించవు. కేవలం ఆమె ముఖాంగాలు, కేశ సౌందర్యాలు మాత్రమే వర్ణించబడతాయి. ఆ వర్ణనలు కూడా శ్రుతిమించకుండా స్త్రీలపట్ల గౌరవాభిమానాలను, సభ్యత సంస్కారాలను విడువకుండా ప్రదర్శితమవుతాయి. కాని తెలుగువారి సాహిత్య మర్యాదలు వేరు. స్త్రీల అంగాంగ వర్ణనలు చేస్తూ ప్రత్యేకంగా శృంగార కావ్యాలను కూడా వెలువరించడం ప్రబంధయుగం నుండీ ఉంది.

**దాశరథి తెలుగు గజల్ ను ఉర్దూ, ఫారసీ గజళ్ళ అడుగు జాడల్లోనే నడిపించాడు.**

దాశరథి తెలుగు గజల్ ను ఉర్దూ, ఫారసీ గజళ్ళ అడుగు జాడల్లోనే నడిపించాడు. ఆయన గజళ్ళలో వర్ణించబడిన స్త్రీ అచ్చతెలుగు వనితలా కనిపించదు. అందుకే ఆయన రాసిన "వలపునై నీ హృదయ సీమల..." అనే తొలి గజల్లో అధరాలు, గళము, చూపులు, బుగ్గలు వంటి ముఖాంగాల వర్ణన , శిరస్సు నలదుకొని ఉండే కొప్పు, శిరోజ సౌందర్య ప్రస్తావనలే కనిపిస్తాయి. అయినప్పటికీ తెలుగుదనాన్ని జారనీయకుండా ఉర్దూ గజల్ రచనా సంప్రదాయాలను పాటిస్తూ అలౌకిక ప్రణయ భావాలను పలికించి, తొలినాళ్ళ లోనే గజల్ రచనలో అసాధారణ మెళుకువను ప్రదర్శించాడు.

"వలపునై నీ హృదయ సీమల నిలువవలెనని ఉన్నది
పిలుపునై నీ అధరవీధుల పలుకవలెనని ఉన్నది

చైత్రమాస నవోదయమ్మున చల్లగాలికి ఊగుతూ
పువ్వునై నీ కొప్పులోనే నవ్వవలెనని ఉన్నది"

ప్రియుడు తనకు ప్రేయసి పట్ల కలిగిన ప్రేమ భావనలను అనేక విధాలుగా ప్రకటించడం ఈ గజల్ లోని ప్రధానాంశం. గజల్లోని మొదటి షేర్లో ఆమె హృదయంలో స్థానాన్ని సంపాదించాలని, ప్రేయసి పెదాలపై తీయని పలుకులుగా వెలువడాలనే కోరికను వ్యక్తం చేయడం ఉంది. రెండవ షేర్లో 'చైత్రమాస నవోదయమ్మున' అని తెలుగుదనాన్ని సమన్వయపర్చడం గమనించవచ్చు.

చైత్రమాసం తెలుగువారి కాలమానంలో మొదటి నెల. ఆ తరువాత మిస్రాలో 'పువ్వునై నీ కొప్పులోనే, అంటూ శిరోజాల ప్రస్తావన చేయడం ఉంది. ఈ శిరోజాల ప్రస్తావన ఉర్దూ, ఫారసీ గజళ్ళ సంప్రదాయ ముద్ర. ఇలా గజల్ నిండా ఉర్దూ గజల్ సంప్రదాయాన్ని పాటిస్తూ, తెలుగుదనాన్ని ప్రదర్శిస్తూ చక్కని సమన్వయాన్ని సాధించాడు.

**అంతుచిక్కని అందమంతా గంతులేసే రీతిగా - చక్కనౌ నీ బొమ్మయొక్కటి చెక్కవలెనని ఉన్నది**

దాశరథి గజళ్ళలో ప్రేయసి చుట్టూ ఉన్న వాతావరణ, కాలమానాలన్నీ తెలుగువారివే! ఒక్క అంగవర్ణన విషయంలోనే ఉర్దూ గజల్ సంప్రదాయాన్ని పాటించడం కనబడుతుంది. అందుకే ఉర్దూ గజల్ కు దాశరథి తెలుగు దుస్తులు తొడిగారన్న మాట నిజం.

"అంతుచిక్కని అందమంతా గంతులేసే రీతిగా
చక్కనౌ నీ బొమ్మయొక్కటి చెక్కవలెనని ఉన్నది"

ఈ షేర్ లో ఆమె అపురూప సౌందర్యానికి ముగ్ధుడై కనుల ముందే ఎప్పుడూ ఉండే విధంగా చక్కని బొమ్మను చెక్కాలని ఉందని కోరుకోవడం ఉంది. 'అంతు చిక్కని అందం' అనడంలో ప్రియురాలి అందం అనుపమానమైనదని భావం. మరో పార్శ్వంలో అంతు చిక్కని అందం అంటే భౌతిక రూపాన్ని స్పష్టంగా చూచే అవకాశం పరదా పద్ధతి వలన లేకుండా పోయింది. కనుక స్పష్టాస్పష్టంగా చూచిన రూపాన్ని జ్ఞాపకం చేసుకుంటూ చక్కని బొమ్మను (శిల్పాన్ని) చెక్కాలని ఉంది అంటున్నాడు. దీనినే మరింత లోతుగా తాత్విక దృష్టితో పరిశీలిస్తే విశ్వంలోని ప్రతి జీవిలోను, నిర్జీవిలోను తానే ఉంటాడు గాని కనిపించకుండా ఉంటాడు భగవంతుడు. అతని అంతుచిక్కని అందం కనుల ముందు సాక్షాత్కరించేటట్లు ఒక అందమైన బొమ్మను (అర్చామూర్తిని) చెక్కాలనే ఆకాంక్ష వ్యక్తమవుతున్నది. 'గంతులేసే రీతిగా, అనే పదప్రయోగంతో సజీవ శిల్పసుందరిని మూర్తి కట్టించాలనే కోరిక వెల్లడైంది. ఇక్కడే మరో మత సంప్రదాయ ప్రస్తావన నిగూఢమైనట్లు తెలుస్తున్నది.

బొమ్మ చెక్కడం అదీ ఆరాధనా భావంతో చెక్కడం అనేది ముస్లింల

మత సంప్రదాయం కాదు. వారు మూర్తి పూజకు వ్యతిరేకులు. విగ్రహారాధన హైందవ పూజావిధానం. కనుక తెలుగువాడై అందునా హైందవుడై తన మత సంప్రదాయాలను గౌరవించుకుంటూ ప్రేయసి యొక్క ఆచార, సంప్రదాయ మర్యాదలను ఆదరించే వ్యక్తిగా కనబడతాడు ప్రియుడు.

"ముగిసిపోయిన కాలమునకే పదును కలిగే రీతిగా
నేను నీవై నిఖిల జగముల నిండవలెనని ఉన్నది"

ఇది ఈ గజల్ లోని ఆఖరి షేర్. ఇప్పటివరకు పై షేర్ల లో మనకు పైకి కనిపించిందంతా లౌకిక ప్రేమ భావనలు. కాని ఈ షేర్లో అది లౌకిక ప్రేమ కాదని, అది అలౌకికమైన ప్రేమని సూక్ష్మ పరిశీలన ద్వారా తెలుస్తున్నది. ఇలా అలౌకికమైన ప్రేమ భావాలను గజల్ల లో రాసే విధానాన్ని సూఫీ సంప్రదాయంలో 'ఇష్క్ ఎ హకీకి' అంటారు.

**ఫారసీ, ఉర్దూ గజల్ రచనా సంప్రదాయాలలో ప్రేయసిని పేరుపెట్టి పిలవడం అనేది నిషిద్ధం.**

నేను నీవై నిఖిల జగముల నిండవలెనని ఉన్నదని ఆకాంక్షించడంలో ఆ ప్రియుని ప్రేయసి కేవలం మానవ మాత్రురాలు కాదని తెలుస్తున్నది. నిఖిల జగమంతా నిండి ఉండేది భగవంతుడు. అందుకే పోతన ఆంధ్ర భాగవతంలో ఇలా చెప్పాడు.

"ఇందుగలడందులేడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
అందందేగలడు దానవాగ్రణి వింటే"

నేను నీవు కావడమనే ప్రయోగంలో ప్రియుడు తను ప్రేయసిగా భావించిన భగవంతునిలో లీనంకావడమనే ధ్వని వుంది.

ఫారసీ, ఉర్దూ గజల్ రచనా సంప్రదాయాలలో ప్రేయసిని పేరుపెట్టి పిలవడం అనేది నిషిద్ధం. ఆమె పేరును బహిర్గతం చేయడమనేది బద్నామి అవుతుంది. అందుకే గజల్ కవులు ప్రేయసిని ఉద్దేశించి నీ, నీవు అనే సర్వనామ ప్రయోగము చేస్తారు.

ఈ గజల్లో కూడా దాశరథి నూటికి నూరు పాళ్ళు ఉర్దూ గజల్

సంప్రదాయాన్నే అనుసరించడాన్ని గమనించవచ్చు.

ప్రేమతత్వాన్ని దాశరథి తన గజళ్ళలో అమలిన శృంగార భావనతో రచించి, ఉర్దూ గజల్ రచనా సంప్రదాయాలను గౌరవిస్తూ తెలుగుదనాన్ని సాధించిన పద్ధతి ముందుతరాలకు మార్గదర్శకమయింది. దాశరథి గజళ్ళలో ఒక్క ప్రేమ భావనను తప్ప వేరొక భావాన్ని స్వీకరించలేదు. అయితే అంతర్లీనంగా సూఫీతత్వాన్ని ప్రేమ రూపంలో వ్యక్తంచేసినట్లు తెలుస్తున్నది. గజల్ అనేది కేవలం ప్రేమను వెల్లడించడానికి మాత్రమే ఉద్దేశించినదని ఉర్దూ ఫారసీ గజళ్ళలో లోతైన అవగాహన ఉన్న దాశరథికి తెలియంది కాదు. పైగా ఉర్దూ గజళ్ళ భావాలను, రచనా విధానాన్ని తెలుగువారికి యథావిధిగా పరిచయించాలనే తపన ఉన్నవాడు గనుకనే గజళ్ళలో వేరొక భావనకు చోటు కల్పించే ప్రయత్నం చేయలేదని భావించవచ్చు.

**తెలుగు గజల్ అనగానే మొట్టమొదట స్ఫురణకు వచ్చే పేరు డా.దాశరథి కృష్ణమాచార్యులు.**

తెలుగు గజల్ అనగానే మొట్టమొదట స్ఫురణకు వచ్చే పేరు డా.దాశరథి కృష్ణమాచార్యులు. ఉర్దూ-ఫారసీ భాషలలో తనకున్న ప్రగాఢమైన అనుబంధం వలన ఫారసీ సాహిత్య సంబంధమైన రుబాయి, గజల్ వంటి ప్రక్రియల్ని తెలుగు వారికి పరిచయం చేశారు.

ఫారసీ-ఉర్దూ గజల్ లక్షణాలతో తెలుగు భాషలో రాయడానికి ముందు ఆయన ఎంతో కృషి చేసినట్లు తెలుస్తున్నది. మొదట ఉర్దూ గజల్ సౌందర్యానికి ముగ్ధుడై 1961 లోనే గాలిబ్ గజళ్ళలోని అద్భుతమైన షేర్లను ఆటవెలది, తేటగీతి, రగడ, ద్విపదల లోనికి అనువదించారు. ఈ అనువాదానికి ఉపక్రమించిన తరువాత ఆయన పడిన శ్రమను, గాలీబు పట్ల ఆయనకున్న గౌరవ మర్యాదలను 'అనువాద రీతి 'అనే పేరుతో 'గాలీబు గీతాలు' గా అనువాదం చేసిన సంపుటిలో రాసుకున్నారు. అలాగే తనకు గాలీబు పైన, ఆయన కవిత్వం పట్ల మక్కువ కలిగించిన గురువుగారు "జక్కీ సాహెబ్" గారిని కూడా స్మరించుకున్నారు.

"పురాతనత్వమే ఆదర్శమని నమ్మిన చోట అతి నవ్యుడుగాను

వెలసిన మహాకవి గాలిబు నా హృదయంలో ఇమిడిపోయినాడు.ఆయనలోని క్లుప్తత, ఆప్తత, గుప్తత నన్ను ముగ్ధుణ్ణి చేసినవి"

అలా గాలీబును, ఆయన కవిత్వాన్ని ఆరాధనా భావంతో ఆస్వాదించిన దాశరథి, గాలిబ్ ను మహాకవి కాళిదాసుతో పోల్చి ఆయనను మానవతా గిరి శిఖరాగ్రం మీద తేజోమూర్తిగా ప్రతిష్ఠించి కృతజ్ఞత ప్రకటించుకున్నారు.

**ఒక్కొక్క పద్యాన్ని తెలుగులోకి దించడానికి రోజులు రోజులు పట్టేవి.**

"అయఃపేటికలో భద్రపరచబడిన మణిని సాధించడం ఎంత కష్టమో పద్యాలలో దాగిన గాలిబు హృదయాన్ని అందుకోవడం కూడా అంత శ్రమతో కూడిన పని. ప్రతి పద్యాన్నీ ఆకళించుకొని, ఆ పద్యానికి వివిధ వ్యాఖ్యాతలూ, విమర్శకులూ చెప్పిన అర్థాన్ని చదివి నాకు స్ఫురించిన అర్థాన్ని జీర్ణించుకొని, త్రేన్చి తెలుగు రూపంలో మళ్ళీ ఆ హృదయాన్ని ఆవిష్కరించడం కొంత క్లిష్టమైన పనే. ఒక్కొక్క పద్యాన్ని తెలుగులోకి దించడానికి రోజులు రోజులు పట్టేవి. అప్పటికీ సంపూర్ణంగా మూలార్థం రాకుంటే మళ్ళీ మార్చవలసి వచ్చేది. ఇది అనువాదం కాని, అనుసరణ కాదు. కనుక నా కల్పన ఈషణ్మాత్రమూ పనికిరాదు. తెలుగు పాఠకులకు గాలిబ్ భావం అందటానికి కావలసిన హంగులు చేయడానికి మాత్రమే నాకు అధికారం ఉంది. అంతకు మించి లేదు. ఇలాంటి నిర్బంధాలతో ఈ అనువాదానికి ఉపక్రమించాను."అని అనువాద సమస్యలను అధిగమించిన తీరును, అనువాదానికి ఆయన పడిన శ్రమను వ్యక్తం చేశారు దాశరథి.

మూలానికి అనువాదం ఎంత సన్నిహితంగా ఉందో మచ్చుకి కొన్ని ఉదాహరణలు:

"బస్కె దుష్వార్ హై హర్ కాం కా ఆసా హోనా
ఆద్మీ కో భీ మయస్సర్ నహీ ఇన్సా హోనా"

ప్రతిది సులభమ్ముగా సాధ్యపడదు లెమ్ము
నరుడు నరుడౌట యెంతొ దుష్కరము సుమ్ము!

"జబ్ మైకదా ఛుటాతో ఫిర్ అబ్ క్యా జగహ్ కీ ఖైద్
మస్జిద్ హో,మదర్సాహో,కోయీ కన్హాహో"

పానశాలయె లేనిదేదైన నేమి?
బడి, మసీదు, సత్తరువు సర్వమ్మునొకటె

"ఐకా దర్యాప్త్ కర్నా హై హునర్ మందీ,అసద్
నుక్స్ పర్ అప్నే హువా ముత్తెలా కామిల్ హువా"

స్వీయ లోపమ్ము లెరుగుట పెద్ద విద్య
లోపమెరిగిన వాడె పూర్ణుడగు నరుడు

గాలిబ్ గజళ్ళ లోని షేర్లను గాలిబ్ గీతాలుగా అనువపించడం తోటే దాశరథికి సంతృప్తి కలుగలేదు. అందుకే 1966లో ప్రచురించిన 'కవితా కౌముది' అనే కవితా సంపుటిలో కొన్ని కవితలను గజల్ భావాలతో, గజల్ తనం (గజలియత్)తో నింపి రాశారు. అటువంటి కవితలలో 'హిమకామిని' 'ప్రపాపాలిక', 'మధుమంజరి', 'మీర్ కవితా మాధుర్యం', 'జఫర్ మధుర తరంగాలు', 'వలపు సేతువు', మొదలైనవి ప్రస్తావనీయంగా ఉన్నాయి. ఈ కవితలను చదువుతుంటే ఉర్దూ గజళ్ళను చదువుతున్నప్పుడు కలిగే చమత్కార, వ్యంగ్యాది అనుభూతులు మనసును మురిపిస్తాయి. ఆ తరువాత పూర్తిగా తెలుగులో మాత్రా ఛందస్సులో, మిశ్రగతిలో, ఖాఫియా, రదీఫ్ లను ఉపయోగిస్తూ... సంపూర్ణంగా (ఒక్క తఖల్లుస్ ను మినహాయిస్తే, అయినా ఇది ఐచ్ఛికమే) గజల్ నియమాలను పాటించి రాసిన గజల్ ను ఆ సంపుటిలో చేర్చారు. అది 'కామన' అనే శీర్షికతో మిగతా కవితలతో ఒకటిగా ఉంది.

గొంగళిపురుగు క్రమక్రమంగా రూపవిక్రియ చెంది, అందమైన సీతాకోక చిలుకగా సంపూర్ణ రూపాన్ని సంతరించుకున్నట్లు,.. దాశరథిలోని గజల్ ను తెలుగు చేయాలన్న తపన, తన 'కవితా పుష్పకం' సంపుటిలోని 'కామన' అనే పేరుతో రాసిన గజల్ ద్వారా నెరవేరిందని చెప్పవచ్చు.

**తెలుగు గజల్ ఆవిర్భావం:**

ఒక భాషలోని సాహిత్య ప్రక్రియను మరో భాషాసాహిత్యం లోనికి దిగుమతి చేసుకోవడమో లేదా అరువు తెచ్చుకోవడమో జరిగినప్పుడు సాధారణంగా ఆ ప్రక్రియకున్న మాతృకలోని పేరుతోనే వ్యవహరిస్తుంటారు. ఉదాహరణకు హైకూ, రుబాయి, పురాణం, ప్రబంధం, ఇతిహాసం మొదలైనవి.

కొన్నిసార్లు ఆయా భాషల లోనికి స్వీకరించబడిన ప్రక్రియా నామాన్ని దేశీయం చేసి వ్యవహరిస్తుంటారు. ఉదాహరణకు: Eassy(వ్యాసం),Short story (కథానిక), ఆటోబయోగ్రఫీ (స్వీయ చరిత్ర) మొదలైనవి.

**ఉర్దూ గజల్ ప్రభావంతో తెలుగులోనికి వచ్చిన గజల్ కు కూడా మొదట తెలుగు పేరు పెట్టి దేశీయం చేయడానికి ప్రయత్నాలు జరిగాయి.**

ఉర్దూ గజల్ ప్రభావంతో తెలుగులోనికి వచ్చిన గజల్ కు కూడా మొదట తెలుగు పేరు పెట్టి దేశీయం చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. ఆ ప్రయత్నంలో భాగంగానే కొన్నిపేర్లు వెలుగులోకి వచ్చాయి. వాటిలో 'వల్లరి', సల్లాపము అనేవి ముఖ్యమైనవి. కాని ఇవేవీ గజల్ అనే పేరుకున్న ఆకర్షణముందు నిలువలేకపోయాయి. అందుకే గజల్ 'గజల్' గానే నిలిచి తెలుగు గజల్ అని పిలువబడుతున్నది.

### తెలుగుగజల్ కు తొలినాటి పేర్లు:

#### వల్లరి:

"దాశరథి తొలిసారిగా తెలుగులో ఒకానొక ప్రయోగంగా గజల్ రూపాన్ని యథాతథంగా దిగుమతించారు. తన ఈ ప్రయోగరూపాన్ని గజల్ ను 'వల్లరి' అని దేశీయం చేశారు. (గజల్ జాడలో పెన్నా సల్లాపం –డా.కోవెల సంపత్కుమారాచార్య–రసమయి మాసపత్రిక 2003 జూన్ సంచిక) అని గజల్ కు వల్లరి అనే పేరుపెట్టిన విషయాన్ని తనకు ఉత్తరం ద్వారా పలు విషయాలతోపాటు చెప్పారని ప్రముఖ కవి, విమర్శకులు డా.కోవెల సంపత్కుమారాచార్య తెలిపారు.

పై విషయాన్ని బట్టి 'తెలుగుగజల్ పిత' అయిన దాశరథి గారే తెలుగు

గజల్ కు వల్లరి అని పేరుపెట్టినట్లు నిర్ధారించవచ్చు. ఒక భావం క్రమంగా మొదటి షేర్ నుండి మక్తా వరకు అల్లకుపోవడం గజల్ మౌళిక లక్షణం గనుక గజల్ ను తెలుగు చేసే ధోరణిలో వల్లరి అని పేరుపెట్టి ఉంటారని గజల్ విశ్లేషకులు ఊహించారు. అయితే ఈ వల్లరికి వ్యాప్తిగాని, ప్రచారంగాని రాలేదు. కొందరు ఈ పేరును ప్రముఖ సినీ నేపథ్యగాయకులు పి.బి శ్రీనివాస్ సూచించారని అంటారు. కాని అది నిజం కాదని దాశరథిగారే స్వయంగా ఉత్తరం ద్వారా వల్లరి విషయం తెలిపిన ఉదంతాన్నిబట్టి తెలుస్తున్నది. మహాకవులు తమ సమర్థతకు తగిన ఆదరణను తప్ప, అన్యులకు దక్కవలసిన గౌరవాన్ని ఆశించరు కదా!

> సాధారణంగా గజల్‌లో ప్రియుడే ప్రియురాలితో మాట్లాడుతుంటాడు తప్ప ఆమె మాట్లాడదు.

**సల్లాపము**

"సల్లాపం సంకలనానికి ఒక పాఠకుని స్పందనగా ఉర్దూ సాహిత్యంతో గాఢమైన సంబంధం గల డా.నోముల సత్యనారాయణగారు గజల్ కు సరైన పర్యాయపదం సల్లాపం అని నిర్ధారించారు. "(గజల్ జాడలో పెన్నా సల్లాపం– డా.కోవెల సంపత్కుమారాచార్య–రసమయి మాసపత్రిక 2003 జూన్ సంచిక)

సల్లాపం అంటే పరస్పర సంభాషణమని శబ్దరత్నాకరం చెబుతున్నది. గజల్ కు సంబంధించి ఇది రసస్పర్శ గల సరస సంభాషణగా అర్థం చెప్పుకోవచ్చు. ఈ సంభాషణ కూడా ఏకపక్షమే. సాధారణంగా గజల్ లో ప్రియుడే ప్రియురాలితో మాట్లాడుతుంటాడు తప్ప ఆమె మాట్లాడదు. కేవలం ఆమె శ్రోత మాత్రమే. ఒక్కోసారి శ్రోతకూడా కాదు. అందుకే సల్లాపమంటే గజల్ పరిభాషలో ప్రియుడు మాత్రమే ప్రియురాలు వింటుందనే ఒకానొక కాల్పనిక భ్రాంతిలో జరిపే ఏకపక్ష సంభాషణ అని అర్థంచేసుకోవచ్చు.

గజల్ ను దేశీయం చేయడానికి ఎవరెన్ని పేర్లు పెట్టినా అవి వ్యవహారంలోకి రాలేదు. గజల్ 'గజల్' నామం తోటే తెలుగు సరసన చేరి కాంతిని సాహిత్య సీమల్లోకి విరజిమ్ముతున్నది.

**తెలుగు గజల్ లక్షణాలు:**

ఆదర్శాలను అందుకోవడానికి చేసే ప్రయత్నంలో భాగంగానే కవిభావన రచనగా రూపుదిద్దుకుంటుంది. ఒక భాషలోని ప్రక్రియను మరో భాషలోనికి యధాతథంగా తీసుకురావాలన్న తపనే తెలుగువారికి గజల్ ప్రక్రియను సొంతం చేసింది. ఏ భాషా ప్రక్రియనైనా భాష, సంస్కృతి, సంప్రదాయాలను అనుసరించి స్వల్పమైన మార్పులతో తనలో ఇముడ్చుకోవడం తెలుగు భాషావిశిష్టత. ఈ ప్రత్యేక లక్షణమే తెలుగుభాష విస్తరించడానికి, విస్తృతపదజాలంతో సజీవ స్రవంతిలా ప్రవహించడానికి దోహదం చేస్తున్నది.

**ఒక్కో సందర్భంలో సమన్వయం చేసుకుంటూ గజల్ ప్రక్రియ తెలుగునేల పై మొలక నుండి మొక్కదశకు ఎదుగుతూ వచ్చింది.**

పూర్వకాలం నుండీ అనేక భాషలతో సత్సంబంధాలను ఏర్పర్చుకొని, వివిధ భాషాసాహిత్యాలలోని మేలిమి లక్షణాలను, ప్రక్రియలను వశపరచుకొని, దేశీయభావనలతో అనేక భాషాసాహిత్య సంప్రదాయాలతో వ్యవహర్తలను మమేకం చేయగల ఉదారత తెలుగు భాషకున్న గొప్ప గుణం. దీనిలో భాగంగానే వేషభాషలు, సంస్కృతీ, సంప్రదాయాలు వేరైనా అరబీ, ఫారసీ, ఉర్దూ సాహిత్యాలలోని గజల్ ప్రక్రియను తెలుగు భాష సాదరంగా ఆహ్వానించింది. వాస్తవంగా గజల్ రూపం తెలుగు సంప్రదాయ రచనా విధానానికి ఒదిగేది కాదు. పైగా పదపునరావృత్తులు తెలుగు సాహిత్యంలో ఒక దోషంగా లాక్షణికులు పరిగణిస్తారు. గజల్ అరబ్బు దేశాల సాంఘిక, సామాజిక పరిస్థితులు, కట్టుబాట్లు సంస్కృతీ సంప్రదాయాల కనుగుణంగా రూపొందిన ప్రక్రియ. కనుక అక్కడి ప్రజల జీవన స్థితిగతులకు, తెలుగువారి జీవన విధానాలకు వైవిధ్యం ఉంది. ఇది ఆయా సాహిత్యపరమైన అభివ్యక్తులలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఇలాంటి అనేక అవరోధాలను, ఆటంకాలను అధిగమిస్తూ, ఒక్కో సందర్భంలో సమన్వయం చేసుకుంటూ గజల్ ప్రక్రియ తెలుగునేల పై మొలక నుండి మొక్కదశకు ఎదుగుతూ వచ్చింది. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, ఫారసీ గజల్ మొలకెత్తే వాతావరణ పరిస్థితులు తెలుగునేల పై లేవని ప్రముఖ కవి, విమర్శకులు శేషేంద్ర అభిప్రాయ పడ్డారు.

"గజల్ కు వాస్తవంగా తెలుగులో మొలకెత్తడానికి అనుకూలమైన నేల లేదు" (పక్షులు, సముద్రం నాపేరు, ఈ నగరం జాబిల్లి–శేషేంద్ర–పుట.133) ఏదేమైనా గజల్ తెలుగునేల పై పడి, మొలకెత్తి, తన ఉనికిని, శక్తిని ప్రదర్శిస్తున్న విషయం చారిత్రక సత్యంగా నిలుస్తుంది. ఫారసీ, అరబీ గజల్ యధాతధంగా దిగుమతి కావడానికి, భావం, భాష మరియు ఛందోపరమైన సమస్యలు ఉన్నమాట విస్మరించలేము కాని, నిర్మాణపరంగా, రూపపరంగా దేశీయం చేసుకొని ఎందరో కవులు తెలుగు గజల్ ప్రక్రియను ఆదరించడం హర్షించదగిన విషయం.

రదీఫ్ లేని గజళ్ళను బేమురద్దఫ్ గజళ్ళు అంటారు. రదీఫ్ కు ముందు వచ్చే ప్రాస పదాన్ని కాఫియా అంటారు.

తెలుగు లోనికి దిగుమతి చేసుకున్న గజల్ రచనకు మూలంలోని మౌళిక లక్షణాలనే అనుసరించారు. గజల్ కొన్ని ద్విపదల సమూహం. ఇవి ఐదునుండి ఇరవై ఐదు వరకు ఉండవచ్చు. వీటి సంఖ్య ఇంత అని, ఇన్ని షేర్లే రాయాలనే నియమం లేదుగాని, మత్లా, మక్తాలను మినహాయించి షేర్లు బేసి సంఖ్యలో ఉండాలని, అలా బేసి సంఖ్యలో షేర్లుండటం ప్రేయసి అసమానురాలనే విషయాన్ని సూచిస్తుందని గజల్ పండితుల వివరణ.

ప్రతి ద్విపదకు ఒక పేరు ఉంది. మొదటి ద్విపదను మత్లా అంటారు. చివరి ద్విపదను మక్తా అని పిలుస్తారు. మత్లాకు, మక్తాకు మధ్యనున్న ద్విపదలను షేర్లు అంటారు. షేర్ లోని మొదటి పాదాన్ని మిస్రా లేదా మిస్రాసాని అని, రెండవ పాదాన్ని మిస్రా ఊలా అని వ్యవహరిస్తారు. మత్లాలో రెండుపాదాల లోనూ రదీఫ్, కాఫియాలు ఉండటం నియమం. అలా ఉంటేనే అది మత్లా అవుతుంది. ఈ మత్లాని పాటలోని పల్లవితో పోల్చవచ్చు. రదీఫ్, కాఫియాలు ప్రతీ షేర్లోని రెండవ పాదంలో ప్రయుక్త మవుతాయి. రదీఫ్ అంటే మత్లాలోను, షేర్ లోని రెండవ పాదం చివర ప్రయుక్తమయ్యే పదం. ఇది రెండునుండి ఆరు అక్షరాల పరిధిలోపల ఉంటే పఠనానికి, గానానికి సౌకర్యంగా ఉంటుంది. గజళ్ళను రదీఫ్ లేకుండా కూడా రాయవచ్చు. రదీఫ్ లేని గజళ్ళను బేమురద్దఫ్ గజళ్ళు అంటారు. రదీఫ్ కు ముందు వచ్చే ప్రాస పదాన్ని కాఫియా అంటారు. కాఫియా, రదీఫ్ లోనికి వెళ్ళకూడదు. అంటే ఆ పాదం కాఫియా తో విరిగి పోవాలి. ఈ

కాఫియానే గజల్ కు గరిమనాభి వంటిది. రదీఫ్ లేకుండా గజల్ ఉండవచ్చు కాని. కాఫియా లేకుండా గజల్ ఉండదు.

> రదీఫ్ లేని గజళ్ళను శ్రోతల హృదయాలకు చేర్చడం కొంత క్లిష్టమైన పని.

కాఫియా లోని చివరి అక్షరాన్ని లేదా ఆ అక్షరంలోని అచ్చును 'రవీ' అంటారు. ఈ రవీ అంత్యప్రాసను నిర్దేశిస్తుంది. కాఫియా వలన గజల్ కు చమత్కారము, వ్యంగ్యము, మెరుపుతో పాటు ఒక తూగు చేకూరుతుంది. గజల్ కు ఒదిగే ఉపమ, రూపకాలంకారాలను భూషించడానికి ఎక్కువ అవకాశమున్న చోటుకూడా కాఫియానే అవుతుంటుంది. రదీఫ్ పునరావృత మగుట వలన నాదమాధుర్యంతో పాటు, స్వతంత్ర (ముక్తక) భావాలను వ్యక్తం చేసే షేర్లను అన్నింటిని దండలో దారంలా కలిపి ఉంచడానికి ఉపయోగపడుతుంది. అంతేకాదు షేర్ లో కవి ఉద్దేశించిన భావానికి ఒక వ్యూహాన్ని అందిస్తుంది. ఈ రదీఫ్ లేని గజళ్ళను శ్రోతల హృదయాలకు చేర్చడం కొంత క్లిష్టమైన పని. అందుకే గజల్ కు నిర్దేశించపడిన అన్ని లక్షణాలను పాటించ వలసి ఉంటుంది. ఇలా పాటించిన గజలే నిర్మాణ పరంగాను, భావపరంగాను పరిపుష్టిని కలిగి శ్రోతల మదికి త్వరగా చేరుతుంది.

తఖల్లుస్ (నామముద్ర/కలంపేరు/మారుపేరు) సాధారణంగా గజల్ లోని చివరి షేర్ (రెండు పాదాలలో ఏ ఒక్కదానిలో నైనా) లోప్రయోగించాలి. కాని ఇది నిర్బంధంగా పాటించి తీరవలసిన నియమంకాదు. కవి అవసరాన్ని బట్టి మత్లాతో సహా ఏ షేర్లోనైనా ప్రయోగించవచ్చు. ఈ తఖల్లుస్ అనేది వాడటం, వాడకపోవడం కవి ఐచ్ఛికం. షేర్లోని ప్రతిమిస్రా దేనికదే సర్వస్వతంత్ర భావంతో సంపూర్ణంకావాలి. అంటే దానికింది మిస్రాలోనికి భావంగాని, వాక్యంగాని కొనసాగకూడదు. ఇలా రాసినప్పుడే మత్లాలేకుండా కేవలం షేర్ ను చదివినప్పుడు భావం సంపూర్ణంగా అర్థం అవుతుంది. అయితే ఏ షేర్ నైనా మత్లాతో కలిపి చదివినప్పుడు మరింత రసాస్వాదన చేయడానికి అవకాశం ఉంటుంది. పై మిస్రాలో విషయాన్ని లేదా భావాన్ని కింది మిస్రా చమత్కార, ధ్వని, వ్యంగ్య, అధిక్షేపాల సహాయంతో సమర్ధించడంగాని, ఆ ప్రశ్నకు సమాధానాన్ని సూచించడంగాని జరగాలి. అంటే షేర్లోని మిస్రాల మధ్య ఘనిష్టమైన సంబంధం

ఉండాలి. దీనినే దావాదలీల్ టెక్నిక్ అంటారు. అయితే ఒక్కొక్కసారి ఒకే భావం రెండుమూడు షేర్ల లోనికి కొనసాగడం అరుదుగా జరుగుతుంటుంది. దీనినే 'ఖితాబంద్' అని పిలుస్తారు.

గజల్ లోని షేర్లు వేరువేరు వస్తువులతో, వర్ణనలతో ఉండాలి.

"గజల్ రచనలో చరణాలు (షేర్లు) రాసేటప్పుడు ప్రతిషేర్లో మొదటిపాదం ఉత్కంఠను కలిగించేదిగాను, రెండవపాదం ఆ ఉత్కంఠ ముడి విప్పేదిగాను ఉండి, ఓ అద్భుతమైన భావప్రకటన వెలువడి హృదయాలను తాకేదిగా ఉన్నప్పుడు ఆ షేర్ ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటుంది. భాషాసౌందర్యాన్ని, మంచి కాఫియా, రదీఫ్ లతో రూపొందించి భావవ్యక్తీకరణ చేసినప్పుడు ఆ షేర్ ప్రేక్షకుల ప్రాణతంత్రులను మీటుతుంది. (తెలుగు గజల్–డా.చజల్ శ్రీనివాస్–పుట.61)

కాఫియాను ప్రయోగించడమనేది యాంత్రికంగా ఉండకూడదు. కాఫియా ఉపయోగించాలి కాబట్టి ఉపయోగించాలనే ఉద్దేశ్యంతో కాకుండా, దానిని సమర్థవంతంగా, సందర్భోచితంగా ప్రయోగించాలి. కాఫియాను శ్రోత ఊహించి భంగపడాలి. అప్పుడేకవి ఉద్దేశించిన కాఫియాను విని ఆశ్చర్యాద్భుతాలతో కూడిన ఆనందాన్ని పొందగలుగుతాడు.

గజల్ లోని షేర్లు వేరువేరు వస్తువులతో, వర్ణనలతో ఉండాలి. అంటే ఒక షేర్లో తాత్వికత, మరొకషేర్లో ప్రేమ, మరో షేర్లో భక్తి ఇలాగన్నమాట. గజల్ లోని షేర్లన్నింటిలోనూ ఏకవస్తు ప్రస్తావన ఉండే గజళ్ళను కూడా రాయవచ్చు. అటువంటి గజళ్ళను మూసల్ సల్ గజళ్ళు అంటారు. ఇటువంటి మూసల్ సల్ గజళ్ళలో కాఫియాలను సమర్థవంతంగా ప్రయోగించకుటే అవి పాటలుగా,గేయాలుగా మారిపోతాయి.

"గజల్ ఒక కవితా ప్రక్రియేకాదు అదొక కల్చర్. ఆ కల్చర్ ను ఒంటబట్టించుకున్నవాళ్ళే గుంభనంగా, మార్మికతతో చెప్పిన కవి భావాన్ని సులువుగా పట్టుకుంటారు. కాఫియాను అందుకుంటారు." అంటారు డా.సామల సదాశివ.

ఈ కాఫియా,రదీఫ్ లు కవియొక్క భావస్వేచ్ఛను నియంత్రిస్తాయనే విమర్శ ఉంది. అయితే ఇది ఒక్క గజల్ కు మాత్రమే పరిమితం కాదు. ఛందోబద్ధమైన అన్ని ప్రక్రియలకూ ఇది వర్తిస్తుంది. గజల్ రూపం, సారం సహగమాలుగా. సమప్రాధాన్యంతో, సమన్వయంతో నిర్మించబడాలి. ఇదే గజల్ నిర్మాణ దక్షతకు నిదర్శనంగా నిలుస్తుంది. మౌళికంగా గజల్ ప్రక్రియలో సాహిత్యానికి, సంగీతానికి సమప్రాధాన్యత ఉంటుంది. అందుకే గజల్ ను చదివినా, పాడినా శ్రోత ఒకేరకమైన రసాస్వాదనకు లోనవుతాడని అంటారు. కాని గజల్ లయ, గతులతో (బహర్) రాయబడుతుంది. కాబట్టి పాడినప్పుడే దాని అసలు సౌందర్యం ప్రదర్శించ బడుతుంది.

తెలుగులో మొదటినుండీ అనేక మంది కవులు మాత్రా ఛందస్సునే గజల్ రచనకు ఉపయోగించారు.

గజల్ ని అరబీ, ఫారసీ, ఉర్దూ భాషలలో ప్రత్యేకమైన బహర్లతో రాస్తారు. తెలుగులో ఆ బహర్లు లేవు. కనుక గేయాన్ని రాయడానికి ఉపయోగించే మాత్రా ఛందస్సులో వివిధ గతులను పాటిస్తూ, గానయోగ్యంగా మలుస్తారు. ఇలా గతిలో రాయడాన్నే మీటర్లో రాయడం అంటారు.

తెలుగులో మొదటినుండీ అనేక మంది కవులు మాత్రా ఛందస్సునే గజల్ రచనకు ఉపయోగించారు. కొందరు బహర్లను అక్షర గణాలుగా మార్చి, వాటి మార్గంలో గజల్ ను నడిపించినవారూ ఉన్నారు. కాని అవి అత్యంత స్వల్పం. ఆ పద్ధతిని ఆ తరువాత ఎవరూ అనుసరించ లేదు. గజల్ కు కచ్చితంగా సరిపోయిన ఛందస్సు మాత్రాఛందస్సేనని చెప్పవచ్చు. మాత్రా ఛందస్సులో రాసిన గజళ్ళే దేశీయం కావించబడి వాసిలోనూ, రాసిలోనూ లక్షణబద్ధమైన గజళ్ళు ప్రసిద్ధి చెందాయి.

గజల్ రూపంలోని ప్రధానాంగాల ప్రయోగంపై స్పష్టమైన అవగాహన కొరకు ఒక ఉదాహరణను గమనిద్దాం:

మొదటి షేర్(మత్లా):

నీ చెంత ననునేను {మరచి} వచ్చేశాను ..............<br>
మరపులో ఇలుదాటి {నడచి} వచ్చేశాను ................

రెండవ షేర్:
నీవెంట రానుగానీ దారి తెలియనీ......(మిస్రాసాని)
త్రోవంత ఒకసారి {తుడిచి}వచ్చేస్తాను...(మిస్రాఊలా)

మూడవ షేర్:
పని ఉండికాదు, నాలుక తీపికోరితే
నోరార నీపేరు {పిలిచి} వచ్చేస్తాను--->(రదీఫ్)

నాలుగవ షేర్:
ఈ కన్నులున్నవే ఇవి మట్టి దొన్నెలే
నిను చూపి దివ్వెలుగ {మలచి} వచ్చేస్తాను ---->కాఫియా

ఐదవ షేర్:
ఎంతకూ నీవు కనబడనపుడు ఈ గుండె
కన్నీటి బింధువుగ {విడిచి} వచ్చేస్తాను

ఆరవ షేర్(మక్తా):
'రెంటాల' కంటూ మంచీ చెడూ లేవిపుడు
ప్రతిది నీ చూపుతో {కొలిచి }వచ్చేస్తాను

(రెంటాల గజళ్ళు – గీతాలు, మంత్రశాల–డా.రెంటాల వెంకటేశ్వరరావు. పుట:13)

ఈ గజల్ లో కాఫియాలు: మరచి, నడచి, తుడిచి, పిలిచి, మలచి, విడిచి, కొలిచి) అనే పదాలు. ఈ పదాలలో చివరి వర్ణం 'ఇ',దీనిని 'రవీ' అంటారు. రవీ అనేది అంత్యప్రాసను రూపొందిస్తుంది. 'వచ్చేస్తాను' అనే పదం మత్లాలో రెండు మిస్రాలలోనూ ఉంటుంది. కాఫియాలు కూడా మత్లాలోని రెండు మిస్రాలలో ఉండటం నియమం. గజల్ మొత్తం మీద రెండు మిస్రాలలో రదీఫ్, కాఫియాలు ఉండేది ఒక్క మత్లాలోనే. చివరి షేర్ ను మక్తా అంటారు. సాధారణంగా మక్తాలో తఖల్లుస్ ను ప్రయోగిస్తారు. తఖల్లుస్ అంటే నామముద్ర. ఈ గజల్ లో తఖల్లుస్ "రెంటాల" ఇది ఖండగతిలో నడిచింది.

## తెలుగుగజల్ నియమాలు

ప్రపంచ భాషాసాహిత్యాలలో ఏ ప్రక్రియకైనా ఏవో కొన్ని నిర్దిష్టమైన నియమాలు నిర్దేశించబడి ఉంటాయి. వాటిని ఉపేక్షించకుండా పాటించినప్పుడే ఆ ప్రక్రియ సంబంధమైన అసలు ప్రయోజనం నెరవేరుతుంది. అది అరువు తెచ్చుకున్న ప్రక్రియ అయినప్పటికీ మూలంలోని నియమాలను భాషాసంస్కృతులకు అనుగుణంగా మార్చుకొని లేదా,అవకాశం మేరకు యధాతథంగా పాటించడం వలన ఆ ప్రక్రియ మూల స్వభావానికి తగినట్లు ప్రవర్తిస్తుంది. అయితే గజల్ రచన విషయంలో తెలుగు గజల్.. ఉర్దూ, ఫారసీ గజల్ నియమాలనే పాటించింది. దీనిని ప్రధానంగా ఐదు గతులుగా విభజించారు. గతికి గమనం, నడై అనునవి పర్యాయపదాలు అవి:

1.త్రిస్రగతి, 2.చతురస్రగతి. 3.మిశ్రగతి, 4.ఖండగతి, 5.సంకీర్ణగతి

1. త్రిస్రగతి:
ఇది మూడు, మూడు మాత్రల ఆవృత్తిలో నడుచు గతి గల చందస్సు.

ఉదా:
బ్రతికి యున్న క్షణము కన్న నిజమేదీ లేదు కదా!
(3) + (3) (3) + (3) (2)+(4) (3) + (3)

గతము నెంచి వగచి నంత ఫలమేదీ లేదు కదా!
(3) + (3) (3) +(3) (2)+(4) (3) + (3)

2.చతురస్ర గతి:
ఇది నాలుగు,నాలుగు మాత్రల గతిలో నడుచు ఛందస్సు

ఉదా:
గతాల వనాన వాడిన పూలకు సుందర రాతిరి పరిమళ మద్దెను
(4) + (4) (4) + (4) (4) + (4) (4) + (4)

కుమారి కురులే అలలై ఊగితె చీకటి దీపం మెరిసి పోయింది
(4) + (4) (4) + (4) (4) + (4) (3) + (5)

3.మిశ్రగతి:

ఇది మూడు,నాలుగు మాత్రల కలయికతో నడిచే ఛందస్సు.

ఉదా:
ఏమి చిత్రము చేసి నావో మనసు నిలువదు నిముష మైనా
(3) + (4) (3)+(4) (3) + (4) (3) + (4)

స్వామి నీవే శాంతి ధామము నిదుర వాకిట జార డానికి
(3) + (4) (3) + (4) (3) + (4) (3)+(4)

ఈ మిశ్రగతిలోనే గురజాడ అప్పారావుగారు ముత్యాల సరాలను ఛందస్సును సృష్టించి నవ్యకవిత్వమున అశేష వ్యాప్తినిగావించారు.

"ఏ క్షణమున గురజాడవారు దీనినాంధ్రభారతీ గళమున కైసేసిరో అప్పటి నుండి ఇది అనంతర కవులందరకు ఆరాధ్యమైనది. రాయప్రోలు వారు దీనిననుసరించిన ప్రథములలో ఒకరు. విశ్వనాథవారు కోకిలమ్మ పెళ్ళి, సొంతము ఈ ఛందములోనే రచించిరి. అబ్బూరి, దేవులపల్లి, వేదుల, నండూరి, బసవరాజు మున్నగు కవులు కనీసమొక్క ముత్యాలసరమైనను కూర్చిరి" (ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు, ప్రయోగములు,డా. సినారె,పుట.481)

4. ఖండగతి:
ఇది ఐదు, ఐదు మాత్రల ఆవృత్తిలో నడుచు గతిగల ఛందస్సు.

ఉదా:
వెన్నెలే పూసినా వెలుగేది లోకాన
(5) (5) (5) (5)

ఆత్మలో అందమై కనిపించు చెలికాడ

(5) (5) (5) (5)

"భావకవులు రచించిన గేయములలో అధిక భాగము ఐదు మాత్రల ఆవృత్తులతో నడుచు ఖండగతిలోనే ఉన్నాయి.ఎంకిపాటలలో ఏ కొన్నియో తప్ప, అన్నియూ ఈ గతిలోనే కలవు. కృష్ణశాస్త్రి గారి గేయములు కూడా అధిక భాగము

ఈ గతిలోనే కలవు. ఇది ద్విపదకు, సీసమునకు సన్నిహితమైన దగుట వలన, భావకవులు మొదట పద్యములతోనే తమ కవితా సాధనము ప్రారంభించినందు వలన ఈ ఖండగతి అనుకొనకుండ వారిని వశపరుచుకున్నది" (ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు, ప్రయోగములు, డా.సినారె,పుట.474)

5. సంకీర్ణగతి:

నాలుగు, ఐదుమాత్రల కలయికతో (9మాత్రల )ఆవృత్తితో నడుచు మిశ్రమగతి గల ఛందస్సు. ఈ గతిలో గజళ్ళు చాలా అరుదుగా కనిపిస్తాయి. నాలుగు, ఐదు మాత్రలు కలిసి తొమ్మిది మాత్రలుగా ఏర్పడతాయి. అంటే దీనిని చతురస్ర, ఖండ గతుల మేళవింపుగా భావించవచ్చు.

ఉదా:
కథలా మెదిలేవు గతమై తొలిగేవు యతిలా మారాను నీకోసమే
(4) + (5) (4) + (5) (4) + (5) (7)

చితినే జోకొట్టి ఎదలో గుడికట్టి జతకై వేచాను నీకోసమే
(4) + (5) (4) + (5) (4) + (5) (7)

రెప్పపాటు కాలంలో లేదా, చిటికె వేసినంత కాలంలో ఉచ్చరించబడే అక్షరములు లఘువులు. ఇవి హ్రస్వాక్షరములుగా పిలిచే అక్షరములు. మాత్రా ఛందస్సులో లఘువు ఒక మాత్రతో సమానము. దీర్ఘాక్షరాలు, సున్నతో కూడి ఉన్న అక్షరములు, ఁకారపొల్లుతో కూడి ఉన్న అక్షరములు, ద్విత్వాక్షరముల, సంయుక్తాక్షరముల ముందు ఉన్న అక్షరములు గురువులు. గురువులను రెండు మాత్రలుగా గుర్తిస్తారు.

**లయనియమం :**

తాళాంతరాళ వర్తీయః కాలోసౌలయ నామకః
ధ్రుత మధ్య విళంబాశ్చ భవేయుస్త్రివిధా లయాః
ధ్రుతో మధ్య విళంబశ్చ ధ్రుతశ్శీఘ్రతమో మతః

ద్విగుణా ద్విగుణోజ్ఞేయో తస్మాన్ మధ్య విళంబితౌ (సంగీత ప్రథమ బోధిని–ఏకా సుబ్బారావు.పుట.12)

తాళము మధ్యలో నడిచే కాలము లయ అనబడుతుంది. ఈ లయ మూడు రకాలు. వీటిలో వేగంగా నడిచేది ద్రుతము. దానికి హెచ్చింపు చేసి నడిచే కాలము మధ్యము, మధ్యమానికి కొంత పెంచి నడిచే కాలము విళంబితము. పాడుటకు ఎంత వేగముగా తాళము వేసుకొనుటకు వీలగునో అట్టి లయను ద్రుతలయ అంటారు. ఈ లయకు రెట్టింపు విళంబితము."గీత తాళాదీనామేకత్ర విరామో లయః" అని,శ్రుతిర్మాతా పితా లయః అని ఆర్యోక్తి. దీనినిబట్టి సంగీతానికి శ్రుతిలయలు ప్రాణభూతమైనవని తెలుస్తున్నది.

పద్యాలలో ఉచ్చరించబడే వర్ణసముదాయాల ఆరోహణ, అవరోహణాల క్రమాన్ని అనుసరించేది లయ. ఈ లయ అనేక విధాలుగా సాధించ బడుతుంది. పద్యపాదములోని వర్ణసముదాయాన్ని లేదా మాత్రా సముదాయాన్ని చిన్న చిన్న ఖండాలుగా విభజించి పేర్చి, ఆ యా ఖండాలపై విశ్రాంతి పాటించి చదవటం కూడా లయను సాధించడంలోని భాగమే. ఆ యా ఖండాలను ఆ విధంగా వేరుచేసి ఉచ్చరించడం వలన వాటిలోని పరస్పర సామరస్యమనేది సాధించబడి మొత్తం పద్యమంతటికీ ఒక తూగును, ఒక ధ్వనిసౌందర్యమును, ఒక నిశ్చితమైన గతి విన్యాసమును చేకూర్చుతుంది.

ప్రధానంగా గజల్ లయాత్మక ప్రక్రియ కావడం వలన మాత్రాఛందస్సులో వివిధ తాళగతులలో రాయబడుతుంది. ఇలా తాళగతుల మార్పులతో రచించబడిన గజళ్ళు వైవిధ్యంతో రజింపజేస్తాయి. ఈ తాళగతులే గజల్ ను గానయోగ్యంగా లయాన్వితం చేస్తాయి. అందుకే గజల్ లో లయనియమం ఆవశ్యక నియమంగా ప్రయుక్తం చేయబడుతుంది. ఒక వేళ గజల్ లయలో రాయబడనిచో దానిని తఖ్తీ అంటారు. ఇటువంటి గజల్ కేవలం చదవడానికి మాత్రమే పనికి వస్తుందిగాని గానయోగ్యతను కోల్పోతుంది.

# తెలుగు గజళ్ళ లో చమత్కార సౌరభం

ఆచార్య ముకుంద సుబ్రహ్మణ్య శర్మ
98492 57174

తెలుగు సాహిత్యంలో గజల్ కి ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో మాత్రా ఛందస్సు ఆధారంగా ద్విపదల రూపంలో ఉండే షేర్లు వేటికవే స్వతంత్ర భావ ప్రతిపత్తితో ఉంటూనే అంతర్లీనంగా ఒక మూలసూత్రంతో భావ సౌందర్యాన్ని ఇనుమడింప చేస్తాయి. గజల్ సుకుమారమైన ప్రాణి. ఇందులో వాడే భాష సరళంగా లలిత పద లావణ్య భూషితమై ఉండాలి. అభివ్యక్తిలోనే చమత్కార ప్రధానమైన మెరుపు, విరుపు ధ్వనించి భావంలో సున్నితమైన శ్లేష పాఠకుల హృదయాలని తాకాలి. అదే ఈ వాగ్గేయ ప్రక్రియ ముఖ్య లక్షణం. ప్రేమ, విరహం ప్రధాన వస్తువులుగా సాగినా అభివ్యక్తిలో గాఢత, చమత్కారం గజల్ కి ఆయువు పట్టు.

గజల్ అంటే ప్రియురాలితో ముచ్చట్లు అనే అర్థం ఉన్నా అది ఎడబాటు, వేదన, ఆరాధనకే పరిమితం. గజల్ ముఖ్య ఉద్దేశం ఇతర కవితా ప్రక్రియలకన్న భిన్నమైనదనే చెప్పుకోవాలి. పాఠకులని (శ్రోతలని) రంజింప చేయడం "వహ్వా" అనిపించడం గజల్ ప్రధానోద్దేశం. భావోద్వేగాలు, అనుభవాలు, ఆలోచనలు వ్యక్త పరిచేటప్పుడు అంతర్లీనంగా చమత్కారం ధ్వనించాలి. షేర్ల లో లయ, అంతర్దృష్టి, గాఢత మరియు సౌందర్యాత్మకత గజళ్ళ లక్షణాలు. గజల్ సౌందర్యం లయ, చమత్కారం పైనే ఆధారపడుతుంది. అధిక్షేపణ, వ్యతిరోక్తుల ప్రయోగం, వ్యంగ్య భావాలు, అనూహ్యమైన మలుపు తిప్పటం, విశేషార్థాన్ని ధ్వనింప చేయడం, సున్నితమైన హాస్యాన్ని పండించడం, ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు చెప్పటం, అలంకారికతతో ఉండడం.... ఇవన్నీ చమత్కారానికి సాధనలే. లయబద్ధమైన పద బంధాలతో కవి భావంలో తెచ్చే మెరుపు, విరుపు చమత్కారం. చమత్కారం ఆలోచనలో కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తుంది. కొన్ని సార్లు సమాజాన్ని ప్రశ్నించడానికి ఉపకరిస్తుంది.

నిజానికి చమత్కారం కేవలం గజళ్ళకే పరిమితం అవ్వలేదు, అన్ని కవితా ప్రక్రియలలోనూ ఉంది.... చాటువులు రూపంలోనూ అవధానంలో దత్తపది రూపంలోనూ ఎప్పుడో తెలుగు సాహిత్యంలో చేరిపోయాయి. ప్రతీ షేర్ దావా (వివాదం/ప్రశ్న) దలీల్ (సమాధానం/సమాధానం/ప్రతివాదన) పద్ధతిలో ఉండి చమత్కారం ప్రదర్శించడం కత్తి మీద సాము లాంటిదే. అందుకే అభివ్యక్తికి అనువైన ఎత్తుగడ, అలంకారికతతోగూడిన శబ్ద సౌందర్యం, భావ సౌందర్యం గజల్ కి ఎంతైనా అవసరము.

**తొలి తెలుగు గజల్ గా కొనియాడ బడుతున్న గజల్ లో నుంచి తీసుకున్న మత్లా, షేర్ లని పరిశీలించండి.**

ఈ వ్యాసం ముఖ్యోద్దేశ్యం తెలుగు లో ఎంపిక చేసిన కవులు అనుసరించిన చమత్కార వ్యూహాలను విశ్లేషించి భావి తరం రచయితలకి తగు సూచనలు ఇవ్వడం.

**దాశరథి గజళ్ళలో చమత్కార సౌరభం...**

తెలుగు సాహిత్యంలో మొదటి సారిగా గజల్ ని పరిచయము చేసిన ఘనత శ్రీ దాశరథి కృష్ణమాచార్యులు గారే. అంతకు ముందు ఇతర కవితా ప్రక్రియలలో గజల్ ఛాయలు కనిపించినా పూర్తి స్థాయి గజల్ రాలేదనే చెప్పాలి. దాశరథి తెలుగు గజల్ లో తీసుకున్న ఎత్తుగడ, కవి సమయం ఉర్దూ గజళ్ళ కి చాలా దగ్గరగా ఉన్నా అందులోనే తెలుగు సంప్రదాయాన్ని ప్రదర్శించడం గొప్ప విషయం. తొలి తెలుగు గజల్ గా కొనియాడబడుతున్న గజల్ లో నుంచి తీసుకున్న మత్లా, షేర్ లని పరిశీలించండి.

మత్లా..

వలపునై నీ హృదయ సీమన నిలువ వలెనని ఉన్నది
పిలుపునై నీ అధర వీధుల పలుక వలెనని ఉన్నది!

ఈ మత్లాలో హృదయ సీమ, అధర వీధులు ఆలంకారికతకి చక్కని నిదర్శనం. వలపుగా మారి హృదయంలో నిలవాలని అనుకోవడం, పిలుపుగా అధర వీధులలో పలకాలి అనుకోవడం చమత్కారానికి చక్కని ఉదాహరణలు.

షేర్..

చైత్ర మాస నవోదయమ్మున చల్ల గాలికి ఊగుతూ
పువ్వునై నీ కొప్పులోనే నవ్వ వలెనని ఉన్నది!

చమత్కారం పండించాలంటే వ్యూహం ఎంత అవసరమో ఈ షేర్ లో చూడచ్చు. చైత్ర మాసంతో మొదలైన షేర్ కొప్పులో పూవుగా మారి నవ్వాలన్న ప్రియుడి కోరిక అద్భుతంగా పండింది. ఈ గజల్ 1965 లో ఆంధ్రప్రభ ఉగాది సంచికలో ప్రచురించబడింది. ఇదే మొదటి గజల్.

ప్రియురాలు మేడలో ఉంది. అక్కడికి ఎవరినీ రానీయరు. అందుకే ప్రియుడు మారు వేషంలో

ఈ క్రింది గజల్ 'జ్వాలాలేఖిని' సంపుటిలో 'సాఖీనామా' అనే విభాగంలో రాయబడిన మొదటి గజల్. ఇది గజల్ కు ఉండవలసిన అన్ని లక్షణాలు కలిగిన మరొక గజల్.

మత్లా...

"రమ్మంటే చాలుగానీ రాజ్యాలు విడచి రానా
నీ చిన్ని నవ్వుకోసం స్వర్గాలు గడచి రానా"

ఈ మత్లాలో ఎత్తుగడే ఒక చక్కని చమత్కారం. దానికి మిశ్రసానీ (రెండో చరణం) లో ఇచ్చిన సమాధానం, చిన్ని నవ్వు కోసం స్వర్గాన్ని వదిలి వస్తానని చెప్పడం వహ్వా అనిపిస్తుంది.

షేర్

"నీవున్న మేడ గదిలో నను చేరనీయరేమో
జలతారు చీరగట్టి సిగపూలు ముడిచి రానా"

ప్రియురాలు మేడలో ఉంది. అక్కడికి ఎవరినీ రానీయరు. అందుకే ప్రియుడు మారు వేషంలో నైనా అక్కడికి వెళ్లి సిగలో పూలు పెట్టి రావాలనుకోవడం చమత్కారం. అందుకే తరువాత షేర్ లో ...

"పగబూని కరకువారు బంధించి ఉంచినారు
ఏనాటికైన గానీ ఈ గోడ పొడిచి రానా.."

నిజానికి ప్రతీ షేర్ కి మత్లా ఉండాల్సిన భావ సామీప్యత, ఈ గజల్ లో గమనించాలి.

దాశరథి రాసిన గజళ్ళు సంఖ్యా పరంగా తక్కువే కానీ అవి తెలుగులో గజల్ రచనకి పటిష్టమైన పునాది వేశాయి అనటంలో సందేహంలేదు.

**డా. సి నారాయణ రెడ్డి గారి గజళ్ళలో చమత్కార సౌరభం**

గజల్ కి తెలుగు తనాన్ని జోడించి ప్రేమ విరహం నుంచి కుటుంబ, సామాజిక వస్తువులకి మళ్లించిన శబ్ద బ్రహ్మ జ్ఞాన పీఠ్, Dr సి నారాయణ రెడ్డి గారు.

సినారే గారి గజళ్ళలో అధిక్షేపణ, ధిక్కారం, నిరసన, సామాజికత, ప్రభోదాత్మకత దర్శనమిస్తాయి. కావ్య రచనలో అపారమైన అనుభవం, ఎన్నో సినీ గీతాలు రాసిన అనుభవం, పరిశోధన అనుభవం ఉన్న సినారే గారి గజళ్లు లయకి, గతికి, యతికి కంచు కోట వంటివి అనటంలో సందేహం లేదు. ఛందస్సుతో లయ, గాన గుణం సాధించి చూపించిన సినారె గారి గజళ్ళలో నుంచి చమత్కార సౌరభం వెదజల్లే కొన్ని ఆణి ముత్యాలు లాంటి షేర్లు మీ ముందు ఉంచుతున్నాను.

నీలో నువు మునగాలంటే గుండె శిలై పోవాలి... ఎందుకు? దానికి సమాధానం మిశ్ర సాని లో ఎంత అందంగా చెప్పారో చూడండి.

"వేన వేల ప్రాణాలను హరించి విసుగేసిందేమో
మనిషిగా క్షణం జీవించాలని మరణానికి దాహం!"

విసుగు చెందిన మరణానికి కూడా మనిషిలా జీవించాలని దాహం ఉందని చెప్పటం కన్న చమత్కారం ఏం ఉంటుంది. భావ వైచిత్రితోనే చమత్కారం వస్తుంది. ఔచిత్యం దగ్గర ఆగిపోతే అన్ని సందర్భాలలోనూ చమత్కారం సాధ్యం కాదు. గజల్ లో అతిశయోక్తి, విరోధభాస, శ్లేష ప్రయోగాలే భావ సౌందర్యానికి, చమత్కారానికి ఎక్కువ దోహదం చేస్తాయి.

"గుండె మొండిపడి పోకుంటే దాగుండ లేవు నీలో నీవే
చేతులు రెండూ వణుకుతు ఉంటే మమతలు ఎలా బిగిస్తావు?"

నీలో నువు మునగాలంటే గుండె శిలై పోవాలి... ఎందుకు? దానికి

సమాధానం మిశ్రసాని లో ఎంత అందంగా చెప్పారో చూడండి. మమతలు జారిపోకూడదంటే గుండె మొండిగా మారాలి అని కవి సందేశం.

**మిశ్రాలో చిన్న దీపం తీసుకోవడం అక్కడే తిరుగుబాటుని పరోక్షంగా చెప్పడం ఒక ఎత్తు...**

"త్యాగ సుధల్లో తలంటు స్నానాలాడే గొప్పలకేమిలే
ఎంత దక్కినా సొంత సంచికే ఇంకెక్కడిదోయ్ పరహితం?"

ఉపన్యాసాలు వేరు, ఆచరణ వేరు. ఇది తరచు వినపడేదే. ఇక్కడ తలంటు స్నానాలు, సొంత సంచి చమత్కారం కోసం సినారే గారు వాడిన పద బంధాలు 'ఔరా' అనిపించకమానవు.

"చీకటికి చంద్ర బింబంలా ఆకలికి పూర్ణ కుంభంలా
నిలువెల్ల మమతల వెలుగై నిలిచింది అమ్మ రూపు!"

సినారే గారి అమ్మ గజల్ లోని ప్రతి షేర్ లో తీసుకున్న ఎత్తుగడ, ముగింపు రెండూ అపురూపమే. ఉపమాలంకారం, రూపకలంకారం గజల్ లో ఏదైనా ఎలా వాడొచ్చో అన్నదానికి ఈ షేర్ ఒక పాఠం అని చెప్పుకోవాలి.

"చినుకు పడగనే ఉలిక్కిపడితే జీవితమెలా భరిస్తావు
నిత్యం బిగుసుకు చస్తూవుంటే మృత్యువునెలా తరిస్తావు!."

జీవితాన్ని భరించడం ఒక సాధారణ వాక్యం. మత్లాలో దానికి ఇచ్చిన సమాధానం మృత్యువునెలా తరిస్తావు షేర్ కి అనూహ్యమైన ముగింపే. మహాత్ముల మరణం మృత్యువునే తరిస్తుంది అని కవి భావన. మృత్యువుని జయించడం సాధారణ ప్రయోగము. మృత్యువుని తరించడం ఇక్కడ కొసమెరుపు.

"చిన్న దీపమని అనుకోకు అది చీకటినే కాల్చేస్తుంది
జనమే చేస్తుందని అనుకోకు ఆది జాతకాలు మార్చేస్తుంది!"

మిశ్రాలో చిన్న దీపం తీసుకోవడం అక్కడే తిరుగుబాటుని పరోక్షంగా చెప్పడం ఒక ఎత్తు... దాన్ని ప్రజలు అనుకుంటే ప్రభుత్వాలని మార్చడం పెద్ద విషయం కాదు జాగ్రత్త అని హెచ్చరించడం సినారె గారికే చెల్లింది.

## రెంటాల గారి గజళ్ళలో చమత్కార సౌరభం

రెంటాల శ్రీ వెంకటేశ్వర రావు గారి గజళ్ళు తెలుగుతనానికి, చమత్కారానికి, వస్తు వైవిధ్యానికి ప్రతీకలు. రెంటాల గారి మంత్రశాల గజల్ సంకలనం గజల్ అభిమానులందరికి ఒక అపురూపమైన గ్రంథం. నిజానికి మంత్రశాల పేరులోనే చమత్కారం ఉంది. అందులో పాఠకులని మంత్ర ముగ్ధుల్ని చేసే గజళ్ళు చాలానే ఉన్నాయి. వాటి నుంచి కొన్నైనా విశ్లేషించుకోకుండా చమత్కారంపై వ్యాసం పూర్తికాదు.

**సమాజానికి నిజమైన గాయం పసి పిల్లని చూపించి బిచ్చమెత్తే తల్లే కదా.**

"దోసిటా జారేవి నీళ్ళా? కావు కావ్యాలే
దాచుకో ఒక గొప్ప సంస్కృతి ఊట గోదారి!"

గోదావరి నదిని మన సంస్కృతి కావ్యంగా వర్ణించడం ఎంత గొప్ప అభివ్యక్తి. దృశ్యమానంగా ఉన్న ఈ గజల్ లో ప్రతీ షేర్ ఒక గొప్ప అనుభూతికి గురిచేస్తుంది. హృదయానికి సున్నితంగా తాకేదే అసలైన చమత్కారం. ప్రవహించే నీరు సంస్కృతికి ప్రతీకగా చెప్పడం ఇక్కడ చమత్కారం.

"దుప్పటి కౌగిలిలో పొగ కప్పిన టీ రుచిలో ఈ
చలిగాలికి గోర్వెచ్చని స్వర్గమొకటి మొలుస్తోంది!"

చమత్కారం పరవళ్ళు తొక్కిన ఈ షేర్ లో చివరి పదం వరకూ రెంటాల మాష్టారు ఎలా ముగిస్తారో అన్న ఉత్కంఠ పాఠకులని అలా తొలుస్తూ ఉంటుంది. ఒక్క టీ తో గోర్వెచ్చని స్వర్గాన్ని ఆవిష్కరించడమే చమత్కారం.

"సంత నడుమ ఒక జోలె పట్టి పసి గొంతు మోగుతుంటే
నువ్వది గేయం అన్నావు నేనది గాయం అన్నాను!"

ఒక సాధారణ దృశ్యంలో ఎంత గొప్ప భావన! సమాజానికి నిజమైన గాయం పసి పిల్లని చూపించి బిచ్చమెత్తే తల్లే కదా. భావంలో మెలికే కాదు, గాఢత కూడా చమత్కారానికి అవసరమే.

"చనిపోక ముందే స్వర్గ నరకాలు కనిపించాలంటే
వేరే దారేది? ఎవ్వరినో ప్రేమించాలంతే!"

ఒక గొప్ప వ్యూహంతో రాసిన ఈ షేర్ లో చమత్కారం తారాస్థాయికి వెళ్ళింది. ప్రేమిస్తే సర్గ నరకాలు రెండూ అనుభవంలోకి వస్తాయని చెప్పడం ఇక్కడ చమత్కారం.

> దూతగా పంపిన మనసు కాస్తా ప్రియురాలి సిగలో పూవుగా చేరి పోవటం ఎంత అందమైన ఊహ.

"ఏ మాటన్నా మనసే కనిపించాలి కదా!
ఏం చేస్తున్నా తపసే అనిపించాలి కదా !"

మనసుతో చెప్పని మాటలు వ్యర్థం. ఇది అందరికీ తెలిసిన విషయమే. దీన్ని సమర్థిస్తూ ఏ పని చేసినా తపస్సులాగా చేయాలనటం గొప్ప ముగింపు. ప్రభోదాత్మకంగా రాసిన మెరుపు అలాగే కొనసాగటం ఈ షేర్ లో ప్రత్యేకత.

"నాన్న ముద్దులాడి ఎగరవేసినదే తెలుసు గాని
తనకన్నా ఎత్తున నిలబెడుతున్నది తెలియలేదు!"

రెంటాల మాస్టారి పేరు చెప్పగానే గుర్తొచ్చే అద్భుతమైన గజల్ నాన్న గజల్. ప్రతీ తండ్రి కొడుకుని ఎప్పుడో ఒకసారి ఎగరేసి ఎత్తుకోవడం సాధారణమే దానికి నాన్న ఆశని ఆశయాన్ని జోడించి చెప్పటం కొసమెరుపు. వేదికల పైన ఈ నాన్న గజల్ మాస్ట్రో Dr గజల్ శ్రీనివాస్ గారి సుమధుర గళ విన్యాసంతో స్వర్ణోత్సవాల జరుపుకుంది అంటే అతిశయోక్తి కాదు.

**డా. పెన్నా శివరామకృష్ణ గారి గజళ్ళలో చమత్కార సౌరభం...**

తెలుగు సాహిత్యంలో గజల్ కి దశ దిశ నిర్దేశించిన సిద్ధాంత కర్త డా. పెన్నా శివరామకృష్ణ. పెన్నా వారి గజల్ సౌందర్య దర్శిని గజల్ రచనకి దిక్సూచి లాంటిది. ఉర్దూ గజల్ సౌరభాన్ని తెలుగులో వ్యాప్తి చేసిన ఘనత వీరిది. పెన్నా శివరామకృష్ణ గారి సల్లాపం గజల్ సాహిత్యంలో ఈ తరం కవులందరికీ ప్రామాణిక గ్రంథం. పెన్నా వారి సల్లాపం నుంచి కొన్ని ఆణి ముత్యాలు పరిశీలిద్దాం.

"దూతగా నా మనసు నేల పంపితినో గాని
తిరిగిరాక నీ సిగలో విరియై పోయింది!"

దూతగా పంపిన మనసు కాస్తా ప్రియురాలి సిగలో పూవుగా చేరి పోవటం ఎంత అందమైన ఊహ. అదే చమత్కారం. మిశ్రాలో కవి దీనికి ఏ సమాధానం

చెబుతాడో అనే ఉత్కంఠని రేపి దానికి ఊహించని సమాధానం చెప్పటంతో ఈ షేర్ అన్ని విధాలుగా ప్రామాణికమైంది.

> మధశాలకే మైకం కమ్మి ఊయలలా కనిపించడం ఎంత గొప్ప చమత్కారం.

"ఏ మహిమైనా సిరిమల్లెగ నను మారిస్తే బాగుండును
ఒక దినమైనా నీ జడను చేరి తరియిస్తే బాగుండును!"

ఎందుకు తను సిరి మల్లెగా మారాలని అనుకుంటున్నాడు... దానిలో దాగి ఉన్న ఉద్దేశ్యం ఏమిటి? అని ఆలోచించుకునేలోగా దానికి సమాధానం మిశ్ర సానిలో చెప్పటం జరిగింది.

"మధువు నందరికీ పంచిన తనకే మైకం కమ్మినదేమో
నడి రాతిరి మధుశాల ఆగని ఊయలలా కనిపించింది!"

మధశాలకే మైకం కమ్మి ఊయలలా కనిపించడం ఎంత గొప్ప చమత్కారం. తాగిన వాడి ఊహలు ఎలా ఉంటాయో అలా చెప్పటం గొప్ప భావన.

"పరిమళ ద్రవ్యాలతోటి పనేముంది నాకింక
తలచినంత తావి చిలుకు నామానికి వందనం!"

తన పేరు తలచుకుంటేనే మది పరిమళ భరితం అవుతుందన్న విషయాన్ని ముందు ప్రస్తావించకుండా నాకు ఇక పరిమళ ద్రవ్యాలతో పని లేదు అని చెప్పటం ఇక్కడ చమత్కారం.

"ఆవారా గాలి ఆటలాడుతూనే ఉన్నది
ప్రతి వెదురూ గుండె పగిలి పాడుతూనే ఉన్నది"

అద్భుతమైన భావ సౌందర్యం నింపుకున్న ఈ షేర్ గజల్ పాఠకులందరి హృదయాలలో ఎప్పటికీ నిలిచి పోతుంది. ఇక్కడ ఆవారా గాలి ప్రయోగం గాలి లక్షణాన్ని మాత్రమే తెలియ జేస్తోంది అనుకుంటే పొరపాటే. అది ప్రేమ గాలి అందుకే అది ఆటలాడి వెదురు (ప్రియుని) గుండె చీల్చి పాటగా మారుతోంది అని కవి భావన. గజల్ లో విషయాన్ని పరోక్షంగా ప్రతికల ద్వారా ధ్వనింపచేయడమే గజల్ శైలి.

"రెప్ప వీడని అశ్రు బిందువు కంటె భారము ఉన్నదా
ప్రేమ కోరుట కంటె పెన్నా పెద్ద నేరము ఉన్నదా!"

అభివ్యక్తిలో గాఢత / సాంద్రత చమత్కారానికి మరో సాధన. ఎంత వేదన మరిగితే అది ఒక అశ్రు బిందువుగా మారుతుంది! అది ప్రేమ వలనే అయి ఉంటుంది. అంత కన్న పెద్దనేరం అసలు ఏముంది అని అతిశయోక్తి అలంకారంతో చెప్పటం ఇక్కడ చమత్కారం.

ప్రేయసి నయనాలని వర్ణించిన తీరు ఈ షేర్ లో కడు రమ్యంగా ఉంది.

**సూరారం శంకర్ గారి గజళ్ళ లో చమత్కార సౌరభం**

తెలుగు గజళ్ళలో అందరికీ సుపరిచితమైన మరో పేరు సూరారం శంకర్ గారు. వీరి గజళ్ళు తాత్వికతకి సూఫీ తత్వానికి అద్దంపడుతూ ఉంటాయి. ప్రేమ ఎడబాటుతో బాటు వ్యక్తిత్వ వికాసానికి సామాజిక చైతన్యానికి కూడా ఊతం ఇచ్చేవిగా ఉండటము విశేషము. ప్రతి గజల్ లో అందమైన విసురుతో అధిక్షేపణ అంతర్లీనంగా ఉండటం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. వీరు రాసిన సౌపర్ణిక, నీహారిక గజళ్ళ సంకలనాల నుంచి చమత్కారం పెల్లుబికిన కొన్ని షేర్లు ప్రస్తావించదలిచాను.

"కొన్నే ఉంటాయి పున్నములు పూచే నయనాలు
కన్నె కలువలై జాబిలి మనసును దోచే నయనాలు"

ప్రేయసి నయనాలని వర్ణించిన తీరు ఈ షేర్ లో కడు రమ్యంగా ఉంది. పున్నమి పూచే నయనాలుతో మొదలై మిశ్రసానిలో జాబిలి మనసు దోచే కలువ కన్నెలు అని ముడి విప్పడం చాలా గొప్పగా ఉంది . ఇక్కడ పరోక్షంగా అందరి కళ్ళు ఒకటే కాదు, కేవలం తన ప్రేయసి కనులే పున్నమి పూచే నయనాలు.

"కలలు రాలితే ఎమిలే కన్నీళ్ళు ఉంటాయి
గుండె పగిలితే ఎమిలే నీ గుర్తులు ఉంటాయి.!"

వేదన, వ్యగ్రతలు అభివ్యక్తి గజల్ లో పలికినట్లు ఏ ఇతర ప్రక్రియలోనూ పలకదు అనటంలో అతిశయోక్తి లేదేమో. గాఢతలో మెరుపు తేవడం కష్టతరమే. సూరారం వారికి అది కరతలామలకం అనే చెప్పుకోవాలి. కన్నీళ్ళు కలలకీ ఆనవాలుగా మిగిలే ఉంటాయని చెబుతూ గుండె పగిలినా నీ గుర్తులు ఉంటాయిలే అని ప్రియుడు వాపోవడం గజిలియత్ కి అద్దం పడుతోంది.

"నీ కన్నుల సిరి వెన్నెల చూస్తానో లేదో
మరలా ఒక కొత్త గజల్ రాస్తానో లేదో "

తను రాసే ప్రతీ గజల్ గజల్ ప్రేయసికే సొంతం. ఆమె కన్నులలో వెలుగు చూడక పోతే తన కలం కదలదు అని చెప్పడం ఇక్కడ చమత్కారం. ఆశ, నిరాశలు రెండూ ధ్వనించే రదీఫ్ షేర్ కి బాగా అమరింది.

మసక వెలుగులో కనిపించీ కనిపించని నీడలని ప్రేయసి క్రీడలుగా అభివర్ణించి మిశ్రసానిలో తన జాడ కోసం

"గాయం తెలియని వాడొకడు, గాయం గురించి చెబుతాడు
లోకం తెలియని వాడొకడు అది గంటల తరబడి వింటాడు !"

అనుభవం లేని వాడు చెప్పే హితబోధలు రుచించవు. గాయం అంటే తెలియని వాడు గాయం గురించి చెబితే ఎవరు వింటారు. అది వినేవాళ్ళూ అంతే అమాయకులు అని చెప్పటం ఒక మెత్తని అధిక్షేపణ. గజల్ ఎవరైనా రాయచ్చా అన్న ప్రశ్నకి బహుశా ఇది జవాబు కావచ్చు.

"సంధ్య వెలుగుల నీడలే నీ క్రీడలైతే అవ్వనీ
నీ జాడ కోసం సృష్టినే వడబోసుకుంటాను!"

మసక వెలుగులో కనిపించీ కనిపించని నీడలని ప్రేయసి క్రీడలుగా అభివర్ణించి మిశ్రసానిలో తన జాడ కోసం సృష్టిని వడబోస్తానని చెప్పటం ఎంత లోతైన అభివ్యక్తి. మొదటి చరణంలో పాఠకుడు ఏమాత్రం ఊహించని కొసమెరుపు గజల్ చమత్కారానికి దర్పణం.

**రసరాజు గారి గజళ్ళ లో చమత్కార సౌరభం**

తెలుగులో గజల్ వైభవాన్ని చర్చించుకునేటప్పుడు తప్పనిసరిగా స్మరించుకోవలసిన మరో పేరు ప్రఖ్యాత సినీ గేయ రచయిత శ్రీ రసరాజు గారు. పద్య కవితా ప్రక్రియలో బోయ భీమన్న పురస్కారంతో పాటు అనేక జాతీయ అంతర్జాతీయ వేదికలపై పురస్కారాలు అందుకున్నాయి రస రాజు గారి గజళ్ళు. లలిత మనోహర పద బంధాలతో ప్రేమ విరహం మాత్రమే కాకుండా సామాజిక కుటుంబ అంశాలను కూడా స్పృశించడం ముఖ్య లక్షణం. ఎత్తుగడలోనే చమత్కారం ధ్వనించేటట్లు రాయడం వీరి ప్రత్యేకత. "రసరాజు

గజళ్ళు" పుస్తకంలో చమత్కారానికి అద్దం పట్టే కొన్ని షేర్లు పరిశీలిద్దాము.

"వెన్నెలలో ఎంత వేడి ఊరేగిందో
ఆమె చూపు కనిపించని నిప్పు రవ్వ కాదా!"

వెన్నెలలో వేడి ప్రయోగం చాలదన్నట్టు వేడి ఊరేగింది అని చెప్పడం చమత్కారం. మరి ఆ వేడి పాఠకుల ఊహకి వదిలేయకుండా ఆమె చూపు నిప్పు రవ్వ అనటం అసలైన చమత్కారం!

ఎంత మేధో మథనం జరిగితే గానీ గజల్ రాయలేము. గాయపడ్డ గుండె నుంచే గజల్ పుడుతుంది

"జడలో మల్లెల వాసన పీల్చావే కానీ
మనసులోని పరిమళాన్ని చూసావా ఎపుడైనా!"

భార్య తన మనసుని నిర్లక్ష్యం చేయొద్దని ఎంత చమత్కారయుతంగా చెప్పిందో ఈ షేర్ లో చూడండి. మనసులోని పరిమళం జడలోని మల్లెల పరిమళం కన్న విలువైనది దాన్ని పట్టించుకోకుండా మల్లెల వాసనతో సరిపెడతారు అని చెప్పిన ఈ షేర్ సున్నిత మైన అధిక్షేపణకి ఉదాహరణ.

"కోపంగా చూచినా దీపంలా ఉంటావు
కోనేటికి ఎరుపెక్కిన పద్మంలా ఉంటావు!"

ప్రేయసి కోపాన్ని మనోహరంగా చిత్రించిన ఈ మత్లా అలంకారీకృతకి, చమత్కారానికి చక్కని ఉదాహరణ. కోపంలో దీపంలా ఉండటం ఎంత చక్కని ప్రయోగం. కోనేటికి అందాన్ని ఇచ్చే ఎర్రని పద్మంతో పోల్చడం చాలా గొప్పగా ఉంది.

నిజానికి గజల్ రాయడం మెప్పించడం అంత సులభం కాదు. ఈ విషయాన్ని గజల్ ద్వారా చెప్పిన ఈ మత్లాలో చమత్కారం చూడండి.

"ఒక్క గజల్ రాయాలని ఎంత చచ్చి బతికానో
ఎన్ని ఎన్ని భావాలను ఏరి తెచ్చి ఉతికానో!"

ఎంత మేధో మథనం జరిగితే గానీ గజల్ రాయలేము. గాయపడ్డ గుండె నుంచే గజల్ పుడుతుంది అని ఆర్యోక్తి. కనీసం సహానుభూతి అయినా ఉండాలి అని కొందరి వాదన. భావాలని యథాతథంగా చెబితే అది పాటవుతుంది. చమత్కారంతో అంతర్లీనంగా ధ్వనింప చేస్తేనే గజలౌతుంది. అందుకే రెండో

చరణంలో ఏరి తెచ్చి ఉతకాలి అని చెప్పారనిపిస్తుంది.

"వాలు చూపు విసిరావు గుండె తూలి పడింది
మధువంటే నీవేనని స్పష్టమై పోయింది.!"

చూపుకి గుండె జారి పోయింది అనకుండా వ్యూహాత్మకంగా తూలి పడితే పడింది అని చెప్పి మధువంటే నువ్వే అని చమత్కారాన్ని చూపించడం కొసమెరుపు.

## తటపర్తి రాజగోపాలం గారి గజళ్ళ లో చమత్కార సౌరభం

మొదటి తరం గజల్ కవులలో చక్కని చిక్కని గజళ్ళని అందించిన శ్రీ తటపర్తి రాజగోపాలం గారి "హృదయం చిరునామా" పుస్తకం నుంచి కొన్ని చమత్కార పరిమళాలు ఆస్వాదిద్దాము.

"నీకూ నాకూ కుదరకపోతే నోటి మాటలే తూటాలు

జీవన యాత్రలు గాడి తప్పితే చివరికి కలలే వాటాలు!"

ఈ మత్లాలో తూటాలతో మొదలై వాటాలతో కవి ముగించిన తీరు చక్కని చమత్కారానికి తెర తీసింది. కలలే వాటాలుగా మిగిలి పోవడం భావంలో మెరుపుకి దారి తీసింది.

> బాల కార్మికుల దుస్థితిని ఈ షేర్ లో వర్ణించిన తీరు చాలా గొప్పగా ఉంది.

"కలలో నైనా కనిపిస్తావా కరుణ జూపి
నా కంటికి నిదురపట్టి ఎన్నాళ్ళైయ్యిందో!"

కలలోనైనా కనిపించమని ప్రేయసిని ప్రాధేయ పడటం సాధారణమే. అదే భావాన్ని, నువ్వు లేని నాకు నిదురపట్టి ఎన్నాళ్లయిందో ఇక కలలలెలా వస్తాయని చమత్కారంగా ముగించడం చాల బావుంది.

"పలకా బలపం పట్టే చేతులు ప్లేటూ గ్లాసులు తీశాయి
ఆకలి పరీక్ష రాయాలంటే అవకాశాలే పాఠాలు!"

బాల కార్మికుల దుస్థితిని ఈ షేర్ లో వర్ణించిన తీరు చాలా గొప్పగా ఉంది. ఆకలి పరీక్ష ప్రయోగం సందర్భోచితంగా ఉంది. అవకాశాలు లేకే వాళ్ళు చదువుకి దూరం అవుతున్నారని అంతర్లీనంగా చెప్పడం కొసమెరుపు.

"గుంపు ఒక్కటే అయితే మాత్రం గ్రూపులు వేరే ఉంటాయి

ఎవ్వడికైనా ఆర్తి తీర్చడం ఏరులా పారి తెలుసుకో!"

ఒకే ఊరి వాళ్ళంటే అయితే ఏం మాలో మాకు గ్రూపులు లేవా? అని చక్కని వ్యూహంతో మొదలైన షేర్ బేధ భావం లేని ఏరులా ఉండి అందరి కోరికలు తీర్చాలి అని చెప్పడం ఊహించని ముగింపు.

**కత్తి కన్న మాట పదునైనది అన్న నానుడి కీ షేర్ లో వ్యక్తీకరించిన తీరు చాలా బావుంది.**

"ఉందో లేదో స్వర్గం నా పుణ్యం నాకిచ్చేయ్
సర్వస్వం నీకిస్తా నా బాల్యం నాకిచ్చేయ్"

తట పర్తి వారి గజళ్ళలో బహుళ ప్రాచుర్యం పొందిన బాల్యం గజల్ లో అన్ని షేర్లూ అద్భుతమే. బాల్యం కన్న స్వర్గం లేదు. ఆ బాల్యాన్ని నాది నాకు ఇస్తే చాలు నా దగ్గర ఉన్నవన్నీ నీ కిచ్చేస్తా అని చెప్పడం ఇక్కడ చమత్కారం. మిశ్రాలో కవి బాల్యం అడుగుతున్నాడని పాఠకులు ఊహించ లేకపోవడం పరోక్షంగా చమత్కారానికి దోహద పడింది.

చల్లా రాంబాబు గారి గజళ్ళలో చమత్కార సౌరభం

"ఎక్కడో ఏ మూల నుండో ఆశ రెక్కలు మొలుచుకొచ్చెను
ఎగర లేని రెక్కలెందుకు, వచ్చి కాస్తా విరిచి పోవా!"

ప్రేయసిని నిష్టూరంగా ప్రియుడు ఎగరలేని రెక్కలు నాకెందుకు వచ్చి విరిచేసి పొమ్మనటం గాఢతకి వెటకారంతో కూడిన చమత్కారానికి అద్దం పడుతోంది. ఎక్కడి నుంచో ఆశ రెక్కలు మొలుచు కొచ్చెను అనటంలో కూడా వ్యంగ్యం ధ్వనిస్తోంది.

"కత్తి గాటు ఎప్పుడైనా మాని పోవు చల్లా
మాట గాటు మనసులోన మాసి పోదు చల్లా!"

కత్తి కన్న మాట పదునైనది అన్న నానుడి కీ షేర్ లో వ్యక్తీకరించిన తీరు చాలా బావుంది.

మాట గాటు ప్రయోగం భావ సౌందర్యానికి కలిసొచ్చింది.

"చెలియ వేసిన వాలు చూపులు... నాటే దాకా తెలియదు
మెడకు చుట్టిన ప్రేమ పాశము లాగే దాకా తెలియదు!"

చెలియ వాలు చూపులు సాధారణ ప్రయోగాన్ని ప్రేమ పాశము లాగే దాకా తెలియదు అని చెప్పడం చమత్కారమే కదా.

"మనసు చంచలమైతే మనిషీ కుదురుగా నువు ఉండగలవా
కదులు తున్న సూది లోకి పట్టు దారం పంపగలమా!"

చంచలమైన మనసుని అభివర్ణించడానికి తీసుకున్న ప్రతీక యెంత గొప్పగా ఉందో చూడండి. అలా ఉపమానంతో కూడా చమత్కారం పండించవచ్చు.

"నీవు నేను వేరు వేరని వివాదాలు ఎందుకో
సమానత్వం ఇంటి ముంగిట ముగ్గు లేయని చాటాలి!"

మన ఇద్దరి మధ్య వివాదాలు ఉండకూడదు. సమానత్వం ఉండాలి అని చెప్పి సమానత్వం నినాదాల కోసం కాదు ఇంటితోనే ప్రారంభమవ్వాలి అని చెప్పడం చమత్కారం.

**నీవు నేను వేరు వేరని వివాదాలు ఎందుకో- సమానత్వం ఇంటి ముంగిట ముగ్గు లేయని చాటాలి!**

**చమత్కార సాధనలో మరికొన్ని మెరుపులు విరుపులు...**

చమత్కార సాధనకి కవులు రకరకాల వ్యూహాలను ఎంచుకుంటారు. కొన్ని భాషా పరమైనవి, కొన్ని భావనా పరమైనవి, కొన్ని అభివ్యక్తి పరమైనవి (ప్రతీక సహాయంతో), కొన్ని ధ్వని పరమైనవి. ఏది ఏమైనా పాఠకులని ఒక క్షణం విస్మయానికి గురిచేయడం ప్రధానోద్దేశం. ఇటీవల గజల్ సాహిత్యంలో నేను గమనించిన కొన్ని ధోరణులను మీ ముందు ఉంచుతున్నాను.

a) పరస్పర విరుద్ధమైన పదాలని ప్రయోగించి భావంలో గాఢత ని ప్రతిబింబించడం...

గజల్ శిరోమణి RVS శ్రీనివాస్ గారి శ్రీ రాగ చంద్రిక లో ని ఈ షేర్ అందుకు చక్కని ఉదాహరణ:

"యాతనేదో గుచ్చుతుంటే విషాదానికి పండుగలే
మదిలో రుధిరము వరదలౌతూ వైతరణిగా మారిపోయెను..."

విషాదానికి పండుగ, మదిలో రుధిరము వరదలవటం... చక్కని ప్రయోగాలు. శ్రీనివాస్ గారి మరో షేర్ లో చమత్కారం ఎలా తొణికిసలాడిందో చూడండి.

స్త్రీ కీ స్త్రీ యే పోటీ స్త్రీ కి స్త్రీ యే శత్రువు అన్నది ఇక్కడ చమత్కారం.

"వాసంతిక వచ్చినదని ఎలా తెలిసిపోయినదో
చివరి ఋతువులో కోకిల పాడుతోంది నీవలనే"

కోకిల కూడా ప్రేయసి రాకకి పొరబడటం ఇక్కడ చమత్కారం. నియమానుసారం అద్భుతమైన గజళ్ళు రాస్తూ ఎంతో మందికి శిక్షణ ఇస్తున్న కవి పుంగవుడు శ్రీ శ్రీనివాస్ గారు.

b) స్వాభావిక చమత్కారం...

లోకిక వస్తు స్వభావం చెబుతూ ఆ ప్రవృత్తిని తన గజల్ లో ఇమిడేటట్లు భావాన్ని మెలిక తిప్పటం. ఇది ఒకరకంగా కష్టమే. కానీ ప్రముఖ గజల్ కవి ఇరువెంటి వెంకటేశ్వర శర్మ గారు దాన్ని అలవోకగా సాధించిన ఈ షేర్ "మధురోహలు" గజల్ సంకలనము నుంచి తీసుకున్నది. గజల్ సాహిత్య వేదికని స్థాపించి గజల్ సాహిత్యంలో ఉన్నత ప్రమాణాల కోసం కృషి చేస్తూ ఈ తరం కవులని ప్రోత్సహిస్తున్న శ్రీ ఇరువెంటి వెంకటేశ్వర శర్మ గారి కృషి ఎంతైనా కొనియాడతగినది.

"మగువ మెచ్చు మొగలి పొదకు ముళ్ళ కంచె వేసీ
పోటీగా నాగ కన్య నుంచావా సామీ.."

స్త్రీ కీ స్త్రీ యే పోటీ స్త్రీ కి స్త్రీ యే శత్రువు అన్నది ఇక్కడ చమత్కారం. ఇరువెంటి వారి మధురోహలు లలిత పద బంధుర రస గీతికలు. మరో అద్భుతమైన షేర్ శర్మ గారి కలం నుంచి చమత్కారానికి నిలువుటద్దం...

"తడిసి పోయె గుణమున్నది తడిమి చూడు కాగితాన్ని
తడి తగిలే గజలు నొకటి వ్రాశారా ఎపుడైనా"

వేదన రుచి తెలియాలంటే ప్రేమించే తీరాలి అని అందుకు చూపించిన ఉపమానము చాలా బావుంది.

హృదయానికి తాకని గజల్ అనవసరం అని ఎంత అందంగా చెప్పారో మీరే చూడండి. అంటే మంచి గజల్ రాస్తే దాని లోని భావ సాంద్రత వేదనకి రాసిన కాయితమే తడవాలి అని కవి చమత్కారం.

c) శబ్ద సౌందర్యంతో చమత్కారాన్ని పండించడం..

గజల్ కి యతి ప్రాసలు తప్పని సరికాదు. కానీ అవి గజల్ సౌందర్యాన్ని ఇనుమడింప చేస్తాయి అని చెప్పడంలో అతి శయోక్తి లేదు. దాదాపు ఒక దశాబ్దంగా గజల్ రచనలో ఎంతో మందికి శిక్షణ ఇచ్చి తమదైన శైలిలో వందల కొద్దీ గజళ్ళు వ్రాసిన ఉమాదేవి జంధ్యాల గారి ఈ షేర్ ఇందుకు చక్కని ఉదాహరణ. ఎంతో లయ బద్ధంగా సాగిన ఈ షేర్ "పున్నాగ పూలు" తెలుగు గజల్ సంకలనం నుంచి తీసుకోవడమైనది.

"హృదయమా! ప్రేమింపక వేదన రుచినెరుగలేవు
మధుపమా! శోధింపక మధువు నెలవు తెలియలేవు!"

వేదన రుచి తెలియాలంటే ప్రేమించే తీరాలి అని అందుకు చూపించిన ఉపమానము చాలా బావుంది. ఉమా దేవి గారు అతి చిన్న విషయంలో సైతం అద్భుతమైన చమత్కారం చూపించగల నేర్పరి. ఇదిగో ఈ షేర్ చూడండి...

"కొండలోయల్లోన వెలకట్టలేనట్టి వజ్రాలు ఉండొచ్చు!
పూరిగుడిసెల్లోన తెలివిగల అరుదైన రత్నాలు ఉండొచ్చు!"

ఎంత చక్కని ఉపమానము. భావ సమన్వయం పండిన చమత్కారం.

d) ప్రకృతి విరుద్ధ మైన ప్రమేయాన్ని ప్రతిపాదించి సమర్థించడం లేదా వ్యతిరేకించడం

ప్రముఖ గజల్ కవియత్రి Dr గడ్డం శ్యామల గారి ఈ షేర్ ఆ తరహా ప్రయోగమే.

"వలపు పూల దారిలోన యెడబాటొక మధుకలశం
చెలిమి చేయు నేరమేమొ , అనిపించెను నా మనసే..!"

సీనియర్ గజల్ కవయిత్రులలో ఒకరైన Dr గడ్డం శ్యామల గారు గజల్ సాహిత్యానికి చేస్తున్న సేవ కొనియాడతగినది. తెలుగు నుడికారాలకి సరళ సుందర పద బంధాలకి మేడం గజళ్ళు పేరెన్నిక కన్నవి. Dr. గడ్డం శ్యామల గారు రాసిన "శరద్వల్లరి" గజల్ సంకలనంలోని ఈ షేర్ లో శబ్ద సౌందర్యం పాఠకులని ఎంతగానో హత్తుకుంటుంది.

**ప్రియురాలిని వదులు కోవటం ఎంత కష్టమో ఈ షేర్ లో చూడండి.**

"మాయమై ఎద లోన గాయమై పోయావు
దూరమై మది లోన భారమై పోయావు "

మాయమై గాయమవడం. . దూరమై భారమవడం రెండూ అసాధారణమైనా చమత్కారం కోసం వాడిన ప్రయోగాలు. శరద్వల్లరిలో ఇలా చమత్కారాన్ని వెదజల్లిన గజళ్ళు అనేకం. మెత్తని ఆక్షేపణ నిక్షిప్తమైన ఈ షేర్ చమత్కారానికి మరో చక్కని ఉదాహరణ.

"కనులలోన చూపించే ప్రేమలన్ని ఏమాయెనొ...
పెదవులపై నడయాడె గంధ మెరుగని సుమమెందుకు.."

చిరునవ్వుని పెదవులపై నడయాడే గంధంగా అభివర్ణించి అదే లేనప్పుడు కళ్ళతో నటనలెందుకు అని చెప్పటమే ఇక్కడ చమత్కారం.

e) భావం లో సున్నిత మైన వ్యంగ్యం శ్లేష ధ్వనింప చేయడం చమత్కారానికి అన్నిటి కన్న మేలైన వ్యూహం గా చెప్పుకోవచ్చు.

ఆరు వేలకి పైగా గజళ్ళు రాసి అనేక పురస్కారాలు పొందిన ప్రముఖ గజల్ కవి శ్రీ కోరుప్రోలు మాధవరావు గారి మాధవ రంజనిలో ఈ షేర్ లో తిరకాసు చూడండి.

"ఇష్టాలను చంపుకునే విద్య నేర్చుకొందు
ప్రేమలో పడుట వలన సుఖము లేదు అసలు!"

ప్రియురాలిని వదులు కోవటం ఎంత కష్టమో ఈ షేర్ లో చూడండి. తాత్వికతకీ, లోతైన అర్థానికి కోరుప్రోలు మాధవరావు గారి గజళ్ళు పెట్టింది పేరు. అర్థవంతమైన చురకలు మెరుపులకి కూడా మాధవ రావు గారి గజళ్ళలో కొదువలేదు. అట్లాంటి మరో అద్భుతమైన షేర్ మీరే గమనించండి.

"దెబ్బమీద దెబ్బతీయు.. వారెవరో ఉండరులే...

గుణపాఠం నేర్పు మహా... గురువంటే యౌవనమే..! "

దెబ్బ తీసేది గుణపాఠం చెప్పేది యవ్వనమే అని చమత్కరించిన తీరు చాలా బావుంది.

అమ్మ మనసు తన చూపును గొడుగు చేసి ఇచ్చింది - అనుభవాన్ని వెన్నెలింటి వెలుగు చేసి ఇచ్చింది.

f)అభివ్యక్తిలో ఊహించని ప్రతీకని జోడించి భావంలో మెరుపు తేవడం...

ఇది గజిలీయత్ కి మరింత తోడ్పడుతుంది. ప్రతీకకి ఉన్న ఒక లక్షణాన్నో, ప్రత్యేకమైన సందర్భాన్నో ఆసరాగా తీసుకుని అలంకారాలను వాడి ఈ రకమైన చమత్కారాన్ని సాధిస్తారు కవులు. ఇక్కడ ఉపమాలంకారం, రూపకాలంకారం తరచుగా వాడతారు. గజల్ పై విస్తృతమైన పరిశోధన చేసి గజల్ కవులకి మార్గ దర్శకం లాంటి గ్రంథం "తెలుగు గజళ్ళు ఒక అధ్యయనం" వంటి ఉత్తమ సిద్ధాంత గ్రంథాన్ని అందించిన, Dr పోతగాని గారి "స్వప్న శిల్పాలు" లోని ఈ షేర్ ఆ కోవకి చెందినదే..

"అమ్మ మనసు తన చూపును గొడుగు చేసి ఇచ్చింది
అనుభవాన్ని వెన్నెలింటి వెలుగు చేసి ఇచ్చింది."

అద్భుతమైన ఈ షేర్ లో చూపుని గొడుగు చేయటం, అనుభవాన్ని వెన్నెలింటి గొడుగు చేయటం చమత్కారం అమ్మ తనానికి తార్కాణం.

g) అతిశయోక్తికి అధిక్షేపణ జోడించి చమత్కారం సాధించడం...

ఈ తరహా విసుర్లు అధిక్షేపణలు కన్నెగంటి వెంకటయ్య గారి "మమతలు హృదయాలలో" చాల దర్శనమిస్తాయి. మమతల హృదయాలు గజల్ సంకలనంలో నుంచి ఈ షేర్ చూడండి ఎంత అందంగా ముస్తాబైయ్యిందో.

"లోకం చేసే గాయపు గురుతులు చిరు గోరంతేలే
నీకై తపించే తపించి మనస్సు బోలుగా ఉన్నది!"

చిరు గోరంత, మనస్సు బోలుగా ఉండటం చమత్కారానికి వన్నెలద్దిన అతిశయోక్తులే!

h) కాఫీయాల మెరుపులతో చమత్కారం

గజల్ కి ఆయువు పట్టు ఊహించని కాఫియాతో భావంలో వచ్చే మెరుపే. అది కేవలం శబ్ద సౌందర్యానికి పరిమితం కాకూడదు. అది రదీఫ్ లో దాగి ఉన్న మరో కోణాన్ని ఆవిష్కరించాలి. అప్పుడే చమత్కారానికి అర్థం ఉంటుంది. గజల్ సాహిత్యంలో తన దైన ముద్రతో అనేక సదస్సులు నిర్వహిస్తూ, వల్లరి, స్వాంతన అనే రెండు గజల్ సంకలనాలని, "గజల్ సౌందర్య సమీక్షణం" విశ్లేషణ గ్రంథాన్ని రాసిన కళా రత్న బిక్కి కృష్ణ గారి ఈ షేర్ కాఫీయాల మెరుపుల కి చక్కని ఉదాహరణ.

"కాలం నది ఒడ్డున నీవో కావ్యమై పోయావే
కీర్తి శిఖరంపై కూర్చో మన్నారా ఎవరైనా "

"కవితల పూదోట పంచి ముళ్ళ కంచె నీవైతివే
పరిమళాలు పంచావని అన్నారా ఎవరైనా!"

గజల్ అంటే నీ మనసుతో నువు మాట్లాడుకోవటమే. నీ అనుభవాలు, అనుభూతులు ఎంత అందంగా ఆవిష్కరించుకుంటే గజల్ అంత గొప్పగా ఉంటుంది. ఇక్కడ అదే జరిగింది. గాఢత, చమత్కారం ఆత్మావలోకనం కలిస్తే ఇట్లాంటి షేర్లు వస్తాయి.

I) ప్రేమని ఆరాధనగా ప్రకృతికి ఆపాదించి చమత్కారం సాధించడం

విశ్వ పుత్రిక గజల్ ఫౌండేషన్ ని స్థాపించి గజల్ సాహిత్యానికి ఇతోధికంగా తోడ్పాటు అందిస్తున్నారు ప్రముఖ గజల్ కవియత్రి Dr విజయ లక్ష్మీ పండిట్ గారు. ఆరాధన తాత్వికత నిండిన విజయ లక్ష్మీ గారి గజళ్ళలో చమత్కారికతకి కూడా పెద్ద పీట వేశారు అనటంలో సందేహం లేదు. ఇదుగో మచ్చు కి ఈ షేర్లు మీరూ పరిశీలించండి.

"తీరాలను ముద్దాడాలని ఆ అలల కెంత ఆరాటమో
తిరిగి రాని అలనై నీ ఒడిలో ఉండి పోవాలని ఉంది!"

విశ్వ రాగం గజల్ సంకలనం నుంచి తీసుకున్న ఈ షేర్ లో ముగింపులో గాఢత, చమత్కారానికి చక్కని దృష్టాంతం. అందులోనిదే మరో షేర్ (మత్లా)

"ఆకాశమే దిగి వచ్చి నన్ను హత్తుకుంది ప్రేమతో
నక్షత్రమే రాలిపడి నన్ను ముద్దాడింది ప్రేమతో!"

వర్షపు చినుకులని తనని ముద్దాడిన నక్షత్రాలు అని చెప్పడం ఇక్కడ కవి చమత్కారం.

J) మిస్రా లో చెప్పిన విషయాన్ని ఊహించని విధంగా కొసమెరుపుతో ముగించడం.

ముకుంద శర్మ గారు మాత్రా ఛందస్సులో అనేక గజళ్ళు రాయటమే కాకుండా ఉర్దూ బహర్ల లో తెలుగు గజళ్ళని శ్రీ కేశిరాజు కృష్ణ గారి స్వర కల్పన గళంలో "ముకుంద కుసుమాలు" అనే ఆడియో ఆల్బమ్ తొలిసారి రికార్డు చేసి అందరి మన్ననలు పొందారు. శర్మ గారు రాసిన గజళ్ళ నుంచి చమత్కారం ఇనుమడించిన రెండు షేర్లు మచ్చుకి ఇక్కడ ప్రస్తావిస్తున్నాను

"తెల్లవారి కనిపించని చందమామ నాకెందుకు..
నీ నవ్వే సిరివెన్నెల దీపంలా ఉందిప్పుడు!"

చందమామ కన్నా నీ నవ్వుల వెలుగే ఎక్కువ సిరి వెన్నెలని రాత్రి పగలు బేధం లేకుండా నన్ను మురిపిస్తోంది అని చెప్పడం కవి చమత్కారం. ఊహించని మెరుపుకి మరో చక్కని ఉదాహరణ నేను రాసిన ఈ మత్లా మీరే గమనించండి.

"ఏదో ఈ గాలి బొమ్మ ఇలా నవ్వి పోతె చాలు!
కరిగి పోక ఉంటాయా నీళ్ళ పైన సంతకాలు!"

ఇక్కడ మనం చేసే పనులు చెప్పుకునే గొప్పలు, నీటిపై సంతకాలు లాంటివి. అవి కరిగిపోక ఉండవు అని చెప్పడం చమత్కారం. మిస్రసానిలో చెప్పబోయేది పాఠకుల ఊహకి అందని ప్రతీక.

గజల్ సుకుమార ప్రాణి లలిత మైన పదాలతో ఇంపు, కుదింపు అనుసరిస్తూనే లోతైన అర్థాన్ని చమత్కారంతో ధ్వనింప చేయడం అన్ని సందర్భాలలో సాధ్యంకాక పోవచ్చు. అందుకే అన్ని వస్తువులను గజల్లో యిమడ్చలేము. రాసినవన్నీ గజళ్ళు కావు అనే అపవాదు కొందరు కవులు మూట కట్టుకుంటున్నారని అప్పుడప్పుడు అనిపిస్తుంది.

# సి.నా.రె. గజళ్ళ లో సామాజిక అంశం

డా.పి. విజయలక్ష్మి పండిట్
86390 61472



"ఉర్దూభాషలో గజల్ ఒక కమనీయ కవితాలహరి. ఒక గులాబీల గుళుచ్ఛం. ఒక మత్తకోకిల రసాత్తకూజితం. సరసభావన, చమత్కార ఖేలన, ఇంపూ, కుదింపూ గజల్ జీవ గుణాలు" అన్నారు సి.నా.రె. వారి "తెలుగు గజళ్లు" సంపుటి గురించిన తన ముందు మాటలో. గజల్ పై వారి నిర్వచనం గజల్ తత్వాన్ని తెలుపుతుంది.

గజల్ అనేది ఉర్దూ భాషలో శతాబ్దాలుగా ఉనికిలో ఉన్న ఒక కవితా కళా రూపం. ఇది కవి భావోద్వేగాలు మరియు మనో భావాలను వ్యక్తీకరించడానికి ఉపయోగించే కవితా రూపం. గజల్ ప్రత్యేకమైన కవితా ప్రక్రియ ఎందుకంటే కవులు తమ తీవ్రమైన వ్యక్తిగతమైన సులభంగా వ్యక్తీకరించలేని భావోద్వేగాలను గజల్ ప్రక్రియ ద్వారా వ్యక్తపరచగలరు. గజల్ లోని ఆ శక్తివంతమైన మరియు ఉత్తేజకరమైన గజలియత్ నిర్మాణ శైలి వల్ల గజల్ ప్రత్యేకతను సంతరించుకుంది. ఆనందం, దుఃఖం, ప్రేమ, ప్రణయం, విరహం, నిరీక్షణ మరియు అనేక ఇతర మానవ భావోద్వేగాలను వ్యక్తీకరించడానికి గజల్ ఒక వేదిక అయింది.

గజల్ అన్నది భౌతిక, ఆధ్యాత్మిక, ప్రణయ లోకంలో తదాత్మ్యం చెందిన స్త్రీ పురుషుల హృదయాలలో ఉదయించే ప్రేమ, ఆనందం, ఆరాధన, విరహం, నిరీక్షణ, బాధ, మధురభక్తి భావనల సుందర సంభాషనాత్మక కవితా ప్రక్రియ.

అందుకే గజల్ "హృదయ భాష" అంటాను నేను.

గజల్ శ్రోతలను భావోద్వేగ ప్రయాణానికి తీసుకెళ్లడానికి రూపొందించ బడింది.

### గజల్ అనగా :

గజల్ అనగా "స్త్రీల తో సంభాషణ'. 'స్త్రీ సౌందర్యాన్ని వర్ణించడానికి గజల్ వాడే వారు. గజల్ అనే పదం టర్కీ భాష 'గజాల్' 'గజాల' నుండి ఆవిర్భవించింది. అర్థం 'జింక కనులు గల', 'మృగనయని' అని అర్థం.

పర్షియన్లు 'ఖసీదా' ద్వారా గజల్ ను వాడుకలోకి తెచ్చారు.12 వ శతాబ్దంలోముస్లిం రాజుల ప్రాబల్యంలో, మొగలుల ఆచారవ్యవహారాలతో పాటు గజల్ ను భారతదేశానికి దిగుమతి చేశారు. అమిర్ ఖుస్రో ఉత్తరభారతంలో గజల్ ను ప్రారంభించాడని చెబుతారు. అమీర్ ఖుస్రూ (1253–1325) ఢిల్లీ సుల్తానేట్ కాలంలో నివసించిన ప్రముఖ భారతీయ సూఫీ గాయకుడు, కవి, సంగీతకారుడు మరియు పండితుడు.

### గజల్ నిర్మాణ లక్షణాలు :

గజల్ శ్రోతలను భావోద్వేగ ప్రయాణానికి తీసుకెళ్లడానికి రూపొందించబడింది. గజల్ వస్తు నిర్మాణం, సంగీతం ఒక మార్మిక రహస్య శైలి. స్త్రీ పురుషుల హృదయంలో ప్రేమ, విరహం, నిరీక్షణలలో జాలువారిన భావావేశాలను సరళపదాలు ఉపయోగించి నిర్మించిన నిర్దిష్ట గజళ్ళ గానం శ్రోతలలో పాఠకులలో లోతైన భావోద్వేగాన్ని పునరుజ్జీవింపజేస్తాయి.

గజల్ మాత్రా గణబద్ధమైన గేయకవితా ప్రక్రియకు సంబంధించింది. గజల్ లో కనీసం 5 షేర్ లు లేదా ద్విపదలు వుంటాయి. 5,7, 9, 11... షేర్లు వుండవచ్చు. ప్రతి 'షేర్'లో రెండు 'మిస్రా'లు వుంటాయి. ప్రతి మిస్రా ఛందస్సు గల్గి వుంటుంది. గజల్ ఛందస్సు లో కొన్ని మాత్రలున్న పంక్తిని బహర్ అంటారు. ఏ బహర్ లో నైనా గజల్ చెప్పవచ్చు. ఏదేని ప్రత్యేకమైన బహర్లోనే చెప్పవలెనన్న నియమం లేదు. త్రిశ్ర, చతురశ్ర, ఖండ, మిశ్రగతుల్లో ఏ గతిలోనైనా గజల్ను రచించవచ్చు. గజల్లోని పాదాలన్నింటిలోనూ మాత్రా సంఖ్యా సమత్వం ఉండాలి.

గజల్ మొదటి షేర్ అయిన మత్లా లోని రెండుపాదాలకూ చివర ఖాఫియా, రదీఫ్ అనే అంత్య ప్రాసలుంటాయి.

గజల్ పాట కాబట్టి, గజల్ లోని మొదటి రెండు పాదాలను పల్లవిగా భావించవచ్చు. చెప్పదలచు కున్న భావం ఈ రెండు పాదాలలో ముగిసి తీరాలి. షేర్ లోని ప్రతి పాదాన్ని 'మిస్రా' అంటారు.

షేర్ లో మొదటి మిశ్రాను ' మిశ్రా –ఎ–ఊల, రెండవ మిశ్రాను ' మిశ్రా–ఎ–సాని'అంటారు. గజల్లోని మొదటి షేర్ను 'మత్లా.'అంటారు. చివరి షేర్లను "మక్తా "అంటారు. గజల్ మొదటి షేర్ అయిన 'మత్లా"లోని రెండుపాదాలకూ చివర ఖాఫియా, రదీఫ్ అనే అంత్య ప్రాసలుంటాయి. మిగతా షేర్లలో రెండవ మిస్రాకు (పాదానికి ) మాత్రమే ఈ అంత్య ప్రాసల నియమం ఉంటుంది. గజల్లోని చిట్ట చివరి షేర్ "మక్తా" లో కవి తన 'తఖల్లుస్' ను తెలుపుకుంటాడు. 'తఖల్లుస్' అంటే కవి కలంపేరు లేదా కవి నామముద్ర. ప్రతిషేర్లోని చివరి పదంకంటే ముందున్న పదం 'ఖాఫియా' అంటారు. అంటే అంత్య ప్రాసకు ముందుండే మరొక ప్రాసపదం అన్న మాట. ఈ ఖాఫియా పదాలు సమానమైన ఉచ్చారణ కలిగి ఉండాలి. షేర్ ని చిట్టచివరి పదాన్ని 'రదీఫ్' అంటారు. రదీఫ్ మాత్రం అదే పదమై ఉండాలి. అందుకే గజల్ కవికి ఖాఫియాలు దొరకడం కష్టం. వాటికి సముచితమైన రదీఫ్ను జోడించడం మరీ కష్టం. అందువల్ల కవి గాలిబ్, కొందరు ఉర్దూ గజల్ కవులు రదీఫ్ లేకుండా ఖాఫియా నియమంతోనే షేర్లను పూర్తి చేశారు.

గజల్ తనాన్ని 'గజలియత్' అంటారు. ఈ గజలియత్ ఇతర రచనా విధానాల నుంచి శైలి పరంగా గజల్ను ప్రత్యేకంగా చూపిస్తుంది. సరస చమత్కార భావనలతో అల్లిన గజల్ సౌందర్యాన్ని ఇనుమడింప చేస్తుంది. భావకవిత్వానికి భావుకత ఎంత అవసరమో

గజల్కి గజలియత్ కూడా అంతే అవసరం.

ఈ కళా ప్రక్రియ యొక్క సొగసు మానసికంగా ప్రతిధ్వనించే భావాలను లోతైన శైలితో,

గజలియత్ తో తెలియజేయడం అన్నది గజల్ అల్లే కవి సామర్థ్యంపై ఆధారపడి ఉంది.

గజల్ దాని దక్కనీ పర్షియన్ ఉర్దూ మూలాలని వదిలి తెలుగు గజల్ గా మారటానికి ఎక్కువ సమయమే పట్టిందని అంటారు. ఈ క్రమం లో ఎందరో తెలుగు గజల్ ని తెలుగు అలంకరణలతో మళ్ళీ మళ్ళీ ముస్తాబు చేసి మరింత దగ్గరగా తెచ్చే ప్రయత్నమూ చేసారు.

**గజల్ అంటే ప్రియురాలితో ఏకాంతమున జరిపే ప్రణయ సల్లాపమని వివరించారు**

**తెలుగు గజల్ :**

గజల్ తెలుగు సాహిత్యంలోకి 1963లో అడుగుపెట్టింది. దాశరథి కృష్ణమాచార్యులు తొలి తెలుగు గజల్ కవి.

"వలపునై నీ హృదయసీమల నిలువవలెనని ఉన్నది
పిలుపునై నీ అధర వీధుల పలుకవలెనని ఉన్నది"..

(1965లో " ఉగాది గజల్" శీర్షిక తో వచ్చిన తొలి తెలుగు గజల్‌లోని మత్లా ఇది.)

అయిదున్నర దశాబ్దాల కిందట తెలుగులోకి వచ్చిన ఈ కవితా ప్రక్రియకు దాశరథి కృష్ణమాచార్యులు, డా. సి. నారాయణరెడ్డి తొలి తెలుగు గజల్ కవులు. తెలుగు గజల్ కు మార్గదర్శకులు. ప్రస్తుతం వందలాది కవులు గజళ్ళను రాసి ప్రచురించురించుకుంటున్నారు.

**తెలుగు గజల్ లో వస్తువు ( అంశం) :**

'గజల్' అనే శబ్దానికి అర్థం ..,"ఇంతులతో మంత నాలు" అన్నారు దాశరథి. "ప్రియురాలితో సల్లాపం" అన్నారు డా. సి. నారాయణ రెడ్డి. (సి.నా.రె.). గజల్ అంటే "ప్రియురాలితో ఏకాంతమున జరిపే ప్రణయ సల్లాపమని" అని వివరించారు ఉర్దూ భాషా సాహిత్యవేత్త సామల సదాశివ.

ఈ నిర్వచనాల ఆధారంగా గజల్ ప్రాథమిక వస్తువు లేదా అంశం ప్రేమ, ప్రణయం, ప్రణయ సంభాషణ అని తెలుస్తోంది. సూఫీ తత్వంలో కవుల గజళ్ళలో

పరమాత్మను చేరాలనే ప్రగాఢ ప్రేమ, భక్తి, తాత్విక భావన ప్రస్ఫుటమౌతుంది. జీవాత్మ పరమాత్మల సంగమం కోసం తపించే "మధురభక్తి" భావనతో రాసుకున్న గజళ్ళు ఒక్కటే. కాలగమనంలో ఉర్దూ కవుల గజళ్ళలో సామాజిక అంశాలు కూడా క్రమంగా చోటు చేసుకున్నాయి .

## సి. నా. రె. గజళ్ళ లో అంశం :

సి.నా. రే. తన గజళ్ళ లోని అంశాలేవో తన ''తెలుగు గజళ్ళు'' సంపుటిలో వారు రాసుకున్న గజళ్ళ గురించి ఇలా అన్నారు;

"గజల్ అంటే అనేక అర్థాలున్నా స్థూలంగా 'ప్రియురాలితో సల్లాపం' ప్రాయంగా ఇది శృంగారపరం. కొన్నింటిలో తాత్విక స్పర్శలూ ఉంటాయి. కానీ నా గజళ్ళలో ప్రణయానికి బదులుగా మానవీయ దృక్పథాన్ని, ప్రగతి శీలాన్ని, మెత్తని అధిక్షేపాన్ని ప్రవేశ పెట్టానని'' సి. నా. రె. వారి గజళ్ళ లోని అంశాలేవో వారే వివరించారు.

> పరులకోసం పాటుపడని నరుని బ్రతుకు దేనికని? మూగనేలకు నీరందివ్వని వాగుపరుగు దేనికని?

సి నా రే తెలుగు గజళ్ళ లోని షేర్ల ( ద్విపదల) లో వారు ఎన్నుకున్న అంశాలను పరిశీలిద్దాము.

సి నా రె గజల్ ''పరులకోసం పాటుపడని నరుని బ్రతుకు దేనికని?'' ఈ గజల్ లో... మానవత్వం, మంచితనం విశాలహృదయం లేని, అవసరానికి ఆపన్నహస్తం అందివ్వని కుహనా ఆదర్శాల మాటలు దేనికని?, వాగు పరుగు, చిల్లుల గొడుగు, కదలని అడుగు, అందని వెలుగు, పైపైతొడుగు అనే 'ఖాఫియాల' తో, "దేనికని" అనే 'రదీఫ్' తో ప్రభోదించే ఈ గజల్ చూడండి.

పరులకోసం పాటుపడని నరుని బ్రతుకు దేనికని?
మూగనేలకు నీరందివ్వని వాగుపరుగు దేనికని?

తాతలు తాగిన నేతులు సంగతి నీతులు పలికే మన సంస్కృతి
జల్లులు నిలవని ఎండకు ఆరని చిల్లుల గొడుగు దేనికని?
ఆదర్శాలకు నోళ్ళు చాలవు ఆశయాలకు పైళ్ళు చాలవు
పదపదమంటూ పరుగులు కానీ కదలని అడుగు

దేనికనీ?
జలవిద్యుత్తుకు కరువే లేదు జనసంత్తికి కొరవే లేదు
అవసరానికి మీట నొక్కితే అందని వెలుగు దేనికని?
శిశుహృదయానికి కల్లలు లేవు రసరాజ్యానికి ఎల్లలు లేవు
లోపలి నలుపు 'సి నా రే' కు తెలుసు పై పై తొడుగు దేనికని?

సి. నా. రె.గారి "ఏవో ఏవో బాధలు" అన్న గజల్ లోని మొదటి మూడు 'షేర్ల' లో ప్రతిబింబించే జీవన తాత్విక సామాజిక అంశాలను విశదీకరించిన గజల్ సౌందర్యాన్ని చూద్దాము.

"ఏవో ఏవో బాధలు భరించె మూగజీవితం
ఎన్నో ఎన్నో గీతలు ధరించె తెల్ల కాగితం."
"సుతకోటి హితకోటి వున్నా గతవైభవం చాటుతున్నా
ఎంతో ఎంతో వేదన సహించె మాతృభారతం."
"చిరునవ్వు జలతారులున్నా సరదాల రహదారులలన్నా
ఔనా ఔనా ! లోకమే అనంత శోకపూరితం."

* మొదటి 'షేర్' జీవితం బాధలమయం అన్న తాత్వికతను తెలుపుతుంది.

* రెండవ 'షేర్' లో... కోట్ల ప్రజలు (బిడ్డలు) ఉన్నా వేదనలను సహిస్తున్న భరతమాత వేదనభరిత భావన.

* మూడవ 'షేర్' – సంతోషాలకు, సరదాలకు ఎన్ని రహదారులలన్నా ఈ లౌకిక లోకం దుఃఖపూరితం అన్న జీవన సత్యాన్ని పలికించిన భావన.

సి.నా రె మరో సందేశాత్మక గజల్ "ఆత్మలను పలికించేదే అసలయిన భాష" లో కొన్ని షేర్ల లోని భావ సౌందర్యాన్ని పరిశీలించండి.

" ఆత్మలను పలికించేదే అసలయిన భాష
ఆ విలువ కరువై పోతే అది కంఠ శోష
వేదం ఖురాన్ బైబిల్ వీధిలోన పడతాయా
మత మేదైనా ఒకటేలే ప్రతిమనిషి శ్వాస
అవినీతికి పట్టం కట్టి అభ్యుదయం పూడ్చిన జాతీ
ఇకనైన కళ్ళు నులుముకో ఇది రక్త ఘోష"

పై గజల్ లోని మొదటి మూడు షేర్లు... పతనమవుతున్న మానవ విలువలను, చెలరేగిన మత మౌఢ్యాలను, సంఘంలోని అవినీతిని సరళ పదాలతో అందమైన

భావుకతతో పలికించారు సి నా రే।

"అమ్మ ఒక వైపు దేవత లంతా ఒక వైపు" అన్న గజల్లో అందరు దేవతలతో సమానంగా 'అమ్మ'ను కూర్చోపెట్టి తూచమంటే "నేను ఒరిగేది అమ్మ వైపు" అని అసమాన ప్రేమ రాసి అమ్మ ప్రేమను పలికించిన ఈ సి నా రే గజల్ లో గజలియత్

( భావుకత )చూడండి..!

"అమ్మ ఒక వైపు దేవతలంతా ఒక వైపు
సరితూచమంటే నేను ఒరిగేను అమ్మ వైపు.

ఈబండి చూడర నాన్నా ఈ గుర్రమింక నీదన్నా
తెగమంకుతో చిన్ననాడు దిగలేదు అమ్మ మూపు.
రొదలలో మౌనపాఠంలా వ్యథలలో జ్ఞానపీఠంలా
నా బాల్యమంతా తానే నడిపింది అమ్మ చూపు.
చీకటికి చంద్రబింబంలా ఆకలికి పూర్ణకుంభంలా
నిలువెల్ల మమతల వెలుగై నిలిచింది అమ్మరూపు.
మెరిసే ప్రభాతకిరణంలా విరిసే వసంతకుసుమంలా
పెరిగే 'సినారె' బ్రతుకులో దొరికింది అమ్మ ప్రాపు."

మనిషి జీవితంలో నీతి నిజాయితీని కోల్పోయి, ఈర్ష్యా ద్వేషాల ముసుగులో పైకి నటిస్తూ జీవించే కుహనా మనుషుల తత్వాలను అందమైన ప్రతీకల ఖాఫియాలతో ఎండగడుతూ సి.నా. రె. అల్లిన ఈ గజల్ లో కొన్ని షేర్లను గమనించండి.

ఇప్పుడిప్పుడే తెలిసిందీ కాటేసే పొదరిళ్ళున్నాయనీ
ఇప్పుడిప్పుడే తెలిసిందీ కాల్చేసే కళ్ళున్నాయనీ
పలకరించిన ప్రతిచూపు వెన్నల చినుకనుకున్నాను
ఇప్పుడిప్పుడే తెలిసిందీ విషమెగజిమ్మ
కన్నీళ్ళన్నాయననీ।

ఎదురుపడగనే చేతులుకలిపే ఎన్నిసందడులు చూశానో
ఇప్పుడిపుడే తెలిసిందీ వంచించే కౌగిళ్ళున్నాయని.

(కాటేసే పొదరిళ్ళు, కాల్చేసే కళ్ళు, విషమెగజిమ్మే
కన్నీళ్ళు, వంచించే కౌగిళ్ళు –ఖాఫియాలు)

"ఓ మనసా ! మరిచిపోబోకు." అన్న రదీఫ్ తో సి నా రె గజల్ లో ఈ షేర్ల్ లో జీవిత సత్యాలను పొదిగిన వైనం చూడండి.

" గులాబీ పువ్వు చూడగనే బలేగా మురిసిపోబోకు
కనపడని ముళ్ళు ఎన్నెన్నో ఓ మనసా మరిచిపోబోకు.
మహలులో కాపురాలున్నా మజాకా తిండి తింటున్నా
కునుకుకరువైన బ్రతుకులు ఓ మనసా మరిచిపోబోకు
చెట్టు పూసిందా ఉల్లాసం చేను పండిందా సంతోషం
మట్టిలోఎంత విలువుందో ఓమనసా మరిచిపోబోకు.
పగటి కలలుండి ఏంలాభం ప్రగతికే ఎంత అవరోధం
క్షణం చేజారితే అంతే ఓ మనసా మరచిపోబోకు.

సి నా రె " నన్ను నేనే పాటగా పలికించు కుంటాను" అన్న ఈ గజల్ లో ....తన జీవితాశయాలను, విలువలను, వ్యక్తిత్వాన్ని, స్నేహాలను, ఆత్మతృప్తిని ఎలా పండిచుకున్నారో ప్రకటించుకున్న గజల్ ఇది. ఇది యువతరానికి ఒక సందేశం కూడా...

"నన్ను నేనే పాటగా పలికించు కుంటాను
మిన్నులను నాముంగిటికి పిలిపించుకుంటాను.
ఎన్ని కోట్లున్నాయి నీకని ఏమిటా ప్రశ్న?
ఉన్న నిధి ఒక స్నేహమని ప్రకటించు కుంటాను.
అదుపుతప్పిన ఆశలను మొదలంటు తుంచేసి
ఆత్మతృప్తిని నిండుగా పండించు కుంటాను.
ప్రాణ తంత్రుల మీటగలిగే పలుకు వినపడితే
పారవశ్యం అంచులను ఛుంబించుకుంటాను.
ఇహపరాలలను మేళవించే దిక్కలెదురైతే సి నా రె
అహంకారం సమస్తం అర్పించుకుంటాను."

సి నా రె వారి ఆరు గజళ్ళను సంగీత దర్శకులు యస్. రాజేశ్వర రావు గారి సారథ్యంలో వారే ( సి నా రె) స్వయంగా గానం చేయగా ప్రముఖ సాహితి సంస్థ 'రసమయి' యం.కె. రాములు గారు క్యాసెట్ లు గా రూపొందించారు. (https://youtu.be/KZKX-D3B_Wk?si=umSLkeuLjz4rJKEV)

సి.నా.రె. విలక్షణ మానవీయ గుణాలకు, జీవన విలువలకు, మానవ సంబంధాలకు ప్రాధాన్యత నిచ్చే సామాజిక అంశాలపై వారి హృదయంలో సహజంగా స్రవించిన భావోద్వేగాలను సరళ చక్కని పదబంధాల 'గజలియత్' తో సందేశాత్మక గజళ్ళు కూర్చి సమాజానికి హితబోధ చేశారు. తెలుగు గజల్ వస్తు నిర్మాణ శైలికి కొత్త ఒరవడిని సృష్టించి సి నా రె తెలుగు గజల్ కవులకు మార్గదర్శకులయ్యారు.

"కూటికి గుడ్డకున్ ప్రజలు, కొంగరవోవుచుండ నీటుగా మోటారుబండ్లపై నగదు మూటలతో కలవారి వోటు భి క్షాటన సాగుచున్నయది జాగ్రత! దేశనివాసులారా! మీ యోటులు స్వీయభారత సముజ్వల గాత్రికి సూత్ర బంధముల్"

– జాషువా

# అందం

( చతురస్ర గతిలో గజల్ )

శిరీష వూటూరి 80088 11669

మబ్బుల పరదా తీసే భానుడి వెలుగులు అందం
రాతిరి వెన్నెల పంచే జాబిలి తళుకులు అందం

చుట్టూ తిరిగే తుమ్మెద చెప్పిన కవితలు విన్నది
మధువును దాచిన పువ్వుకు ముసిముసి నవ్వులు అందం

వర్షం పడితే తరువు ఖజానా నిండిపోతుంది
ఆకుల అంచున ఆగిన ముత్యపు చినుకులు అందం

దేశం కోసం ప్రాణం ఇచ్చిన వీరులు అదిగో
గగనవీథిలో వెలిగే తారల మెరుపులు అందం

పంటచేలలో ధాన్యపు సిరులను కోరుకుంటాయి
నేలను తడిపే వేళల వాగుల పరుగులు అందం

# తెలుగు సినిమాపాటల్లో గజల్ సౌందర్యం

డా. తిరునగరి శరత్ చంద్ర
6309873682

'గజల్' అరబ్బీ భాషలో ఉదయించిన కవితాప్రక్రియ. గజల్ అనే పదానికి 'ఇంతులతో మంతనాలు', 'ప్రియురాలితో సల్లాపం' అనే అర్థాలున్నాయి. గజల్ పదం 'గజాల్', 'గజాల' ల నుండి ఆవిర్భవించింది. 'జింక', 'జింక కనులు గల', 'మృగనయని' అనే అర్థాలున్నాయి. 10వ శతాబ్దంలో ఇరాన్ లో పుట్టిన గజల్ 12వ శతాబ్దంలో ముస్లిం రాజుల ప్రాబల్యంతో భారతదేశానికి వలస వచ్చింది. అమీర్ ఖుస్రో మొట్టమొదటి గజల్ కవి అని ప్రచారంలో ఉంది. ఇది తరువాత ఉర్దూ, పర్షియన్, హిందీ, ఇంగ్లీష్, తెలుగు భాషల్లోకి కూడా వ్యాపించింది. ఉర్దూలో మహాకవి మీర్జా అసదుల్లాఖాన్ గాలిబ్ (1797-1869), మహమ్మద్ ఇక్బాల్ (1877-1938) జలాలుద్దీన్ మొహమ్మద్ రూమీ (13వ శతాబ్దం), హాఫిజ్ (14వ శతాబ్దం), తుర్కి కవి ఫుజూలి మొ. వారెందరో ఉర్దూ, పర్షియన్ భాషల్లో గజళ్ళు రాశారు.

గజల్ పల్లవిని 'మత్లా' అంటారు. మత్లా అంటే ఉదయించే చోటు అని అర్థం. చరణాన్ని 'షేర్', లేదా 'అషార్' అంటారు. గజల్ చివరి చరణాన్ని మఖ్ తా అని అంటారు. మఖ్ తా లో కవి కలం పేరు ఉంటుంది. దీనినే 'తఖల్లుస్' అంటారు. గజల్ లోని అంతఃప్రాసను 'కాఫియా' అని, అంత్యానుప్రాసను 'రదీఫ్' అని పిలుస్తారు. గజల్ లో ప్రతి షేర్ లో రెండు మిస్రాలుంటాయి. ప్రతి మిస్రా ఛందస్సును కలిగి ఉంటుంది. గజల్ ప్రాయికంగా శృంగారప్రాయమైనది. ఈ ప్రక్రియ తెలుగులోకి కూడా వ్యాపించింది.

తెలుగులో గజల్ కి ఆద్యుడు మహాకవి దాశరథి. ఆయన ఉర్దూలో మీర్జా అసదుల్లాఖాన్ గాలిబ్ రాసిన గజళ్ళను 'గాలిబ్ గీతాలు'(1961) పేరిట

తెలుగులోకి అనువదించాడు. ఆ తరువాత సొంతగా ఆయన 13 గజళ్ళు రాశాడు. దాశరథి తర్వాత డా.సి.నారాయణరెడ్డి గజళ్ళు రాసి పాడి వాటికి విశ్వవ్యాప్తిని కలిగించాడు. తెలుగు గజళ్ళు (1986), సినారె గజళ్ళు (1995) పేర్లతో పుస్తకాలు ప్రచురించాడు. శృంగార భావనలకు, ప్రణయ సౌందర్యానికి ఆలవాలమైన గజల్ ని తెలుగు సినిమాల్లో కూడా గీతరచయితలు ప్రయోగించిన సందర్భాలున్నాయి. 'గజలియత్' (గజల్ ని వ్యక్తీకరించే విధానం) తాలూకు స్పర్శ ఉన్న వాటిని పాటలుగా లేదా నేరుగా గజళ్ళకే బాణీలు కట్టి సినిమా పాటలుగా మలచిననీ ఉన్నాయి. వాటిని పరిశీలిద్దాం..

**పానశాల లేకపోతే ఏది ఉన్నా వృథానే. అది బడియైనా, గుడియైనా ఏదైనా ఒక్కటే.**

1980లో వచ్చిన 'మా ఇంటి దేవత' సినిమాలో దాశరథి అనువదించిన 'గాలిబ్ గీతాలు' లోని కొన్ని పద్యాలను యథాతథంగా వాడుకోవడం జరిగింది. ఇవి సినిమాలో శృంగారభావుకత్వాన్ని చాటే సందర్భంలో కనబడతాయి.

'తారలెల్ల పగలు పరదాలా దాగె
రాత్రివేళనవి దిగంబరమ్ములయ్యె'

పై గజల్ లో ప్రియుని ప్రణయదాహం, విరహవేదన రెండూ కనిపిస్తాయి. నక్షత్రాలు పగలు మబ్బు పరదాల దాగి ఉన్నాయట. రాత్రివేళ అవి శృంగారపు తళుకు ఛాయలతో దిగంబరంగా దర్శనమిచ్చాయని చెబుతాడు కవి. అంటే ఇక్కడ తారలను ప్రేయసికి అన్వయించి చెప్పిన తీరు కనబడుతుంది.

'పానశాలలేనిదేదైననేమి?
బడియు గుడియు సత్తరువు సర్వమ్మునొక్కటే'

పానశాల లేకపోతే ఏది ఉన్నా వృథానే. అది బడియైనా, గుడియైనా ఏదైనా ఒక్కటే. పానశాలయే అన్నింటికంటే మిన్న అనే భావనను ఈ పంక్తుల్లో స్పష్టం చేస్తున్నాడు కవి.

'బ్రతుకుపైనింత విశ్వాసపడదరేల?
ఏరి లోకాలనేలిన వీరులెల్ల?'

ఈ గజల్ తాత్త్విక చింతనను, వైరాగ్యభావనను స్పష్టం చేస్తుంది. బతుకుపై అంతగా ఆశలు, కోరికలు ఎందుకు? లోకాలనేలిన వీరులు ఎంతమంది ఉన్నారు. బతుకుపై ఎంత ఆశ ఉన్నా అది వృథా. ఈ జీవితం క్షణకాలం. అంతా శూన్యమే అనే భావన తెలియజేస్తోంది.

నడుము బిగియించుచుంటివి నన్ను దునుమ - నాకు తెలియులే నీకెంత నడుము కలదో

'ఎంతో ఉత్సాహపడుచు కష్టించువౌర
మృతియె లేకున్న రుచియేది బ్రతుకులోన'

జీవితంపై ఎంతో ఉత్సాహాన్ని, కోరికల్ని పెంచుకుని నిరంతరం కష్టిస్తున్నావు. చావు లేకున్నా బతుకులో రుచి ఎక్కడుంది? అని ప్రశ్నిస్తున్నాడు. చావుకు వెనుదీయని వైరాగ్య చింతన ఈ గజల్ లో ఉంది.

'ఎంత తీయని పెదవులే ఇంతి నీవి
తిట్టుచున్నపుడున్ గూడ తీపి గురియు'

స్త్రీ పెదవులు ఎంతో తీయగా ఉన్నాయట. ఆ తీయదనం ఎలా ఉన్నదట అంటే..ఆమె తిట్టుచున్నపుడు కూడా ఆమె పెదవులనుంచి తీపే కురుస్తున్నదట..

'ఆమె ముద్దిచ్చుటకు వెనుకాడదేమో
కాని ఇమ్మని అడుగ వెనుకాడినాను'

ఆమెను ముద్దుపెట్టమని నేనడగలేదు. ఒకవేళ అడిగితే పెట్టేదేమో.. వెనుకాడదేమో? కాని ముద్దుపెట్టమని అడిగేందుకు మాత్రం నేను వెనుకాడాను. అంటూ ఓ చిలిపి యవ్వనస్థితిని తెలియజేశాడు కవి.

'నడుము బిగియించుచుంటివి నన్ను దునుమ
నాకు తెలియులే నీకెంత నడుము కలదో'

ప్రియుడు ప్రేయసి తన మీద యుద్ధానికి వస్తూ నడుం బిగించడానికి నడుము చుట్టూ తన చీర కొంగును చుట్టుకున్నది అని చెబుతూనే నీకు ఎంత నడుముందో నాకు తెలుసులే అని చమత్కారం ధ్వనించేలాగా అనడం ఒక సరస సంభాషణ. ఇవి గాలిబ్ గీతాలనుంచి నేరుగా తీసుకున్నవి. ఇంకా..'మూగనోము'(1969)

సినిమాలోని 'నిజమైనా కలయైనా నిరాశలో ఒకటేలే', 'పెద్దక్కయ్య'(1967) సినిమాలోని 'విరబూసేను వలపుల రోజా', 'నవరాత్రి'(1966) సినిమాలోని 'నిషా లేని నాడు హుషారేమి లేదు' మొ. పాటలన్నీ దాశరథి రాసినవే. ఈ పాటలో గజల్ సౌందర్యం స్పష్టంగా దర్శనమిస్తుంది.

ఇది ఒక ప్రణయగీతం. ప్రకృతిని ప్రేయసిగా భావిస్తూ, ప్రకృతిని తాదాత్మ్యంతో తిలకిస్తూ రాసిన పాట.

1978లో వచ్చిన 'అక్బర్ సలీం అనార్కలి' సినిమాలో డా.సి.నారాయణరెడ్డి రాసిన పాటల్లో గజల్ ఛాయలు కనిపిస్తాయి. ఇందులో మత్లా, కాఫియా, రదీఫ్ వంటి నియమాలు పాటించబడ్డాయి. ఇది సినిమా కోసం రాసినవి కాబట్టి తఖల్లుస్ పాటించబడలేదు.

'తారలెంతగా మెరిసేనో చందురుని కోసం
రేయి ఎంతగా విరిసేనో దినకరుని కోసం
చిగురుటాకులే చేతులుగా మిసిమి రేకులే పెదవులుగా
పరిమళాలే పిలుపులుగా మకరందాలే వలపులుగా
పువ్వులెంతగా వేచేనో తుమ్మెదల కోసం
నింగిరంగులే కన్నుల దాచి కడలి పొంగులే ఎదలో దాచి
గులాబి కళలే బుగ్గల దాచి మెరుపుల అలలే మేనిలో దాచి
పరువాలెంతగా వేచేనో పయ్యెదల కోసం'

ఇది ఒక ప్రణయగీతం. ప్రకృతిని ప్రేయసిగా భావిస్తూ, ప్రకృతిని తాదాత్మ్యంతో తిలకిస్తూ రాసిన పాట. నక్షత్రాలు చంద్రుని కోసం ఎదురు చూస్తూ ఎంతగానో మెరిశాయట. రాత్రి – ఉదయించే సూర్యుని కోసం ఎంతగానో మురిసిందట. చిగురుటాకులే చేతులుగా, లేతరేకులే పెదవులుగా, పరిమళాల రూపంలో పిలుస్తూ, మకరందాలనే ప్రేమలుగా చేసుకుని పువ్వులు తుమ్మెదల కోసం ఆరాటపడుతున్నాయట. ఆకాశపు నీలిమను కన్నుల్లో దాచుకుని, సముద్రాల పొంగుల్ని గుండెలో దాచుకుని, గులాబి ఎరుపు దనాన్ని బుగ్గల్లో దాచుకుని, మెరుపుల తళుకుల్ని శరీరంలో దాచుకుని ప్రేయసి అందాలు చీరకోసం (పైట) ఎదురు చూస్తున్నాయి. ఈ గజల్ లో శృంగార ప్రాయమైన

స్పర్శ చాలా స్పష్టంగా కనిపిస్తుంది. ప్రేయసి అందాలకు ప్రకృతి సింగారాలను ఆపాదిస్తూ ఎంతో మనోహరంగా సినారె రాశాడు. ఈ గజల్ లోని మెరిసేనో, మురిసేనో, వేచేనో వంటి పదబంధాల్ని, అంత:ప్రాసల్ని కాఫియాగా పిలుస్తారు. 'కోసం' (అంత్యానుప్రాసను) రదీఫ్ గా పిలుస్తారు. ఇదే సినిమాలో..

> చేతిలో మధుపాత్ర లేకపోయినా నాకిప్పుడు కళ్ళు తిరుగుతున్నాయి. చూసేవాళ్ళు నన్ను తాగుబోతంటారు.

'తానే మేలి ముసుగు తీసి ఒక జవ్వని పువ్వులా నవ్వుతుంటే ఏం చేయను?
నవ్వే ఆ నవ్వులోనే మెలమెల్లగా పిడుగులే రువ్వుతుంటే ఏం చేయను?
చేత మధుపాత్ర లేదు నా తిప్పుడు అయినా అంటారు నన్నే తాగేనని
కన్నులే పొంగిపోయే మధుపాత్రలై కైపులో ముంచుతుంటే ఏం చేయను?
నేను ఫిరదౌసినా? మరి కాళిదాసునా? కాని అంటారు నన్నే కవిరాజని
ప్రేయసి మధుర రూపం మహాకావ్యమై ఊహలో పొంగుతుంటే ఏం చేయను?'

అనే పాటలో – ప్రేయసి అందచందాలకు మురిసి మైమరచిపోయే ప్రియుని అంతరంగం ఆవిష్కృతమవుతుంది. తానంతట తానే ప్రేయసి ముసుగు తీసి పువ్వులా నవ్వుతుంటే ఏం చేయను – నవ్వు నవ్వి ఆ నవ్వుతోనే సుకుమారంగా, మెల్లగా పిడుగుల్ని రువ్వుతుంటే ఏం చేయను అంటాడు కథానాయకుడు. చేతిలో మధుపాత్ర లేకపోయినా నాకిప్పుడు కళ్ళు తిరుగుతున్నాయి. చూసేవాళ్ళు నన్ను తాగుబోతంటారు. ఆమెను చూస్తూ చూస్తూ నా కళ్ళు మధుపాత్రలై పొంగిపోతుంటే నేనేం చేయను? మత్తులో మునిగి పోవడం తప్ప నేనేం చేయను? అంటున్నాడు. నేను పర్షియన్ మహాకవి ఫిరదౌసినా? కాదు. సంస్కృత మహాకవి కాళిదాసునా కాదు. కాని నన్ను కవిరాజని పిలుస్తారు. కారణం..ప్రేయసి మనోహర రూపం మహాకావ్యమై ఊహల్లో పొంగుతుంటే నేనేం చేయగలను అంటాడు. ప్రేయసి వల్ల తాను తాగుబోతుగా మారిపోతున్నాడు. ప్రేయసి వల్ల తాను కవిగా మారిపోతున్నాడు. ఊహలతో నిండిపోయిన తన హృదయాన్ని సరికొత్తగా ఆవిష్కరించుకుంటున్నాడు. ఈ గజల్ లోని నవ్వుతుంటే, రువ్వుతుంటే, ముంచుతుంటే, పొంగుతుంటే అనే పదబంధాలు, కాఫియా గా,

ఏం చేయను? అనే అంత్యానుప్రాస రదీఫ్ గా చెప్పుకోవచ్చు.

'రేయి ఆగిపోనీ రేపు ఆగిపోనీ
ఈ ప్రేమవాహిని ఇలా సాగిపోనీ
ఆ స్వర్గమైనా ఈ లోకమైనా
అనురాగధారలో అలా వీగిపోనీ'

ఈ పాటలో కూడా ప్రేయసీప్రియులు తమ ప్రేమలో, ఆనందంలో రేయి ఆగిపోవాలని, రేపటిరోజు ఆగిపోవాలని, వారి ప్రేమ ప్రవాహం ఆగకుండా సాగిపోవాలని కోరుకుంటున్నారు. స్వర్గలోకమైనా, భూలోకమైనా అనురాగధారలో కలిసిపోవాలని భావిస్తుంటారు. ఇందులో కూడా ఆగిపోనీ, సాగిపోనీ, వీగిపోనీ వంటి పదబంధాలు గజల్ ఛాయలతో ప్రత్యేకంగా కనిపిస్తాయి.

'పూజాఫలం' (1964) సినిమాలో సినారె రాసిన –
'పగలే వెన్నెల జగమే ఊయల' పాటలో –
'నింగిలోన చందమామ తొంగిచూచె
నీటిలోన కలువభామ పొంగిపూచె
ఈ అనురాగమే జీవనరాగమై
ఎదలో తేనెజల్లు కురిసిపోదా..
కడలి పిలువ కన్నెవాగు పరుగుతీసె
మురళిపాట విన్న నాగు శిరసునూపె
ఈ అనుబంధమే మధురానందమై
ఇలపై నందనాలు నిలిపిపోదా..'

అనే పాటలో ప్రకృతిలో పరవశించే ప్రత్యణువును పరిపరివిధాలుగా తిలకించి పులకించే హృదయం దర్శనమిస్తుంది. ఆకాశంలోని చందమామ తొంగి చూడగానే, నీటిలోని కలువ పొంగిపూయడం – ఈ ప్రేమానురాగం జీవనరాగమై హృదయాల్లో తేనెజల్లు కురిసిపోతుందట. సముద్రం పిలవగానే కన్నెవాగు పరుగుతీసింది. మురళీనాదం విన్న వెంటనే నాగు శిరసూపడం – ఈ అనుబంధం తీయని బంధమై ఈ నేలపై బృందావనాలను నిలిపిపోతుందట. ఈ పాటలో – 'కురిసిపోదా', 'నిలిపిపోదా', 'విరిసిపోదా', 'మెరిసిపోదా' వంటి పదబంధాలన్నీ కాఫియా గా కనిపిస్తాయి.

**మనుషులందరూ దేవతలైతే ఇక గుడులెందుకు? మనసులన్నీ పాటలైతే కోయిలలెందుకు?**

డా.సి.నారాయణరెడ్డి రాసిన ఓ గజల్ ని – 'సంసారం ఓ సాగరం' సినిమాలో సందర్భానుసారంగా వాడుకోవడం జరిగింది.

'ఇందరు మనుషులు దేవతలైతే ఎందుకు వేరే కోవెలలు
ఇన్ని మనసులు గీతికలైతే ఎందుకు వేరే కోయిలలు
దూసిన కొలదీ దోసిలి చాలదు పరిచిన కొలదీ పానుపు చాలదు
ఇన్ని మమతలు ఘుమఘుమలాడగా ఎందుకు వేరే మల్లియలు
దయ కురిపించే చూపే తీయన లయ పలికించే తలపే తీయన
ఇన్ని మధురిమలు ఎదలో నిండగా ఎందుకు వేరే తేనియలు'

మనుషులందరూ దేవతలైతే ఇక గుడులెందుకు? మనసులన్నీ పాటలైతే కోయిలలెందుకు? దూసిన కొద్దీ దోసిలి, పరిచినకొద్దీ పానుపు సరిపోవు. ఇన్ని ప్రేమలు ఘుమఘుమలాడుతుంటే ఎందుకు వేరే మల్లియలు – చూపులన్నీ, తలపులన్నీ తీయదనాన్ని పంచుతుంటే – ఎన్నో మధురిమలు మనసులో నిండిపోతాయి. ఇక వేరే తేనెలెందుకు? అని అంటున్నాడు కవి. ఎలాంటి మార్పులు లేకుండా ఉన్నది ఉన్నట్లుగా సినిమాలో వాడుకున్న గజల్ ఇది. ఇందులోని 'కోవెలలు', 'కోయిలలు', 'మల్లియలు', 'తేనియలు' రదీఫ్ కాగా, 'ఎందుకు వేరే' – కాఫియాగా భావించవచ్చు.

'నీదీ నాదీ ఒకే కథ' (2018) సినిమాలో డా.ఎం.బి.డి శ్యామల రాసిన గజల్ లో..

'హృదయమెంత తపిస్తే బతుకు విలువ తెలిసింది
గుండెనెంత మధిస్తే కన్నీటి విలువ తెలిసింది
రాలిన పూలను తెచ్చి కొమ్మకు అతికిస్తావా?
మనిషి దూరమయ్యాక మనసు విలువ తెలిసింది
మాటలెన్ని జారావో నోటినడుగు చెబుతుంది
పాటించిననాడే పలుకు విలువ తెలిసింది'

మనసు తపించినపుడు బతుకు విలువ, గుండెను మధించినపుడు కన్నీటి విలువ తెలిశాయని అంటారు కవయిత్రి. రాలినపూలను తెచ్చి కొమ్మకు అతికించడం వృధా. ప్రాణం పోయాక ఏమి చేయలేం. కాలం గడిచాకా ఏదీ తిరిగిరాదు కదా. మనిషి దూరమయ్యాకే మనసు విలువ తెలిసిందంటారు. మాటల్ని ఇష్టం వచ్చినట్టుగా వదిలేయడం సరికాదు. ఎన్ని మాటల్ని జారవిడిచావో నోటినడిగితే తెలుస్తుంది. చాలా పొదుపుగా వాడినపుడే పలుకు విలువ తెలుస్తుందంటారు.

**దుర్మార్గపు పాలన కింద నలిగిపోతున్న నిరుపేదల జీవితాలను గురించి, అణగారిపోతున్న బతుకులను గురించి కళ్ళకు కట్టినట్లు చెప్పారు.**

'విరాటపర్వం'(2022) సినిమాలో ద్యావరి నరేందర్ రెడ్డి రాసిన ఓ గజల్ లో విప్లవాత్మకమైన భావాలు అలలెత్తి కనిపిస్తాయి.

'ఆధిపత్య జాడలనే చెరిపేయగ ఎన్నినాళ్ళు?
తారతమ్య గోడలనే పెకిలించగ ఎన్నినాళ్ళు?
దున్నెటోడి వెన్ను విరిచి భూస్వాములు ధనికులైరి
అంతులేని దోపిడినే తరిమేయగ ఎన్నినాళ్ళు?
ఆడపడుచు అడుగులకే సంకెళ్ళే అమానుషం
చెరబట్టే చేష్టలనే చెండాడగ ఎన్నినాళ్ళు?

దుర్మార్గపు పాలన కింద నలిగిపోతున్న నిరుపేదల జీవితాలను గురించి, అణగారిపోతున్న బతుకులను గురించి కళ్ళకు కట్టినట్లు చెప్పారు. ఆధిపత్య జాడల్ని చెరిపేయడానికి ఇంకెన్నినాళ్ళు అని ప్రశ్నిస్తాడు. తరతమభావాలు లేని కొత్త ప్రపంచం కోసం కలలు కంటున్నాడు. ఈ గజల్ లోని 'ఎన్నినాళ్ళు' రదీఫ్ గా, చెరిపేయగ, పెకిలించగ, తరిమేయగ, చెండాడగ ..కాఫియాగా పాటించబడ్డాయి.

ఇలా..గజల్ లక్షణాలతో తెలుగు సినిమాల్లో సందర్భానుసారంగా ఎన్నో పాటలు వచ్చాయి. గజల్ తాలూకు స్పర్శతో కూడా ఎన్నో పాటలున్నాయి.

# గజల్ ...భావుకతా సౌందర్యం

శ్రీమతి రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి
98665 83907

గజల్... ఈ పదమే సున్నితమైన పత్తి పూలానో... సుకుమారమైన శంకుపూలానో... హృదయాన్ని తాకి మెలి పెట్టే వయొలిన్ నాదంలానో... విశ్వాన్ని వశ పరుచుకునే పిల్లనగ్రోవిలానో అద్భుతంగా అనిపిస్తుంది.

గజల్... అంటే అంటూ ఎందరో ఎన్నో చెప్పారు. కాని నా మటుకు నాకు...

గజలంటే... హృదయగానం
గజలంటే... ఉద్వేగ భాసం
గజలంటే... ప్రణయ తాత్వికతా రాగం
గజలంటే... మృదు భావ మధు మాసం

అంతేనా... అంతరంగాంతరాలలో సంచరిస్తూ... సంచలిస్తూ... ప్రజ్వలించే వివిధోద్రేక వేదనా వేదనల విషాద ప్రదర్శనా లాస్యం. ప్రేమ పూరితమైన మనసు ఏకాంతమై సంతుష్టి నీయని విరహ వియోగ యోగ గవేషణలో తాత్విక వర్ణాల భాష్యం.

ఇంతకీ ఎక్కడిదీ గజల్...అంటే పుష్పంతుల కిరణ ప్రభల తడుస్తున్న... కాగుతున్న... మరుగుతున్న... ఎడారి ఇసుక నేలల నుండి సుందరము, సుకుమారము, సున్నితమైన వలపు సుమంగా విరిసి, అందము అపూర్వము. అపురూపము ఐన సాహితీ ప్రక్రియగా ఎగసిన గజల్ మన తెలుగు ఎదల లోగిళ్ళ. మెరుస్తోన్న రసాత్మక రూపాకృతి.

గజళ్ళను ఎవరెలా రాసినా... లోతైన భావానికి తగిన భాషా సౌందర్యాన్ని అద్ది అర్థగాఢతను, కవితాత్మకతను ఆత్మగా నిలపగలిగినపుడే అది అర్థవంతమైన ఔచితీ వంతమైన గజల్ అవుతుంది. నిజానికి గజల్ కు

కాఫియా ఎంత ముఖ్యమో భావుకత అంతే ముఖ్యం. ఆపై కవితాత్మకత ముఖ్యం.

భావుకత అంటే... ఎవరికి కలుగని ఓ చక్కని ఊహను అనన్వయము, అనౌచిత్యము లేక అందంగా అంతవరకు ఎవరు చెప్పని విధంగా చేప్పే అంశం గురించిన లోతైన అవగాహనతో వినూత్నంగా చెప్పటమే లేదా వర్ణించటమే భావుకత అనేది నా అభిప్రాయం. అందమైన భాష, అందునా అర్థగాఢతను సొంతం చేసుకున్న భాష అపురూప సౌందర్యాత్మక భావుకత, కవితాత్మకత ఉన్న గజళ్ళే కాలానికి నిలబడతాయి అన్నది నిజం.

**కాగేటి కాలపు క్రతువుల కొలుపుల చిత్రాలు అనేదెంత నూతన అభివ్యక్తో. అంతే కాదు ఉదయం వేళ, సాయంత్రం వేళ అంటుంటాం.**

వెన్నెలను వర్ణించే ఈ గజల్ ను చూస్తే... ఇందులో ఇంతవరకెవరు వర్ణించని విధంగా సరికొత్తగా వెన్నెలలోని పదకొండు ఛాయలను అద్భుతంగా వర్ణించబడిన గజల్ ఇది.

"ఎంత కాంతి చిందో ఎన్ని కళల ఛందో హాయి విందో నే నిశివెన్నెలనే
కాగేటి కాలపు క్రతువుల కొలుపుల చిత్రాలు కనలేని
మసి వెన్నెలనే..." అంటూ సాగిన ఈ గజల్ మిస్రాలలో
పసిపాప ఫాలాన గీర్బొట్టు పసదనమై పలుకరించె పసి వెన్నెల నే
వలపు వేళ వయసు వయారి వలకాకను పెంచే కసి వెన్నెల నే
మహర్షులనైనా వశపరచుకొంటూ ఉత్సుకత రేపే ఉసివెన్నెల నే
ముద్దులుగ రాలె అవధి కాని చీకటిని వేటేసె తళుకు అసివెన్నెల నే
స్వప్న సరిగమల జోలగ మారి వింత బాపి సాంత్వన నిడు వసివెన్నెల నే
కందువలె మారి సుమాలె రాలి కళలే కళవళపడిన నే శశి వెన్నెల నే

ఇలా ఇంకా మిసి వెన్నెల, ససివెన్నెల, నుసి వెన్నెల అంటూ సాగిన ఈ గజల్ ఎంత భావుకతను, గజల్ లో ఉండాల్సిన గజలియత్ ను ఒలకబోసిందో... ఈ గజల్ లో వాడిన ఎన్నో కొత్త పదాలు సరికొత్త భావుకతకు అద్దం పట్టేవే. కాగేటి కాలపు క్రతువుల కొలుపుల చిత్రాలు... అనేదెంత నూతన అభివ్యక్తో. అంతే కాదు ఉదయం వేళ, సాయంత్రం వేళ అంటుంటాం. కాని ఇక్కడ వలపు వేళ... అనే ఓ కొత్త పదబంధం అద్భుతంగా వాడబడింది. "ముద్దులుగా రాలె

చీకటి" వంటి ఉహ సుందరమైనదే. విరహము అనే అర్థాన్నిచ్చే వలకాక అనే అచ్చ తెనుగు పదం ప్రయోగమెంత అర్థవంతంగా ఔచితీవంతంగా ఉందో అని అనిపిస్తోంది కదా.

ఈ రేయి చీకటి
కసిమసినే కళ్ళలో
నింపుకుంటోంది
తనను తానే
వెలుగుల
వెల్లి వైపునకే
నెట్టుకుంటోంది

ఒకనాడు భిన్న ప్రణయానుభూతులైన విరహ వియోగాది భావ పరిమళంతో, ప్రకృతి సౌందర్యము, అతి సుకుమారమైన మనసు మార్దవ స్వభావ సరసత ఇత్యాది కోమల తలపుల అలరారిన గజల్ ఈనాడు భిన్న వస్తు ప్రాధాన్యతను సంతరించుకొంది. సమాజ స్థితిగతులు, సమాజ సమస్యలు, వ్యక్తులు మొదలైన అంశాల సింగారాతో సృజనగావించబడుతోంది. అందుకే నేడు గజల్ సహజ పరిమళాన్ని కోల్పోయి, రసనిష్ఠలేని, హృదయాన్ని రసావిష్కరణతో రసప్లావితం చేయలేని రసాకృతి కాక రసహీనమౌతోంది.

ఆద అనుగు కంపన ప్రకంపనాలతో ఆవిర్భవించే... అనుభూతింపచేసే ఆవిష్కరించే ఆర్ద్రత, ఖేద, మోద మోవిగా, స్వాంత సాంత్వనా ఔషధంగా, నాజూకైన సాహితీ ప్రక్రియగా గజల్ నిలవాలి.

ఐనా... శబ్దార్థ భావుకతా సౌందర్యాభివ్యక్తితో వర్ణ సింగార శక్రధనువై కళలీనుతూ మమతా మధూళికను కురిసి ఎదలను తడిపే పూల వల్లరైన గజల్ లో నల్లగా ఉండే చీకటి రాత్రిలో మిణుగురులు తిరుగుతూ ఉంటాయి అంటూ మామూలుగా మాట్లాడుకునే మాటల్లా కాక చిరు చీకటి కటిక చీకటి కారు చీకటి వంటి పదాలతో చెప్పటం కాక హృద్య భావుకతనొలికే పదజాలంతో రాత్రిని వర్ణిస్తూ చదువరుల్ని నూత్న భావనా లోకానికి తీసుకెళ్తున్న వర్ణనా తీరును చూడండి ఇలా...

ఈ రేయి చీకటి కసిమసినే కళ్ళలో నింపుకుంటోంది
తనను తానే వెలుగుల వెల్లి వైపునకే నెట్టుకుంటోంది
క్షణద క్షణాల క్షణికల కణికల పూలను గంపకెత్తుతోంది
కిరణాలనె అల్లుకోవాలని కాలాన్ని తోసుకుంటోంది
క్షమ మిణుగురుల మిలమిలల అందాల మిసిమిని
అయోమయమై

పిలుపవక అలసిన ఆదతొ ఆవేశమై కొట్టుకుంటోంది
జగతిని గెలవాలని నిద్రను తోడుగా తెచ్చుకున్న యామి
ఓటమి నే రుచి చూపిన నిదురను తానే మోసుకుంటోంది
చీకటంటి గబ్బిలంలా తలకిందులుగా వేలాడే రెయి
తన మక్కువ చిక్కు చిక్కి వరాళి రాగం పాడుకుంటోంది
శోకము సన్నాయిని ఊదుతూనె సుషుప్తిని రేపే రమ్య
జీవుల తూగులాటను సంబరంగానే చూసుకుంటోంది

ఈ గజల్ ను చదివిన తదుపరి ఓ పదబంధం కాదు... ఓ షేర్ కాదు... రాత్రి కున్న వేరువేరు పేర్లే కాదు... గజల్ ఆసాంతం ఆపాత మధురమై చీకటి కసిమసి, కిరణాలనె అల్లుకోవటం, మక్కువ చిక్కు చిక్కి, శోకము సన్నాయిని ఊదటం వంటి అద్భుత పదచిత్రాలే కాకుండా; క్షణద క్షణాల క్షణికల కణికల వంటి శబ్ద సౌందర్యంయుతమై ప్రతి శేర్ భావ చిత్రాల చిత్రలిపి శృంగారమై పాఠకుల మానసాలకు హాయి పూత పూస్తూ చక్కని గజలియత్ తో పరిమళించే గజల్ ఇది. రాత్రిని ఇంత పరవశంతో రమణీయ భావుకతా రమ్య రాసంగా ఎవరు నిర్వచించ లేదేమో. ఎందుకంటే... రాత్రి ఇన్ని పనులు చేస్తుందనే ఊహ ఎందరిలో కలుగుతుంది. నిజంగా ఈ తలపులు ఎవరు నడవని దారులే. అందుకే ఏదో ఒక శేర్ కాక గజల్ ను మొత్తం తీసుకోవాల్సి వచ్చింది.

గజల్ పైన చెప్పుకొన్న అన్ని అంశాలతో పాటుండే తాత్వికతాభివ్యక్తి మనసును ఆకట్టుకుంటుంది. మరి తాత్వికత అంటే... వ్యక్తి, మనసు, కవిత్వం, సమాజం ఇత్యాది అంశాల పట్ల లోతైన అవగాహనతో అందంగా సృజనగావించటమే తాత్వికత కదా.

రాహిత్యపు సీమల వెర్రియై వెర్రిగా సంచరిస్తూ... రాహిత్యాన్ని సున్నిత సాహిత్యంగా మార్చుకున్న ఓ మనసు తాత్వికతా రాగాన్ని ఆలపించిన వితమెలా ఉందో... ఆ మనసెన్ని ప్రశ్నలమయమో సంచయమో చూద్దాం. మిణుగురు వంటి ఓ మనసు పరిపరి విధాల ఎలా అనుకుంటుందో... ఇలా...

మిణుగురునై తిరుగుతునె ఉన్నా గమ్యం చూపేదెవరో
కుదురు లేక కుములు నా కునుకు ఉనికేదో తెలిపేదెవరో
సహతో సహా సర్వం సహ్యమౌ సౌజన్య సౌభాగ్యాన్ని
నను నే మరచేంత చలువ వెన్నెలగ నాపై ఒంపేదెవరో
రెప్పపాటులో దాగిన గడియలన్ని రే వెలుగుచుట్టూనే

భూమ్యాకాశాల భృకుటి విభల భవ్యమై గడిపేదెవరో
విచయమే లేని విద్దూరాల విలువల విషయ వితమేదో
సంచలిత కాలాన విస్మయ సంచయాలు నింపేదెవరో
పత్రాల్లా రాలుతూ పర్వాలవని ప్రాణ ప్రభలెన్నోలె
ప్రభవ విభవల ప్రవాహంగ పర్వెత్తుతునె ఆపేదెవరో

ఒక మనసు మరొక మనసుకు నిజంగా అర్థమౌతుందా అందులో ఆ మనసు ప్రేమించే మనస్సైనా

గాఢత, గూఢత, నవ్య తాత్వికతా నిలయమీ గజల్. దీనిలో కుదురు లేని కునుకు, కునుకు ఉనికి, రే వెలుగు, ప్రాణ ప్రభలు వంటి పదబంధాలు ఎంత ఔచితీవంతంగానో వాడబడటం విశేషం. అంతే కాదు ★భూమ్యాకాశాల భృకుటి విభల★ వంటి చక్కని గొప్ప ఊహల విందుతో ★సహతో సహా సర్వం సహ్యామౌ సౌజన్య సౌభాగ్యాన్ని★ అనే షేర్ అక్షర రమ్యతనే కాదు అర్థ సౌందర్యానికి పెద్ద పీట వేసింది. ఇంకా ప్రాణ సంబరాలు లేదా ప్రాణ కాంతులు పర్వాలవకనే అంటే పండుగలవకనే ఎండినాకుల్లా రాలి పోతున్నాయి. అంతేనా ప్రభవ విభవ అనేవి మనం అనుసరించే అరవై ఏళ్ళలో మొదటివి. కాలం అలా సంవత్సరాల ప్రవాహంగా సాగిపోతూనే... దాన్ని ఆపేదెవరు... అంటూ గాఢ తాత్వికతా స్ఫూర్తితో అడిగే ప్రశ్నలలోని అభివ్యక్తి నవ్య నవ్యాభివ్యక్తి ఆకర్షణీయంగా ఆలోచింప చేసేవిగా ఉన్నాయి.

ఒక మనసు మరొక మనసుకు నిజంగా అర్థమౌతుందా... అందులో ఆ మనసు ప్రేమించే మనస్సైనా... మనిషైనా... నే నీ కోసమేనన్నది ఎవరికి తెలుసనే బేలతనంతో పాటు... తన మనసునెవరు తెలుసుకోగలరు అనేది ఎవరికి ఎరుక... అంటూ మామూలుగా ప్రశ్నించే తీరు కాక ఆ వేదనాభివ్యక్తి ఎంతో భావుకతతో సౌమ్య రమ్య రుచిరార్థ పదాల నెంత హృద్యంగా దాగుందో ఈ గజలులో. నీకోసం నే ఏమేమయానో నీతో పాటు ఎవరికి ఎరుక ..ఎవరికీ ఎరుక లేదనే అర్థం లోనే ★ ఎవరికి ఎరుక ★ అనే పదాలు వాడబడ్డాయి. ఆ లోతుదనమేంటో... ఇలా...

వెన్నెల డోలియనై కౌగిలింతనై నీ భావాలకెంత ఊతమయానో ఎవరికి ఎరుక
నీ భావ నవ్యత కోసం వర్ణనా పదములకు ఎంత ధానమయానో ఎవరికి ఎరుక
చూపంటే వితాకునిస్తూ వివరణకందని వివిధ విమల భావాలు మీటె వీణ కదా

నా చూపు తీవెల నిన్నల్లి ఎంతగా నీ మది
సాంత్వనా గీతమయానో ఎవరికి ఎరుక
కాలానికే తెలుసు క్షణద రూపాలేవో
సారపారాలేవో వికసిత జ్ఞానధానలెవో
వేళ నిన్నలకువ చేసి అలజడి రేప నిను ఓదార్చే
ఏ రాగమయానో ఎవరికి ఎరుక.

శ్వేత వర్ణ మేఘ సుమాలు, పాలపుంతల ముంతలు, దిష్టి తీసుకోవటం వంటి సొంపైన పదప్రయోగ భావ ప్రకటనా పద్ధతి బాగుంది కదా.

ఈ గజల్ లో వెన్నెల డోలియ, వర్ణనా పదములు, చూపుతీవెలనే పదం చిత్రాలే కాక చూపూను వీణగా చెప్పటం కొత్తగ ఉంది.

మరో గజల్ నింగిని వస్తువుగా తీసుకుని ఎంతటి భావయుక్తంగా కళాత్మకంగా కవితాత్మకంగా జిలుగు పదాల మేలి తలుపుల వన్నెలీను వర్ణనా మాలగా మనసును దోచే హేలగా మన ముందుంచబడిందో... జిలుగు ఊసుల వెలుగుతో ఈ గజలెందర్ని ఆకఃట్టుకుంటుందో తెలియండిలా...

నింగి నిలువెల్లా నీలాంజనాన్ని పూసుకుంది చూశావా (ఆకాశం నల్లగా ఉంటుంది. నీలాంజనం అంటే కాటుక నల్లగా ఉంటుంది. ఆకాశం కాటుకను పూసుకుని నల్లగా ఉంది చూశావా అనే నవ్య చిత్రాన్ని మన కళ్ళ ముందుంచింది. అసలీ గజల్ అంతా సొగసులీను భావ చిత్రాల మయమే)

హృద్య శ్వేత వర్ణ మేఘ సుమాలనే కోసుకుంది చూశావా
మక్కువ మీర గాను విలువైన పాలపుంతల ముంతలలోని
వెలుగులనొలుక సుంతైన తనపై పోసుకుంది చూశావా
ఏళ్ళుగా రాలకుండా ఉన్న తారామణులను ఇంకొకరికి
ఈయకనే తమకాన తనలోనే తోసుకుంది చూశావా
చినుకు చిందించేటి చెలువమంతా తనదేనంటూ తెలుపుతూ
చినుకు దారి సంబరాన్ని తువ్వరలో చూసుకుంది చూశావా
మల్లీ! చిలమిలికలనె కాదు శక్రధనువుల జిలుగు సొగసులతో
ప్రేమారగా తనకు తానే దిష్టి తీసుకుంది చూశావా

శ్వేత వర్ణ మేఘ సుమాలు, పాలపుంతల ముంతలు, దిష్టి తీసుకోవటం వంటి సొంపైన పదప్రయోగ భావ ప్రకటనా పద్ధతి బాగుంది కదా. ఇంకా తనపై పోసుకుంది, తనలోనే తోసుకుంది వంటి వ్యక్తీకరణలో మనిషికి సహజ

గుణ మైన స్వార్థాన్ని నింగి చూపినట్టు చెప్పటం సహజంగా ఉంది.

పైన పేర్కొన్న గజళ్ళన్నీ అద్భుత ప్రతీకలతో, అనూహ్యమైన ఇమేజనరీతో, అనన్య సామాన్యమైన భావుకత... సౌందర్యాత్మక కవితాత్మకత... తాత్వికతా తటిల్లత ఇత్యాది అలంకారాలతో గొప్ప పద సంపదతో కూడిన కడు కొత్త రచనా శిల్ప విన్యాసమే పాఠకులను మురిపిస్తుంది.

కనుక గజలంటే కేవలం పదాల కూర్పు చేర్పు పేర్పు కాదు... గజలంటే అదో అందమైన అచ్చరలాట. అగరు పొగ, వెన్నెల ధూపంలా అదో మోహనగా మోహనంగా మనసునల్లుకునే... మురువుగొలుపు మైకపు పాట.

" What can the schools do to defend democracy? Should they preach a specific political doctrine? I believe they should not. If they are able to teach young people to have a critical mind and a socially oriented attitude, they will have done all that is necessary. "

**- Albert Einstein**

# తెలుగు గజల్ - ప్రేమతత్త్వము

శ్రీమతి విజయలక్ష్మి కందిబండ
+1 925 487-6021

మానవ మనుగడకు మూలం ప్రేమ. జీవనలతకు "ప్రేమ" ఫలం వంటిది. ప్రకృతి ప్రేమ మయం. మానవుడు ప్రకృతిలో భాగం. మన కంటికి చూపును ప్రసాదించి వెలుగులోకి నడిపించే రవి కిరణం, దాహార్తిని తీర్చే నదీమతల్లులు, స్వేదం తుడిచి సేదదీర్చే చల్ల గాలులు, పరిమళాలు పంచి పరవశింపజేసే పూబాలలు, వెన్నెల పంచే జాబిలి. ఇలా ఎక్కడ చూసినా నిస్వార్థ ప్రేమ జాలువారుతూనే ఉంటుంది.

మానవ హృదయం కేవలం నాలుగు గదులున్న రక్తమాంసాల ముద్దకాదు. అందులో ఎక్కడో మనస్సు ఉంటుంది. అది ఇంద్రియగోచరం కాదు. అది శూన్యపాత్ర. మనం దానిని ప్రేమతో నింపాలి. నిజమైన ఆనందానికి హేతువు ప్రేమ. సకల రుగ్మతలకు దివ్యౌషధం ప్రేమ.

లౌకిక సుఖాలన్నింటికన్నా ప్రేమానుభూతి చాలా గొప్పది. ప్రేమ అంటే ఆకర్షణ కాదు. అందలేదని నలిపివేసేది కాదు. "ఎక్కడ ఉన్నా ఏమైనా నీ సుఖమేనే కోరుకున్నా" అంటూ ఎదుటివారు చల్లగా ఉండాలని కోరుకునేదే అసలైన ప్రేమ.

"వలపెరుంగక బ్రతికి కులికి మురిసేకంటే
వలచి విఫలమ్మొంది విలపింప మేలురా"

అంటారు బసవరాజు అప్పారావుగారు. ఇటువంటి ప్రేమతత్వమే నిండి ఉంటుంది తెలుగు గజళ్ళలో.

లలిత మనోహరమైన హృదయరంజకమైన, "గజల్" ప్రేమ ప్రకటనకు అనువైన కవితా ప్రక్రియ. నేడు సామాజికమైన అంశాలెన్నో గజల్ లో చోటుచేసుకున్నప్పటికీ, "ప్రేమ" దే అగ్రస్థానం.

గజల్ అనంతమైన ప్రేమకథ. గజల్ లోని ఈ ప్రేమ రెండురకాలు.

మానవుల మధ్య ప్రేమ, భక్తునికి భగవంతునితో ప్రేమ... ఈరెండింటిలో విరహమేగాని సంయోగం లేదు.

> వలపునై నీహృదయసీమల నిలువ వలెనని ఉన్నది! పిలుపునై నీ అధరవీధుల పలుకవలెనని ఉన్నది!

గజల్ ఒక అనంతమైన ప్రేమగాథ. "కథచెప్పేవాడు మధ్యలోనే విరమిస్తాడు కాని కథ మాత్రం కొనసాగుతూనే ఉంటుంది" అంటారు "ఉర్దూసాహిత్య సౌరభం" లో అల్లూరి వేంకట నరసింహ రాజుగారు.

ప్రేయసీ ప్రియులలో సాధారణంగా ప్రియునిదే గజల్ లోని స్వరం. ప్రేయసిపట్ల తన ప్రణయాన్ని ప్రకటించడమే గజల్. ప్రణయ మాధుర్యాన్ని ప్రియురాలికి చూపించడం కోసం ప్రయత్నం చేస్తూనే ఉంటాడు ప్రియుడు. అతని ప్రేయసి అపురూప లావణ్యవతి. ముగ్ధమనోహరి. ఆమె ఉలకదు. పలకదు. ఆమె క్రీగంటి చూపుకోసం యుగాలైనా నిరీక్షిస్తానంటాడు. గజల్ లో ప్రేయసి లేదా భగవంతుడు అలభ్య. అతనిది మధుర బాధ. ఆ ప్రేమకు అంతులేదు. స్వార్ధ చాయలంటని అమలిన ప్రేమ. ఇటువంటి ప్రేమతత్వాన్ని ప్రదర్శింప జేస్తూ, రచించిన తొలి తెలుగు గజల్ కవి డా.దాశరథి.

తొలి తెలుగు గజల్

"వలపునై నీహృదయసీమల నిలువ వలెనని ఉన్నది!
పిలుపునై నీ అధరవీధుల పలుకవలెనని ఉన్నది!
చైత్రమాస నవోదయమ్మున చల్లగాలికి ఆడుతూ..
పువ్వునై నీకొప్పులోనే నవ్వవలెనని ఉన్నది!"

ఈ గజల్ లో తన ప్రేయసి పట్ల గల ప్రేమను, అంతులేని తపనను మనోజ్ఞంగా, సుందర సుకుమారంగా, పూవు తాకినంత మెత్తగా వ్యక్తపరిచిన తీరు గమనించదగినది. ప్రేయసి హృదయంలో చోటు సంపాదించాలని, ఆమె పెదవులపై పిలుపుగా నిలవాలని అతని బలీయమైన కోరిక వ్యక్తమవుతోంది. షేర్ లో గమనిస్తే పువ్వునై ఆమె కొప్పులో నవ్వాలంటాడు. ప్రియుడు పూవుగా మారి ప్రేయసి కొప్పుపై చేరడం చదువరి మనసు ఊయలవుతుంది.

గజల్ పరదాపద్ధతి పాటింపబడే అరబ్బీ పార్సీ వాఙ్మయంలో పుట్టిపెరిగి, ఉర్దూలో ప్రవేశించి ఆ భాషకే గౌరవాన్ని తెచ్చిపెట్టిన ప్రక్రియ. గజల్ లో

అంగాంగ వర్ణనలకు స్థానం లేదు. శ్రీ దాశరథి గారు అదే సాంప్రదాయాన్ని పాటిస్తూ తెలుగులో గజల్ ను నడిపించారు.

"అంతుచిక్కని అందమంతా గంతులేసే రీతిగా...
చక్కనౌనీ బొమ్మనొక్కటి చెక్క వలెనని ఉన్నది!"

"అందం గంతులేయడం" అనే భావం చదవగానే పాఠకుని గుండె గొంతు ఈలలు వేస్తుంది. అనిర్వచనీయమైన ఆనందానుభూతికి లోనవుతారు పాఠకులు. ఆమె అపురూప లావణ్యాన్ని బొమ్మ చెక్కాలని ఉంది అంటారు." ఇక్కడ "ఆమెను" మరోదృష్టితో చూస్తే, ప్రతిప్రాణిలోను ఉండి బయటకు కనిపించని, ఎంత ప్రయత్నించినా అంతుచిక్కని ఆ భగవంతుని రూపం చెక్కాలి అనే తాత్విక దృష్టి కనిపిస్తుంది.

**ముగిసిపోయిన కాలమునకే పదును కలిగే రీతిగా నేను నీవై నిఖిల జగములు నిండ వలెనని ఉన్నది!**

అలాగే చివరి షేర్

ముగిసిపోయిన కాలమునకే పదును కలిగే రీతిగా
నేను నీవై నిఖిల జగములు నిండ వలెనని ఉన్నది!

నిశితంగా పరిశీలిస్తే, బ్రహ్మాండమంతా నిండి ఉండేది భగవంతుడు. "నేను నీవు కావడం" అంటే ఆ ఆరాధన, ఆప్రేయసి భగవంతుడు. అమ్మవారు. భగవంతునిలో లీనం కావడం. పై షేర్స్ లో లౌకిక మైన ప్రేమ కనిపించినా, ఈ షేర్ తో ఆయన అలౌకికమైన ప్రేమభావన అని అర్థమవుతుంది. దీనినే సూఫీ సంప్రదాయంలో "ఇష్క్–ఎ–హకీకీ" అంటారు.

మన తెలుగు సాహిత్యంలో ప్రబంధ కవుల, భావ కవుల ప్రేయసి వర్ణనలకు, గజల్ కవుల ప్రేయసి వర్ణనకు ఎంతో వ్యత్యాసం కనిపిస్తుంది.

"కడు హెచ్చు కొప్పు దానిన్
గడవన్ జనుదోయి హెచ్చు; కటియన్నిటికిన్
గడు హెచ్చు: హెచ్చు లన్నియు
నడుమే పసలేదుగాని నారీమణికిన్"

ఇది చేమకూర వేంకటకవి విజయ విలాసంలో స్త్రీ అంగాంగ వర్ణన.

తనపేరుమీదే
మనసుపడి
మారినది
గుండెసవ్వడి
కానిమాట కాదా
వలపుకున్న భక్తి
గొప్పదంటే

గజల్ లో ప్రేయసి పట్ల ఆరాధన, గౌరవం, శ్రుతి మించని శృంగార వర్ణన, ఆమెపట్ల గల సభ్యతా సంస్కారాలు ఎలా ప్రదర్శితం చేయాలో చూపించారు దాశరథి. ప్రక్రియా మూలాలు చెడకుండా ఉర్దూ గజల్ సంప్రదాయంలో తెలుగు గజల్ ను నడిపించి తరువాతి తరాల గజల్ కవులకు మార్గనిర్దేశనం చేశారు.

"భూమికి స్వర్గం దించడమేగా
ప్రేమించడమంటే!
ప్రేమశ్వాసగా బ్రతకడమేగా
జీవించడమంటే!"

ఇది రెంటాల వెంకటేశ్వరరావుగారి ప్రేమతత్వం.

స్వర్గమేదో ఉందని ఊహల్లో బ్రతకడం కంటే, ప్రేమతో జీవిస్తే ఈ భూతలమే స్వర్గమవుతుందంటారు.

షేర్

"తన పేరుమీదే మనసుపడి మారినది గుండెసవ్వడి...
కానిమాట కాదా వలపుకున్న భక్తి గొప్పదంటే"

గుండె ఆమె పేరుమీదే మనసుపడి ఆపేరు తన సొంతం చేసుకుందట. తన సహజమైన శబ్దాన్ని వదిలేసి ఆమె పేరును ఉచ్చరిస్తోందట. గుండె నిండిపోయిన ప్రేమకంటే భక్తి గొప్పదని అనగలమా? ప్రేమలో బ్రహ్మానందం పొందడం అంటే ఇదే.

కథ ముగిసినా ఆపాత్ర మనసును వీడనేలేదు!
సుడిగాలి లోనూ బాష్ప కుసుమం వాడనే లేదు!

డా:పెన్నా శివరామకృష్ణ గారి గజల్ లోని మత్లా. "కథముగిసిపోతున్నా" అనే మాటతో ప్రేమికుని చివరి మజిలీ వరకు ప్రేయసి నిరీక్షణ లోనే ఉన్నాడనే ధ్వని గోచరిస్తుంది. సుడిగాలి పద ప్రయోగంతో మృత్యుసమయంలో కూడా ఆమెకోసం తన కన్నుల తడి ఆరనేలేదనే భావం, ప్రియుని నిష్కల్మషమైన ప్రేమ, అంకితభావం దృశ్యమానమవుతుంది. చదువరుల గుండె పట్టేస్తుంది.

షేర్

హారతైన బతుకులోని ధన్యత ఎంతటిదో...
ఏ జడ కోరని రబ్బరు పువ్వులకేం తెలుసు!

ప్రేమకోసం ఆహుతైతే ఏమిటి ప్రేమానుభూతి పొంది తీరాలి. ప్రేమించు ప్రేమకై అంటారు. ఎంతటి ఉదాత్త ప్రేమ. ప్రేమ పరిమళం ఆస్వాదించని మనిషి ఏ జడ మెచ్చని రబ్బరు పూవు వంటివాడు. ఎంతటి గజలియత్ పండించారు ఈ మహాకవి.

ప్రియుని నిరీక్షణలో వేడి నిట్టూర్పులతో వెన్నెల వేడెక్కింది. చూపు కనిపించని నిప్పురవ్వ అనడంతో ఆమెను

గజల్ లో ప్రేమ తత్వాన్ని మెరిపించిన మరో కవి శ్రీ రసరాజుగారు.

షేర్

వెన్నెల్లో ఎంత వేడి ఊరేగిందో...
ఆమె చూపు కనిపించని నిప్పురవ్వ కాదా!

ప్రియుని నిరీక్షణలో వేడి నిట్టూర్పులతో వెన్నెల వేడెక్కింది. చూపు కనిపించని నిప్పురవ్వ అనడంతో ఆమెను చూసి ఆరాధించడమేకాని స్పర్శింప వీలులేదనే భావన కనిపిస్తుంది. గజల్ ప్రక్రియలో ప్రేయసిని కలుసుకోవడం ఉండదు. ఆమె రూపాన్ని ముద్రించుకొని విరహ మాధుర్యాన్ని అనుభవించడమే. విసుగు విరామం లేకుండా, నిందారోపణలు వేయకుండా, కోపంలేనీ తాపంతో నిరీక్షణలో జీవించడమే గజల్ ప్రత్యేకత.

శ్రీ తటపర్తి రాజగోపాలాచారి గజల్ లోని ప్రేమతత్వాన్ని చూద్దాం.

కనులముందు వెన్నెల వాన కనికరించి ఎన్నాళ్ళయిందో!
కనులలోని కలువలేమ కదలి వచ్చి ఎన్నాళ్ళయిందో!

వెన్నెలంత చల్లనైనా ప్రేయసి కనుల ముందే ఉన్నా కదిలి రాదు, కన్నెత్తి చూడదు. అది విరహ జ్వాల. మధురబాధ. పొందు కోసం ఆనందంగా ఎదురుచూస్తాడు, ఆరాటపడతాడు, తన విరహ బాధ ఆమెకు తెలిస్తే బావుండు అనుకుంటాడే కాని ఇసుమంత కోపం కూడ చూపించడు. తన ఆగ్రహానికి ఆమె నలిగిపోకూడదు అనుకుంటాడు.

మత్లా

మరణాన్ని సైతం పాట గానే పాడుకుంటాను!
నీ రాకకోసం వేయి జన్మలు వేచి ఉంటాను!

షేర్

సంధ్య వెలుగుల నీడలే నీ క్రీడలైతె అవ్వనీ..
నీ జాడ కోసం సృష్టినే వడబోసుకుంటాను!

ఇది శ్రీ సూరారం శంకర్ గారి గజల్.

జననమరణాల బెంగలేదనీ ప్రేమకోసం వేయి జన్మలైనా తపిస్తూనే ఉంటాననటం, ప్రియురాలు కనపడకుండా సంధ్య వెలుగులోని నీడలవలె ఆడుకుంటున్నా, ఆమె జాడ కొరకు సృష్టినే వడపోస్తాననడం, ప్రియుని ప్రేమలోని గాఢత, స్వచ్ఛత స్పష్టమవుతుంది. వీరి గజళ్ళలోని ప్రేమతత్త్వం మనోహరం.

డా:యం.బి.డి.శ్యామలగారి గజల్ లోని ఒక షేర్

"అడుగులోనూ అడుగు వేసి నడవకుంటె ఏమాయె..
అణువణువును తన కోవెల చేసెకదా నీ ప్రేమ!"

ప్రేయసిని పొందలేకపోతే ఏమి తనువులోని అణువణువు తానే ప్రతిష్ఠింపబడిన కోవెలనే చేసిందే ప్రేమ. ఒకానొక ప్రేమోన్మాదంలో ఊహామయ లోకంలో, ప్రేయసితో జరిపే ఏకపక్ష సంభాషణ గజల్.

శ్రీ అబ్దుల్ వాహెద్ గారి ఒక మత్లా

అద్దమెందుకు నిన్నుపొగిడే నేనులేనా ఇక్కడా!
మాటలెందుకు మనసు చదివే నేను లేనా ఇక్కడా!

నేనుండగా నీకు అద్దమెందుకు? నిన్ను ప్రతిబింబించే అద్దాన్ని నేనున్నాను. మాటలాడే శ్రమ ఎందుకు నీకు? నీ మనసు చదివిన నేనున్నానడం, ఆమెపట్ల గల అవ్యాజమైన ప్రేమ హృదయాలను తాకుతుంది

శ్రీ డా:పోతగాని సత్యనారాయణ గారి గజల్ లోని మత్లా చూద్దాం.

చూపుల భాషలు వింటూ నామది ముసిరిన శోకం మరచిపోయింది!
రూపున మెరుపులు తింటూ ఆకలి ఊహలలోకం నిండిపోయింది!

ప్రేయసి చూపుల భాషను వింటూ మనసు అప్పటివరకు ముసిరిన శోకాన్ని మర్చిపోవడం, రూపంలోని మెరుపులు తిన్న ఆకలి ఊహలలోకం నిండిపోయింది... ఇదే కదా ప్రేమ మహిమ.

శ్రీ కొరుప్రోలు మాధవరావు గారి షేర్

ప్రాణమధువు లొలుకుచున్న ప్రణయరాగ భామినీ!
ప్రణవనాద సుధలుచిందు తలపదెంత మధురమో!

ప్రాణ మధువులొలుకుచున్న ప్రణయరాగ భామిని, ప్రణవనాద సుధలు చిందుతోంది... ఆమె లోకమాత. ఆమె తలపు మధురం. వీరి గజల్ ప్రేయసి అనంత విశ్వాన్ని తనలో ఇముడ్చుకున్న ప్రేమమయి. బ్రహ్మాండనాయిక.

డా: గడ్డం శ్యామలగారి గజల్ లోని ప్రేమమూర్తి...

ప్రేమాలయ దీపముగా నీ మనసున నేనుంటా...
కఠినమైన హృదయములో స్పందననూ కోరుకుంటు!

దేవాలయం కాదు ప్రేమాలయంలో దీపంలా ప్రియుని మనసులో ఉండడం... అద్భుతమైన భావన. అలా ఉంటూ ఆ ప్రేమకాంతితో కఠినహృదయంలో స్పందన కలిగించడం. ఎంతటి ఉదాత్త భావన.

నీలోసగమై నీవే నేనుగా నిలిచేద్దామా ప్రేమికుడా!
నీవే రాగము నేనే గానము కలిసేద్దామా ప్రేమికుడా!

ప్రేమికులు ఆర్ధానారీశ్వరులవలె నిలవాలనీ... రాగమొకరై, గానమొకరుగా జీవించాలనడం అసలైన ప్రేమతత్వానికి నిదర్శనం.

శ్రీ ఆచార్య ముకుంద సుబ్రహ్మణ్య శర్మ గారి గజల్ లోని ఒక షేర్...

ఈ లోకమే పూదోటలా మారిందిలే నీప్రేమతో!
స్వప్నాలలో హేమంతమే పూసిందిలే నీ ప్రేమతో!

ప్రేమానుభూతి కలిగించే పరవశం ఎంత అందంగా చిత్రించారో కదా. – విజయలక్ష్మి కందిబండ

షేర్

ఏ స్వర్గము అందించును నీతలపుల ఆసుఖమును..
చిన్ని నువ్వు ఓపాన్పుగ విసిరిపోతే ఎలాగా!

ప్రేయసి తలపులలోని సుఖం స్వర్గంలో కూడా దొరకదట. ప్రేయసి విసిరిన నవ్వును పాన్పుగా చేసుకొని పరమానందాన్ని పొందుతూ మైమరచి పోతున్నాడు ప్రియుడు.

షేర్

విజయాలకేమిలే తనపాట చాలదూ..
విరహమే గీతమై ఎదనుండి జారేనే!

ఏ విజయంలో ఏముంది? తన పాట చాలు. ఆమె భౌతికంగా ఎక్కడ ఉన్నా--- హృదయమంతా తానై విరహగీతం పాడిస్తోందిగా--- విరహంలో కాగిపోతూ పరితపించడం, పరితాపంలోనే పరమానందం పొందడం గజల్ ప్రత్యేకత.

డా.సి.నారాయణరెడ్డిగారు సామాజిక పరమైన అంశాలతో అద్భుతమైన గజల్స్ వ్రాసి తెలుగు గజల్ విస్తృతి పెంచారు. అయినా వారు వ్రాసిన---

"అమ్మ ఒకవైపు దేవతలంతా ఒకవైపు
సరితూచమంటే నేను ఒరిగేను అమ్మ వైపు..."

అంటూ వ్రాసిన అమ్మ గజల్ చదువరులను ఉర్రూతలూగిస్తుంది. ఈవిధంగా పూవు వంటి సుకుమారమైన ఆరాధనీయమైన, అద్వితీయమైన ప్రేమతత్త్వం గజళ్ళ ప్రత్యేకత. ఎక్కడా ప్రేమ వ్యక్తీకరణలో అసభ్య పదజాలం కాని, స్త్రీ పట్ల చులకన భావం కాని లేని ఆరిపోని అమరమైన దివ్యప్రేమ వాహినియే గజల్.

(ఆధారిత గ్రంథాలు; శ్రీ.డా:పోతగాని సత్యనారాయణ గారి "తెలుగుగజళ్ళు ఒక అధ్యయనం",మరియు వ్యాసంలో పేర్కొన్న ప్రముఖగజల్ రచయితల గజల్ పుస్తకాలు")

# ప్రణయ గీతి

జ్యోత్స్న సుబ్బా 94914 60490

నా తీరని కలలాగే మిగులుతోంది నీవేగా..

తడికన్నుల కలతల్లో

నిండుతోంది నీవేగా..

నీ చూపే చదవనిదా.. మౌనంలో నా భాషను ..

మూగ మనసు భావాలను తడుముతోంది నీవేగా..

కనుపాపకు అలుపులేదు.. ఎదురు చూపు ఆపబోదు..

నిరీక్షణల భారాలను పెంచుతోంది నీవేగా..

శిథిలమైన నిన్నలలో ఏ జాడని వెతుకుతావు..??

నిర్దయగా చెలిమి కోట కూల్చుతోంది నీవేగా..

ఏనాటికి కొడిగట్టదు..మన ప్రణయం అనుకున్నా..

సుడిగాలై ప్రేమజ్యోతి ఆర్పుతోంది నీవేగా..

శిలనుకాను... వలపు నేను..నా తలపుకు శిలువేయకు..

జ్ఞాపకాల కత్తులతో గుచ్చుతోంది నీవేగా..

చితి మంటల వేడికి చలి

కాచుకోకు ఓజ్యోత్స్నా..

మౌనంతో మదిని కాల్చి నవ్వుతోంది నీవేగా..

# సినారె తెలుగు గజళ్ళలో సాహిత్యం

శ్రీమతి కుసుమ ఉప్పలపాటి
97050 09254

తెలుగు గజల్ అనగానే మొట్ట మొదట తలుపుకు వచ్చే పేరు డాక్టర్ దాశరధి కృష్ణమాచార్యులు. ఉర్దూ, ఫారసీ భాషలలో ప్రావీణ్యం గల వారు, ఫారసీ సాహితీ ప్రక్రియలైన రుబాయి, గజల్ రచనలను తెలుగువారికి పరిచయం చేశారు. గజల్ కు మాత్రా ఛందస్సుని నిబద్ధం చేసి ముఖ్య లక్షణాలైన కాఫీయా, రదీఫ్, మత్లా, మక్తా, షేర్ వంటి నియమాలతో ఉర్దూ గజల్ సంస్కృతి సంప్రదాయాలకు దగ్గరగా, తెలుగు గజల్ ను సమగ్ర స్వరూపంతో ఆవిర్భవింపజేసిన వారు దాశరథి.



ఆచార్య సి నారాయణరెడ్డి గారు ఆ తెలుగు గజల్ ను మరింత సౌష్టవంగా, అందంగా తీర్చి దిద్దారు. కేవలం శృంగార రసానికే కాకుండా, సామాజికాంశాలకు స్థానంచోటు కల్పించారు. సమాజంలోని అవకతవకలని, అసమానతలని ఎత్తి చూపటానికి గజల్ రచనను ఆయుధంగా వాడుకున్నారు. తన గజళ్ళ ద్వారా వేమనలాగా సంఘాన్ని సూటిగా, ధాటిగా ప్రశ్నించారు. తద్వారా సమాజ చైతన్యానికి తోడ్పడ్డారు. ప్రత్యేకంగా వీరి గజళ్ళలో ప్రబోధాత్మకతే కాకుండా, తెలుగుభాషా సౌందర్యాన్ని ఇనుమడింపజేసే వ్యాకరణ ఛందస్సులను, గజల్ సౌకుమార్యం, కోమలత్వం దెబ్బతినకుండా చొప్పించారు. 'విశ్వంభర'ని ప్రపంచానికందించిన చేతికి, 'ప్రపంచపదులు' సృజియించిన స్రష్టకి, 'కర్పూరవసంతరాయలు' ప్రేమ కావ్యాన్ని పండించిన పండితునికి, సుదీర్ఘ సినీ గేయ ప్రస్థానం సాగించిన పుంభావ సరస్వతికి, ఉర్దూ గజల్ తెలుగులో తీయగా, కమ్మగా వ్రాయటమొక

లెక్కా? యతి, గతి, లయ ఆ గజళ్ళలో అందంగా ఇమిడిపోయినాయి. అందుకనే సినారే గజళ్ళు గాన యోగ్య ప్రపూరితాలు. సంగీత పరిజ్ఞానం ఉన్న గాయక కవి కాబట్టి ఆయన గజళ్ళ విరుపులోని సొగసులు శ్రోతకు వీనుల విందు చేస్తాయి. తన సాహితీ యాత్రకు హరికథలు తొలి ప్రేరణగా మలచుకున్న కవి కాబట్టి, పద్య వ్యాకరణ ఛందస్సులు బాగా తెలిసినవారు కూడా కావటాన వారి గజళ్ళు వారి తరువాతి తరం వారికి మార్గదర్శకాలయినాయి. ఈ అన్ని కారణాలవల్ల సినారె గజళ్ళు తెలుగు గజల్ సాహిత్యంలో అత్యుత్తమ స్థాయిలో నిలిచినాయి.

**సినారె గజళ్ళలో వేమన, భర్తృహరిలాంటి ప్రసిద్ధ కవుల నీతి శతకాలలో చెప్పబడిన నీతులెన్నో అలవోకగా అమరిపోయాయి.**

సినారె గజళ్ళలో వేమన, భర్తృహరిలాంటి ప్రసిద్ధ కవుల నీతి శతకాలలో చెప్పబడిన నీతులెన్నో అలవోకగా అమరిపోయాయి. ముఖ్యంగా ప్రబోధాత్మకతతో కూడిన గజళ్ళలో ఈ లక్షణం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఆయన సంప్రదాయబద్ధమైన సులక్షణ పండితులు కాబట్టి, పూర్వకవుల ప్రభావం ఉండకపోదు. కాకపోతే సరికొత్త కోణంలో, చక్కటి భాషా చమత్కారాలంకారాలతో, ప్రత్యేకమైన పద్ధతిలో తన భావాలను వ్యక్తీకరించటం సినారే గజళ్ళ విశిష్టత. పదకోశం వారి నాలుకపైనే నర్తిస్తుంటుంది. భావసౌకుమార్యం, భాషపై సాధికారత, లయవిన్యాసం అన్నిటినీ తన గజళ్ళలో పండించిన ఘనులు సినారె.

"లోభుల కొలువున ఎన్నాళ్ళున్నా లోకువ బతుకేలే
చెమటగ రక్తం స్రవించినా నెల జీతం పుడుతుందా?" (సినారె గజళ్ళు)

సినారే గారి గజళ్ళలో అంతఃకరణ శుద్ధికి పెద్దపీట వేసారు. దానికి సంబంధించిన షేర్లు అనేకం కనిపిస్తాయి.

'ఆత్మశుద్ధి లేని ఆచార మదియేల?' అనే వేమన పద్యాన్ని పోలేటువంటి షేర్ –

"చిత్తశుద్ధి ఏ పాటిదో పరీక్షించే ఓపిక ఎవరికోయ్
ఊగుతున్నాయి తలలు జోరుగా బాగా ఉంది సుభాషితం"

"రాసి కొస్తుంది చిత్తశుద్ధితో చేసిన చిన్న పనైనా
పొద్దంతా వేదాంతరసం వడబోస్తూనే ఉన్నారా?" (సినారె గజళ్ళు)
వేమన శతకంలోని మరో పద్యాన్ని గుర్తుకు తెప్పించే షేరు–
"మేడిపండు చూడ మేలిమై యుండును.
పొట్టవిప్పి చూడ పురుగులుండు"
"నేనున్న నేటి సంఘం పైపైని మేలి వర్ణం
ఇక విప్ప నేలా ఇది మేడిపండు"

పైపైకి అందంగా కనిపించే సమాజం పొట్ట విప్పిచూస్తే మాత్రం అన్నీ పురుగులే. అనేక దురాచారాలతో, అసూయ, ద్వేషం, మోసం, వంచన, హింస, రాక్షసత్వంతో కుళ్ళిపోయి ఉన్న దుస్థితి అన్నది వారి భావన.

**ఒక రచన పదికాలాలపాటు చరిత్రలో నిలిచిపోవాలంటే ఆ రచనల్లో ప్రధానంగా భాషాపరమైన ప్రత్యేకతలుండాలి.**

సినారే గజళ్ళలో భాషా ప్రయోగాలు, జాతీయాలు, సామెతలు కొల్లలుగా కనబడుతాయి. మానవసహజమైన బలహీనతలను వ్యంగ్యంగా తన గజళ్ళలో ఎత్తి చూపారు. రాజకీయాలను సైతం వారు వదలలేదు. కలుషిత నాయకత్వంపై షేర్ల కొరడా ఝుళిపించారు. మతమౌఢ్యాలను ఎండకట్టారు. అలాగే మనిషిలోని నిరాసక్తతను, నిస్తేజాన్ని నిరసించారు. ఉల్లాసాన్ని, ఉత్తేజాన్ని గజళ్ళ ద్వారా పురికొల్పారు. ఉత్తమ సందేశాలతో ప్రబోధ పరిచారు. అందుకే ఆయన తన గజళ్ళను కేవలం ప్రేమ, శృంగార భావనలకు కాకుండా, సామాజిక అంశాలకు మాత్రమే పరిమితం చేసి ఆ ప్రయత్నంలో సంపూర్ణంగా సఫలీకృతులయ్యారు.

ఒక రచన పదికాలాలపాటు చరిత్రలో నిలిచిపోవాలంటే ఆ రచనల్లో ప్రధానంగా భాషాపరమైన ప్రత్యేకతలుండాలి. ఆ ప్రత్యేకతలనే జాతీయాలు, సామెతలు, లోకోక్తులుగా చెప్పవచ్చు. అందులో సిద్ధహస్తులైన సినారె తన తెలుగు గజళ్ళలో కొల్లలుగా వాటిని వాడి తన రచనలు అజరామరంగా చేసుకోగలిగారు. తెలుగు భాషా మధురిమలను తెలుగు గజల్ పాఠకులకు రుచి చూపించారు. సినారె గజళ్ళలో అడుగడుగునా షేరుకొక జాతీయము, లోకోక్తి, సామెత అందంగా మనలను పలకరిస్తాయి. 'చేతులు నలుపుకోవడం', 'నక్కతోలు కప్పుకోవడం', 'గోతులు తవ్వడం' లాంటి జాతీయాలు,

"ఏరుదాటినంక తెప్పతగలేసినట్లు", "తాతలు తాగిన నేతులకు మా మూతులు వాసన చూడమన్నట్లు" లాంటి సామెతలు వారి రచనల్లో కోకొల్లలు. తెలుగులకే సొంతమయిన 'ఏవోయ్' పదం, 'ఇంకేముందోయ్', ఏం లాభమోయ్' ఇలాంటి పలకరింపులు వారి రచనల్లోని తెలుగుదనాన్ని ఎత్తి చూపిస్తాయి. మెత్తని అధిక్షేపాన్ని, సున్నితమైన వ్యంగ్యాన్ని, మురిపించే చమత్కారాన్ని, ఇంపును, కుదింపును కలగలిపి ఏకధారగా కురిపించే రచనా చమత్కృతిని సినారే తన గజళ్ళలో సాధించారు.

> ఒక సమగ్రమైన భావంతో పాఠకుని హృదయానికి హత్తుకునేలా చక్కని రదీఫ్ ఎంచుకుని గజల్ నిర్మించటంలో నారాయణ రెడ్డి గారు సిద్ధహస్తులు.

ఛందో వ్యాకరణ ఛాందసాన్ని తన గజల్ కంటకుండా, ఉర్దూ గజల్ కుండే మార్దవాన్ని చెడనీకుండా, తెలుగుభాషా జిలుగులన్నీ యధోచితంగా వాడుకుంటూ, గజల్ పలికించటం వారి రచనల్లోని ప్రత్యేకత. కవిత్వధారలొలికిస్తూనే, వాడుకభాషలోని పడికట్టు పదాలను విరివిగా పలికిస్తూ, తెలుగు పాఠకుడి హృదయాన్ని చూరగొన్నారు సినారె.

ఒక సమగ్రమైన భావంతో పాఠకుని హృదయానికి హత్తుకునేలా చక్కని రదీఫ్ ఎంచుకుని గజల్ నిర్మించటంలో నారాయణ రెడ్డి గారు సిద్ధహస్తులు. వారి గజళ్ళన్నీ పటిష్టంగా, నిర్దుష్టంగా ఉంటాయి. ఒక మిశ్రాలోని భావాన్ని, మరో మిశ్రాలోని భావం సమర్థించటం గాని, వ్యతిరేకించటం గాని చేసేలా ఎత్తుగడలోనే పలికిస్తారు. వీరి గజళ్ళలో షేర్లు కనిష్టంగా ఐదు, గరిష్టంగా పదకొండు సంఖ్యలో ఉంటాయి. సినారే గజళ్ళ సంపుటిలో వీరు, వీరి తెలుగు గజల్ సంపుటిలోని గజళ్ళకు, సినారె గజళ్ళ సంపుటిలోని గజళ్ళకు ఉన్న తేడాని తెలియజేశారు. "నా గజల్ రచనా వ్యాసంగంలో 'తెలుగు గజళ్ళు' తొలిదశ. ఈ 'సినారే గజళ్ళు' మలిదశ. తొలి దశలో పల్లవి, చరణాల పద్ధతితో, అంత్యప్రాస నియమాన్ని పాటిస్తూ, కాఫీయా, రదీఫ్ ల విషయంలో స్వేచ్ఛను అనుసంధిస్తూ, గజళ్ళు ప్రయోగించాను. మలిదశలో ఉర్దూ గజల్ మౌలిక ధాతువులను అనుసరిస్తూనే, మత్లా మొదలుకొని మక్తా వరకు అన్ని పాదాలలోనూ మాత్ర సంఖ్యా సమత్వాన్ని పాటించాను. కాఫీయా స్వరూపంలో మాత్రం కొన్నిచోట్ల కాస్త స్వేచ్ఛను తీసుకున్నాను. నా ఇతర గేయ రచనల్లో ఉన్నట్టుగానే ఈ గజళ్ళలో కూడా చాలావరకు యతి నియమం ఉండటం గమనించదగ్గ అంశం". సినారే

తెలిపిన విధంగా వారి తొలి గజల్ సంపుటమైన తెలుగు గజళ్ళలో మాత్రా సంఖ్యా సమత్వం లోపించింది. రదీఫ్ లు, కాఫియాలను యధేచ్ఛగా వాడుకున్నది కూడా తెలుస్తుంది. వీరి రెండవ సంపుటినే సమగ్ర సలక్షణ గజల్ సంపుటిగా పరిగణించాలి.

చక్కని రదీఫ్ లతో ఇంపైన గజళ్ళు తయారుచేయడం సినారేకి వెన్నతో పెట్టిన విద్య.

సినారే గజళ్ళలో సామాజికాంశాలకు ప్రాధాన్యత నీయడంవలన వాటిలో వస్తు వైవిధ్యం ప్రస్ఫుటంగా కనబడుతుంది. గజల్ లో ఒకే వస్తువుకు సంబంధించిన విశేషాలన్నీ ఒకే గజల్లో రావాలనేటువంటి నిర్బంధం లేదు. ఒక గజల్లో అనేక రకాల వస్తువుల్ని గురించి కూడా రాయొచ్చు. వస్తు వైవిధ్యభరితమైన ఈ గజల్ చూస్తే ఆ విషయం మనకి తెలుస్తుంది.

"ఎదురుగా క్షీర సముద్రాలున్నా హృదయానికి దాహం
కరిగే తొలకరి మేఘాలున్నా గగనానికి దాహం
తీర్చిన సభలో తలలే అలలై తెగ ఊగేస్తున్నా
రసికత ఒలికే చెవిలేదేమని రాగానికి దాహం"

ఈ గజల్లో క్షీరసముద్రం – హృదయం, మేఘం – గగనం, సభ – రసికతగల చెవి – మొదలైనవి ఒకదానితో ఒకటి సంబంధం లేని అంశాలయినా, మూల సూత్రంగా దాహాన్ని గురించి చెప్పటంతో వేరు, వేరు వస్తు విశేషాలతో రచింపబడ్డ ఏక సూత్రతను కలిగిన గజల్ గా దీనిని చెప్పవచ్చు.

చక్కని రదీఫ్ లతో ఇంపైన గజళ్ళు తయారుచేయడం సినారేకి వెన్నతో పెట్టిన విద్య. జీవితంలో అన్నీ ఉన్నా ఇంకా ఏదో కావాలనుకునే మానవసహజమైన అసంతృప్తిని ఈ గజల్ లో చక్కగా వ్యక్తీకరించారు. కాఫీయాలను ఔచిత్యవంతంగా ఎంచుకొన్న విధానం కూడా ఈ రచనలో గమనించవచ్చు.

"ఎదురుగా క్షీర సముద్రాలున్నా హృదయానికి దాహం
కరిగే తొలకరి మేఘాలున్నా గగనానికి దాహం"

ఈ మత్లాలోని మొదటి మిశ్రా మానవులకూ, రెండవ మిశ్రా ప్రకృతికి అనుసంధిస్తూ రచించారు. గజల్లోని షేర్లన్నీ మానవీయ, ప్రాకృతిక భావాలతో ఏకాంతర విన్యాసాన్ని ప్రదర్శించడం గమనించొచ్చు. ఇది వారి గజల్ నిర్మాణ

చాతుర్యానికి నిదర్శనం.

సినారె గజళ్ళలో వస్తు వైవిధ్యం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. చైతన్యం, సామాజిక న్యాయం, తిరుగుబాటు, ప్రగతి శీలత, మానవీయత, విప్లవం వంటి అనేక వస్తువులు అందంగా, వైవిధ్య భరితంగా వారి రచనల్లో వ్యక్తీకరించబడతాయి. అలాగే స్వాభిమానం, ఆత్మవిశ్వాసం కూడా అనేక సందర్భాల్లో ప్రస్తావించబడుతుంది.

సమాజంలో జరుగుతున్న దౌర్జన్యాలను ఎండగట్టడానికి గజల్ ని ఆయుధంగా ఉపయోగించుకున్న ప్రయోగశీలి సినారే.

'కొత్త ఊపు తరగెత్తుతుంది శిరసెత్తి నడిస్తేనే
పీతలాగ ఉంటే పౌరుష జలపాతం పుడుతుందా?'

'స్వాభిమాన మమ్ముకున్న చవట తాను రుద్రుణ్ణని
కోతలు కోస్తే 'సినారె' క్రోధికి కోపం రాదా?'

'జూలు దులిపి మీసాలు దువ్వితే కాలానికి ఎగతాళిరోయ్
స్వాభిమాన సాధనలో ఉన్నది శౌర్యం చేసిన సంతకం' (సినారె గజళ్ళు)

సమస్యలకు తలవంచి తప్పుకుపోవద్దని, ధైర్యంగా ఎదుర్కోవాలనే సందేశం అందులో ఉంది. అలాగే ఏ చిన్న విషయాన్ని తేలిగ్గా తీసుకోకూడదని, జల్లు కదా అని అజాగ్రత్తగా ఉంటే అదే వెల్లువై ముంచేయవచ్చునని, స్వాభిమానాన్ని తాకట్టు పెట్టి పైపైకి రుద్రుడంతటి ప్రళయ భయంకరుడని దంబాలు పలికితే, ఎవరి గొయ్యివారు తీసుకున్నట్లే అవుతుందని అంటూ చాలా సందేశాత్మకమైన షేర్లు వారి రచనల్లో ఉంటాయి.

అలాగే శ్రమ జీవనం గురించి కూడా సినారే గారి గజళ్ళలో వారి అభ్యుదయభావాలకి దృష్టాంతాలుగా చూడవచ్చు.

'ఆసనాలపై తిష్ట వేసుకుని అక్రమ లాభాలుండగా
ముచ్చులు తవ్విన గోతిలో పడి మూల్గుతుంది కష్టార్జితం' (సినారె గజళ్ళు)

సమాజంలో జరుగుతున్న దౌర్జన్యాలను ఎండగట్టడానికి గజల్ ని ఆయుధంగా ఉపయోగించుకున్న ప్రయోగశీలి సినారే.

'చిరునవ్వులాంటి మనసుంటే నా శిరసు వంచుతాను
మోసం దాచిన ముఖముంటే ఆ ముసుగు చించుతాను' (సినారె గజళ్ళు)

ఇక్కడ తన ధిక్కారస్వరాన్ని వినిపిస్తున్నారు. అలాగే తిరుగుబాటుతనం

'ఎంత కాలమని చీకట్లను తాగేస్తుంటారోయ్ సినారే
ఎక్కిన మత్తు దిగాలంటే ఎరుపెక్కిన ఉదయం అవసరం'

సహనానికి కూడా హద్దుందనీ, తిరగబడాలనీ విప్లవ శంఖారావాన్ని పూరించారు. ప్రజల్ని చైతన్యవంతులుగా చేయటానికి, అన్యాయాలు, అరాచకాల పైన తిరగబడటానికి, ఆత్మస్థైర్యాన్ని కష్టజీవులకు నూరిపోయటానికి గజల్ సాధనంగా మల్చుకున్న అభ్యుదయ సాహిత్య ప్రయోగవాది సినారే.

ప్రత్యేకించి సినారే గజళ్ళలో మానవీయ దృక్పథం పాఠకుల్ని ఆకట్టుకుంటుంది. మానవత్వం అనేది ఒక మతం కాదు. అది ఒక దృక్పథం. సినారే ఏ ప్రక్రియలో కవిత్వం రాసినా మానవత్వాన్ని విధిగా పలికిస్తారు.

**అమ్మ అనే ఆత్మీయమైన, పవిత్రమైన వస్తువును తీసుకుని అద్భుతమైన గజల్ ని అందించారు సినారె.**

"చిందిన చెమటకు ఫలితం అందుకుంటే తృప్తి
ఎవరో పెంచిన పైరును ఎలా కోసుకోను?"

కష్టపడినందుకు తగిన ఫలితాన్ని అందుకున్నప్పుడు కలిగే తృప్తి ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తుంది. ఎవరో కష్టపడి సంపాదించిన సొమ్మును అక్రమంగా దోచుకోలేను అనే భావన వారి ఆత్మగౌరవ ఆదర్శాన్ని ప్రతిఫలిస్తుంది.

"స్వార్థం కోసం ఓయి సినారే స్వజాతి పరువును ఆరేస్తే
అంగడి లోపల కన్నతల్లినే అమ్మివేసినట్లుంటుంది"

కన్నతల్లిని అంగట్లో అమ్ముకోవటం అనే ఉపమానం మనిషి లోపల మానవత్వపు విలువలు అడుగంటి పోవటాన్ని ఆవేదనా భరితంగా తీవ్ర స్థాయిలో నిరసించడానికి చక్కటి ఉదాహరణ.

అమ్మ ప్రేమను అద్దంలో పట్టి చూపించినట్టు రాసిన ఈ గజల్ పరిశీలిస్తే –

"అమ్మ ఒకవైపు దేవతలంతా ఒక వైపు
సరితూచ మంటే నేను ఒరిగేను అమ్మవైపు"
"చీకటి చంద్రబింబంలా ఆకలికి పూర్ణ కుంభంలా"

అమ్మ అనే ఆత్మీయమైన, పవిత్రమైన వస్తువును తీసుకుని అద్భుతమైన

గజల్ ని అందించారు సినారె. నిర్మాణ పరంగా ఇది ఏకవస్తు గజల్. ఈ విధమైన గజళ్ళలో వస్తువు ఒక్కటే ఉంటుంది. తెలుగులో ఇలాంటి మూసల్ సల్ గజళ్ళకు ఆద్యుడు సినారే. అమ్మ అనురాగాన్ని, మమతాను బంధాన్ని ఎంతో అందంగా ఎత్తి చూపించారు ఈ గజల్లో సినారే.

> సినారే గజళ్ళలో కాఫీయా, రదీఫ్ లు ప్రయోగించే వాక్యాల్లో గణబద్ధమైన సమాంతరత, మాత్రా సమ విఘటనము కనిపిస్తాయి.

యతి, ప్రాసలు తెలుగు భాషకు, కవిత్వ రచనకు ప్రాణప్రదమైనవి. సినారే గజళ్ళు యతిప్రాసాలంకృతములై, తెలుగుభాషా వైశిష్ట్యానికి ప్రతీకలై అలరారుతుంటాయి. ఆయన రచించిన ప్రతి గజల్ షేర్లోనూ యతి ప్రాస, ప్రాస యతులలో ఏదో ఒకటి తప్పక ఉండి తీరుతుంది. కొన్ని షేర్లలో ప్రాసను పాటించి శబ్ద సౌందర్యాన్ని సాధించారు.

“చినుకు పడగానే ఉలిక్కిపడితే జీవితమెలా భరిస్తావు
నిత్యం బిగుసుకు చస్తూ ఉంటే మృత్యువు నెలా తరిస్తావు?”

యతిని పాటించే పద్ధతి గజల్ రచనా నియమం కాకున్నా, తెలుగు భాషా మధురిమలను శ్రోతకు అందించాలని, తెలుగుదనంతో గజల్ ని అలంకరించాలని ఆయన ఈ నియమాన్ని విధిగా పాటించటం వారి పాండిత్య ప్రకర్షకు నిదర్శనం.

“ముల్లు గుచ్చుకుంటుందని తెలిసే ముట్టుకున్నాను
పాము కాటువేస్తుందని తెలిసే పట్టుకున్నాను –

సినారే గజళ్ళలో కాఫీయా, రదీఫ్ లు ప్రయోగించే వాక్యాల్లో గణబద్ధమైన సమాంతరత, మాత్రా సమ విఘటనము కనిపిస్తాయి.

“ఎగర గలిగినన్ని ఎత్తులెన్నో చూశాను
ఎదుట పడని నక్క జిత్తులెన్నో చూశాను”.

అలాగే జంట కాఫియాలతో అలరారే ఈ గజల్ , శబ్ద సౌందర్యానికి మచ్చుతునక.

‘పలుకున్న కావ్యం అనంతం అనంతం
ప్రతిసారి నవ్యం వసంతం వసంతం

కాలానికి ఎదురీది కదలాడుతుంటే
కన్నీటి పయనం సుఖాంతం సుఖాంతం'

సినారె రచించిన ఈ గజల్లో కాఫీయా స్థానంలోనూ, రదీఫ్ స్థానంలోనూ జంట పదాలు వరుసగా ప్రయోగించబడ్డాయి. కనుక ఇది జంట కాఫీయాల గజలు అని పిలవబడుతున్నది. అనంతం– అనంతం, వసంతం– వసంతం, సుఖాంతం– సుఖాంతం, దిగంతం– దిగంతం అనే పూర్ణానుస్వరంతో అంతమయ్యే పదాలవల్ల గజళ్ళు గానశోభతో అలరిస్తాయి.

**ఈ గజల్లో సినారే ప్రాస పదాలతో శిల్పచాతుర్యాన్ని చవిచూపించారు.**

ఆదిప్రాసతో అలరారే గజల్ –

"ఏవో ఏవో బాధలు భరించే మూగ జీవితం
ఎన్నో ఎన్నో గీతలు ధరించే తెల్ల కాగితం"

ఈ గజల్లో సినారే ప్రాస పదాలతో శిల్పచాతుర్యాన్ని చవిచూపించారు. ప్రతి పాదంలో ఆది ప్రాసను, అంత్యప్రాసను ప్రయోగించి రచనా వైవిధ్యాన్ని సాధించారు. ఏవో ఏవో, ఎన్నో ఎన్నో అనే పదాలు అంత్య ప్రాసను పదావృత్తితో శబ్ద సౌందర్యాన్ని కలిగిస్తున్నవి.

కాఫియాను పునరావృత్తి పదాలతో ప్రయోగించడం వలన శబ్ద సౌందర్యం ఇనుమడిస్తుంది.

"నిన్ను చూచిన నా వదనం వెలిగి వెలిగి పోతున్నది
గుండెలలో నీ రూపం ఒదిగి ఒదిగి పోతున్నది"

షేర్ లోని రెండవ మిశ్రాలో రదీఫ్ కు ముందున్న పదాన్ని, మత్లాలోని రెండు మిస్రాలయందు రదీఫ్ ముందున్న పదాన్ని కాఫీయా అంటారు. ఇది అంత్యప్రాసను రూపొందిస్తుంది. ఈ గజల్లో రదీఫ్, 'పోతున్నది' అనే పదం. ఈ పదానికి ముందున్న పదాలను గమనిస్తే అవి పునరావృత్తమైన పదము యొక్క జంటగా గుర్తించగలుగుతాం.

తెలుగు గజల్ దశ, దిశ నిర్దేశం చేసిన వారు డాక్టర్ సి నారాయణ రెడ్డి గారు. తెలుగు గజల్ అన్నందుకు, గజల్ ప్రక్రియకి తెలుగు భాషా సౌందర్యం, భావ సౌకుమార్యం, తెలుగు నడక వంపు, వయ్యారాల అలంకారాలు అద్దారు. వారు చూపించిన వస్తు వైవిధ్యంతో తెలుగు గజల్ నూతన పోకడలతో కొత్త

పుంతలు తొక్కింది. సామాజిక అంశానికి ప్రాముఖ్యత ఇచ్చి గజల్ రచనకి ఒక సామాజిక ప్రయోజనాన్ని సాధించి, తెలుగు గజల్ కు ఒక ప్రత్యేక గౌరవాన్ని కలిగించారు. ఈ మధ్య ప్రముఖ గజల్ కవి రెంటాల వెంకటేశ్వరరావు గారు గజల్ సాహిత్యం మీద ఒక సభలో మాట్లాడుతూ, అందర్నీ మరింతగా ప్రభావితం చేసే కొత్త విషయాలతో అలరించారు. ఉర్దూ గజల్ నిర్మాణం జరిగే నాటికి ఉన్న కాల ప్రమాణాలు, వారి వస్తు నిబంధనలు, వారి భావ జాలాలు నేటి కాలానికి, మన తెలుగునాట జీవన పోకడలకి ఎంతో వ్యత్యాసముంది. కాబట్టి మారిన కాల ధర్మాలతో పాటు, మన గజల్ యొక్క వస్తువులను సంస్కరించుకోవలసిన ఆగత్యం ఉందన్నారు. మరింత నవ్యతను గజల్ నిర్మాణంలో ప్రతి రచయిత సాధిస్తూ, తెలుగు గజల్ ప్రక్రియను మరింతగా ముందుకు తీసుకెళ్ళాలని చెప్పారు. ఈ సందేశం అందరికీ ఆచరణీయం కావాలని నేను ఆశిస్తున్నాను.

Reference:

1) 'సినారె తెలుగు గజళ్ళ సంపుటి' – డాక్టరు సి. నారాయణరెడ్డి

2)తెలుగు గజళ్ళు ఒక అధ్యయనం – డా. పోతగాని సత్యనారాయణ,MA.,Ph.D

"Without that passion and urge, there is a gradual oozing out of hope and vitality, a settling down on lower levels of existence, a slow merging into non-existence. We become prisoners of the past and some part of its immobility sticks to us."

**- Jawaharlal Nehru, The Discovery of India**

# తెలుగు గజళ్ళలో సూఫీ తత్వం- మధుర భక్తి ఆత్మ పరవశం

శ్రీమతి విజయ గోలి
9704068022

ఏ సాహిత్య ప్రక్రియలైనా కవి మనో భావాలకు అనుగుణంగా అనుభూతులతో తమ రచనల్లో నూతన ప్రక్రియలకు శ్రీకారం చుడతాయి. జనాదరణ పొందిన ప్రక్రియలు కవుల కలాలతో నవ్యతను ఆపాదించుకుంటూ అనేక మలుపులు తిరుగుతూ... సరి కొత్త ప్రక్రియల ఆవిర్భావం జరుగుతుంది.

అరబిక్ సాహిత్య పరంపరగా అడుగు పెట్టిన గజల్... వివిధ ప్రపంచ భాషల్లోకి చొచ్చుకుని పోయింది. 7వ శతాబ్దంలోని ఖసీదా అనే అరబ్బీ జానపద సంస్కృతి గజల్ కు మూలం అని కూడా పరిశోధకులు తేల్చి చెప్పారు. 12వ శతాబ్దంలో మొగల్ చక్రవర్తుల ద్వారా దక్షిణ ఆసియా దేశాలలోకి ప్రవేశించిందని చరిత్ర.

“ఖసీదా అంటే శ్లాఘించటం, పొగడటం... అని అర్థం. ప్రభువులను శ్లాఘంచటంతో మొదలైన ఖసీదా... ప్రేమను, ప్రేయసిని, ప్రియుడిని పొగుడుతూ విలాప సల్లాపాలతో... ఎక్కువ వియోగ భారంలోని దుఃఖం నిండిన రచనలుగా ఉర్దూ గజల్ ముందుకు సాగింది. గజల్ సాహిత్యం ప్రేమకు ఒక ప్రత్యేకమైన సాహితీ ప్రక్రియగా మొగల్ ప్రభువుల తో పోషింప బడింది. “ప్రేమ ద్వారా పొందిన అనుభూతులు స్నేహం, ఆనందం, కోపం, విరహం వంటి అమలిన శృంగార భావాలకు పెద్ద పీఠం వేసారు గజల్ కవులు.”

ప్రసిద్ధ ఉర్దూగజల్ కవులుగా మొదటగా అమీర్ ఖుస్రో, గాలిబ్, ఇక్బాల్, మీర్ తక్ మీర్

మున్షీ ప్రేమ్ చంద్, ఫైజ్ అహ్మద్ ఫైజ్, గోపీచంద్ నారంగ్ మొదలగు వారు ప్రఖ్యాతి పొందారు.

గజల్ ప్రక్రియలో కూడా వివిధమైన మార్పులు చాలా జరిగాయి. ఆ ప్రక్రియల లోని మరో కోణం సూఫీ తత్వం. నిజానికి సూఫీ తరువాతే

గజల్. సూఫీ అంటే యోగత్వంగా, భౌతిక వాంఛలకు అతీతమైన ప్రేమగా నిర్వచించారు. భగవంతుడిని ప్రియుడుగానో, ప్రియురాలుగానో తలచి ఆధ్యాత్మిక... ఆరాధనగా అచంచలమైన భక్తితో చేసిన గానాలను సూఫీ తత్వం అన్నారు.

ఇస్లాంలో సూఫీ అనే పదానికి అర్థం ముతక వస్త్రం. ముతక వస్త్రం నిరాడంబరతకు చిహ్నంగా యోగులు ధరించేవారు. ఈ పదానికి శుభ్రత అనే అర్థం కూడా వుంది. అంటే మనో శుభ్రతగా మనం భావించాలి... ఇది మతపరమైన భావోద్వేగాలు ఉత్తేజితం చేయటానికి సూఫీ గురువులు ఒక సాధనగా గానం చేసేవారు.

ఇస్లాంలో సూఫీ అనే పదానికి అర్థం ముతక వస్త్రం. ముతక వస్త్రం నిరాడంబరతకు చిహ్నంగా యోగులు ధరించేవారు.

ప్రముఖంగా పర్షియన్ సూఫీ కవులుగా పేరొందిన జలాలుద్దీన్ మహమ్మద్ రూమి సర్మద్, అబూ సయీద్ అబూల్-ఖైర్, మొదలైన వారు. వీరంతా ఇస్లాం మత సూఫీలుగా (గురువులుగా,యోగులుగా) వున్నవారు. వీరు మొదటగా పద్య రూపంగా... సూఫీ కవిత్వాన్ని వ్రాసారు. ఆ తర్వాత చతుర్భుజాలు అనే 4 వరసలతో పర్షియన్ మాండలిక ప్రక్రియల్లో వ్రాసారు. ఇంకా కొందరు సూఫీ కవులు ఉర్దూలో రెండువరుసల షాయరీలు కూడా వ్రాసారు.

జలాల్ అద్-దిన్ ముహమ్మద్ రూమి 13 వ శతాబ్దపు పర్షియన్ కవి, మొదటి సూఫీ కవిగా రూమీ ప్రపంచ ప్రఖ్యాతి చెందారు. మొదటి సారిగా తన ఆధ్యాత్మిక ప్రేయసికి సూఫీ కవిత్వ ప్రక్రియలో కవిత వ్రాసినట్లుగా కాలం చెప్తుంది. పార్సీలో రూమీ వ్రాసిన కవితకు తెలుగు అనువాదం.

నీకు ఏదైనా కానుక నీయాలని
నేనెంత అన్వేషించానో నీకు తెలియదు.
సరైనదేదీ దొరకలేదు.
బంగారు గనికి బంగారాన్నీ,
జలనిధికి నీటినీ కాన్కలుగా ఈయటం
ఏం బాగుంటుంది.
అన్నీ అలానే అన్పించాయి.
నా హృదయాన్నో, ఆత్మనో ఇవ్వాలనుకోవటం

ఉచితం కాదు, ఎందుకంటే
అవి ఇప్పటికే నీకు సమర్పించేసాను.
అందుకే, ఒక దర్పణాన్ని తీసుకొచ్చాను.
దానిలో నిన్ను చూసుకొని
నన్ను గుర్తుచేసుకో. రూమీ – "ది ఎస్సెన్సియల్ రూమి"

రూమీ, హాఫీజ్, మరియు సాజిద్ లను ప్రసిద్ధి చెందిన సూఫీ కవులుగా గుర్తించారు.

సూఫీ కవి అన్ని చోట్ల అన్ని వస్తువులలో తన ప్రియమైన వ్యక్తిని మాత్రమే చూస్తాడు. నిజానికి విశ్వాన్ని తన దృష్టితోనే చూస్తాడు. భౌతిక ప్రపంచం నుండి విడిపోయిన విశాల భావనలో తేలియాడుతూ వుంటాడు.

"పరమానందమనే దివ్యానుభూతి మత్తులో జోగుతూ వుంటాడు. ప్రపంచం నుండి విడివడి తను ఆరాధించే ప్రియతములతో సయోగ వియోగాల అనుభూతిలో జీవనం సాగిస్తూ వుంటారు. కరుణ రసం నింపుకున్న గాధలుగా సూఫీలు తమ కవిత్వాన్ని గానం చేయటానికి ఎక్కువగా ఇష్ట పడతారు. సూఫీ తత్వాన్ని ప్రేమ మతంగా నిర్ణయించవచ్చు. సూఫీ తత్వం ఇస్లాం మత తత్వంలో భాగమయినా... భారతీయ ఆధ్యాత్మిక మూలాలు వున్నట్లుగా గుర్తించారు.

రూమీ, హాఫీజ్, మరియు సాజిద్ లను ప్రసిద్ధి చెందిన సూఫీ కవులుగా గుర్తించారు. అలా మొదలయిన సూఫీ కవిత్వం... భక్తి మిళితమైన పవిత్ర ప్రేమ భావంగా రూపు దిద్దుకుని 13,14 శతాబ్దాలలో భారత భూభాగం లోకి ప్రవేశించింది.

ప్రముఖంగా ప్రఖ్యాత ఉర్దూ, పర్షియన్ కవిగా మొగల్ చక్రవర్తుల అపార ఆదరణను చూరగొన్న మహాకవిగా మీర్జా గాలిబ్ పేరు ప్రపంచ విదితం. ఒక్క గజల్ కవిగానే కాక

కవితలు, షాయరీలు, సూఫీ, తాత్విక, లేఖా సాహిత్యం మొదలైన అనేక సాహిత్య ప్రక్రియల్లో నిష్ణాతుడైన సుప్రసిద్ధ కవి. గాలిబ్ వ్రాసిన పద్యాలను... మొట్టమొదటి తొలి గజల్ కవి శ్రీ దాశరధి కృష్ణమాచార్యులు తెలుగు లోనికి "గాలిబ్ గీతాలను పేరిట అనువదించారు. ఒకసారి పరికిద్దాము.

"వలపు లేనాటికి నిష్ఫలము కావు, కాయ గాయని వృక్షమ్ము కాదు వలపు."

కాయలుకాసి పండ్లనివ్వనిచెట్లు ఎలావ్యర్థమో, అలాగే ప్రేమించని హృదయంకూడా వ్యర్థమేనంటున్నాడు గాలిబ్.

నిప్పు నీళ్లలో చల్లార చప్పుడగును,

ఎదియు గతియించునపుడు రోదించుగాదె!

మనసుకు హత్తుకు పోయే ద్విపదలు ఎంతో అర్థవంతంగా అనువదించి తెలుగు ప్రజలకందించారు. మరొక ప్రఖ్యాత గజల్ ఉర్దూ కవి... అమీర్ ఖుస్రూ... ఇతని పేరు తెలియని గజల్ కవి వుండరు. ఇతను భారత దేశానికి చెందిన ఇస్లాం కవి మాత్రమే కాదు. మరుగవుతున్న హిందుస్థానీ సంగీతానికి జీవం పోసారని చెప్తారు. చిత్రకారుడు, అనేక సంగీత వాయిద్యాలపై పట్టు కలిగిన విద్వాంసుడు, ఖవ్వాలీ ప్రక్రియను ఆవిష్కరించింది అమీర్ ఖుస్రూ. గజల్ లో సూఫీ ప్రక్రియకు ఆద్యుడు కూడా... అనేక భాషల్లో వివిధమైన సాహిత్య ప్రక్రియల్లో నిష్ణాతుడిగా ప్రపంచ గుర్తింపు పొందారు. భారత దేశంలో గజల్ విస్తరణలో అతనిది ప్రముఖ పాత్రగా చరిత్రలో నిలిచారు.

**భారత దేశంలో గజల్ విస్తరణలో అమీర్ ఖుస్రూ ది ప్రముఖ పాత్రగా చరిత్రలో నిలిచారు.**

సూఫీ గజల్ లో షేర్లు...

“కాశిషే కే ఇష్క్ దారద్ నా గుజరాతద్ బాడిన్సాన్ బ–జనాజా గర్ నీయాయి బా–మజార్ ఖ్వాహి ఆమద్”

ప్రేమ యొక్క మంత్రముగ్ధత నిన్ను ఈ విధంగా కదిలించదు. నా అంత్యక్రియలకు, నువ్వు రాకపోతే, నా సమాధి వద్దకు, ఖచ్చితంగా నువ్వు వస్తావు. నిజానికి ఇది చాలా చిన్న విషయంగా కనిపించవచ్చు. కానీ ప్రేమికుడు మరణానికి ముందు తన ప్రియమైన వ్యక్తిని కలవలేదనే వాస్తవాన్ని సంతోషంగా అంగీకరిస్తున్నట్లు అనిపిస్తుంది. ఆమె తన సమాధిని సందర్శించడానికి అతను సంతోషంగా ఎదురు చూస్తున్నాడు. ఇది సత్యం పట్ల ప్రేమ. వాస్తవికత; వ్యక్తిగత అవగాహనల పై నమ్మకం.

సూఫీ కవిత్వంలో, ఈ ఇష్క్–ఎ–హకీకీని ఇష్క్–ఎ–మజాజి ద్వారా వ్యక్తీకరించడం చాలా సాధారణం. అమీర్ ఖుస్రో రచనల్లో ఇలాంటి మర్మ గర్భితమైన విశ్లేషణలు చాలా వుంటాయి.

ఆత్మ పరమాత్మలో లీనమై ఆనందపు శిఖరాలపై అధిరోహించడాన్ని

సూఫీతత్వం అనొచ్చు. దైవికమైన ప్రేమ భావనతో భగవంతుని ధ్యానంలో మునిగి తేలటమే సూఫీ తత్వం.

ప్రకృతినో, తమ భావనా రూపాన్నో... తమ ప్రియతములుగా తలచి అలౌకికమైన భక్తి పారవశ్యంతో రచించే ఈ గజళ్ళను ఉర్దూ కవులు "ఇష్క్-ఎ-హాకీకి" గజళ్ళుగా, లౌకిక పరమైన ప్రేమ గజళ్ళను "ఇష్క్ -ఎ-మజాజీ " గజళ్ళు గా అభివర్ణించారు. హిందూ మతంలో తెలుగు గజళ్ళలో సూఫీ కవిత్వాన్ని "మధుర భక్తి " గా అభివర్ణించారు.

**భక్త మీరాబాయి రచించి గానం చేసిన భజనలు ఇష్క్-ఎ-హాకీకి గా పేర్కొనబడ్డాయి.**

ఉత్తర భారతంలో మహా భక్తులైన తులసీ దాస్, కబీర్ దాస్ రచించిన దోహాలు, తుకారాం రచించిన అభంగాలు... ఇవన్నీ కూడా సూఫీ కవిత్వం కోవకు చెందినవే. భక్త మీరాబాయి రచించి గానం చేసిన భజనలు ఇష్క్-ఎ-హాకీకి గా పేర్కొనబడ్డాయి. మీరా బాయి శ్రీకృష్ణుడిని ప్రేమతో భక్తితో ఆరాధించడం, అతనినే తన భర్తగా తలిచి సంకీర్తన చేస్తూ సంచరించటం, ఆడి పాడి పరమాత్ముని సన్నిధిని అనుభూతి చెందుతూ తరువాత పరంధామునిలో ఐక్యమవటం మనకు తెలిసిన విషయమే. ఆ పరవశంతో పాడుకున్న భజనలన్నీ సూఫీలే. మరాఠీలో ఆమె భజనలన్నీ ప్రపంచ విదితమే. తర్వాత కవులు ఆమె భజనలను అన్ని భాషల్లోకి అనువదించారు.

ఉదా...

प्रभु जी तुम दर्शन बिन मोय घड़ी चैन नहीं आवड़े ।टेक।

अन्न नहीं भावे नींद न आवे विरह सतावे मोय।

घायल ज्यूं घूमूं खड़ी रे म्हारो दर्द न जाने कोय।1।

నిను చూడక శాంతి లేదు ఒక్క క్షణం

నిను కానక తిన లేను... మనలేను... రేయైనా నిదుర రాదు

ఎదనిండిన గాయంతో... ఎడబాటున నిలిచాను

తెలియలేరు నా వేదన వేరెవరూ... కనరావా ప్రభూ!! (విజయ గోలి)

సూఫీ కవిత్వమే ఒక మధుర మైన వేదనగా... స్ఫురిస్తుంది. దక్షిణ భారతదేశంలో కూడా సూఫీ మూలాలు ఉన్నట్లుగా తెలుస్తుంది. జయదేవుడు, అన్నమయ్య, క్షేత్రయ్య, త్యాగరాజు మొదలగు మహా భక్తులందరూ సూఫీ తత్వానికి చెందిన వారుగానే చరిత్ర చెప్తుంది.

లౌకికమైన గజళ్ళు ... భౌతికమైన ప్రేమ నుండి పొందిన సల్లాప, విలాపాల అనుభూతులుగా రచించబడ్డాయి. అలౌకికమైన గజళ్ళను రెండు భాగాలుగా విభజించ బడ్డాయి. భక్తి గజళ్ళు , మధురభక్తి గజళ్లు (సూఫీ గజళ్ళు )

నిజంగా చెప్పాలంటే తెలుగు గజళ్ళ ప్రస్థానం జరిగి 60 సంవత్సరాల కాలంలో...

ప్రియుడు పరమాత్మగా ప్రియురాలు జీవాత్మగా ఒకరిలో ఒకరు లీనమవటమే సూఫీతత్వానికి పరాకాష్ట. సూఫీలో కనిపించే నిగూఢ సత్యం ఇదే ... మధుర ప్రేమ మాధ్యమికంగా జరిగే విశ్వ సౌభ్రాతృత్వంగ చెప్పుకోవచ్చు. సూఫీ తత్వం మత పరిధి దాటి విశ్వ చైతన్యంతో భగవత్ తత్వాన్ని నింపుకున్న ఒక మధుర భక్తి సాధన.

"మధుర భక్తి అంటే ఆరాధనతో కూడిన అర్పణ"
"భక్తి అంటే విశ్వాసంతో కూడిన అర్చన"

మీరా బాయి, రాధ భగవంతుడైన కృష్ణుడినే ప్రియుడిగా ప్రేమించారు, ఆరాధించారు. భగవంతుడిగా అర్చించారు. తమ ఊసులో, ఊహలో. శ్వాశలో, ధ్యాసలో మురళీ మోహనుకి జీవితాలను అర్పణ జేసి పరంధామునిలో లీనమై కైవల్యం పొందారు. అందుకే మీరా భజనలను, జయదేవుని అష్ట పదులు, రాధా మాధవుని అనురాగ బంధాన్ని మధుర భక్తిగా నిర్వచించారు. ఆవిధమైన ప్రేమ పారవశ్యంలో వారు గానం చేసిన భక్తి సాహిత్యాన్ని మధుర భక్తి (సూఫీ తత్వం) గీతాలుగ మన్నన పొందాయి. వారి సాహిత్యాలను స్ఫూర్తిగా అలౌకికమైన అమలిన ప్రేమ తత్వంతో విశాల భావనతో గజల్ ప్రక్రియలో వ్రాసిన తెలుగు గజళ్ళను మధుర భక్తి గజళ్ళుగా చెప్పుకుంటున్నాము.

నిజంగా చెప్పాలంటే తెలుగు గజళ్ళ ప్రస్థానం జరిగి 60 సంవత్సరాల కాలంలో... (మధురభక్తి) సూఫీ గజల్స్ వ్రాసిన వారు చాలా తక్కువగానే చెప్పుకోవచ్చు. వారిలో కీర్తి పురస్కార గ్రహీత ప్రఖ్యాత గజల్ కవులు శ్రీ సురారం

శంకర్ గారు తమ "సౌగంధిక "తెలుగు గజళ్ల సంపుటి లో వ్రాసిన సూఫీ గజల్... ఉదా–:

"ఒక చూపు వేల పున్నమలు ఎలా నిన్ను చూసేది
ఒకే పాట వేల భావనలు ఎలా నిన్ను పాడేది"
"జీవితాశ నిండా నీవే జీవయాత్ర నిండా నీవే
ఒకే తలపు వేల స్పందనలు ఎలా నిన్ను కొలిచేది"

అణువు అణువు నిండిన ఆరాధనతో వేల కాంతులు నింపుకున్న నిన్ను నాకున్న ఒక్క చూపుతో ఎలా చూడను... నా జీవనమే నీవన్న ఒకే ఒక్క తలపులో వున్న నేను వేల స్పందనలతో నిన్ను ఎలా కొలువను... సర్వస్వం అర్పణలో నీవు తప్ప వేరేది లేదను అమర భావన...

వర్షం మంటే ఇష్టం... ఎందుకంటే ప్రతి చినుకులో ప్రియురాలి స్వప్నం వుందట!

ఇంకొక షేర్...

"ప్రతి చినుకులో నీ స్వప్నమున్నది వర్షమంటే నాకు ప్రాణం
ప్రతి శ్వాసలో నీ పిలుపులున్నవి గానమంటే నాకు ప్రాణం"

"ఎడదలో కొలువున్న చెలియా ఎటు చూసినా నీవేగా
ప్రతి అణువులో నీ రూపమున్నది లోకమంటే నాకు ప్రాణం"

గజల్ లోని కవి చమత్కారం...

వర్షం మంటే ఇష్టం... ఎందుకంటే ప్రతి చినుకులో ప్రియురాలి స్వప్నం వుందట! నా శ్వాసలో నీ పిలుపుంది... అది పాట లాగ వుంది. అందుకే పాటలంటే ఇష్టం. అంతటా నీవను భావనతో పరమాత్మానుభూతి చెందుతున్నాడు కవి. ఇలాంటి భావనను సూఫీలో... "హమ్ ఊస్త్" అంటారు. అంతా నీవే అను ఉదాత్తమైన భావన.

మొదటిసారిగా మధుర భక్తి గజళ్ళను పుస్తక రూపంలో తెచ్చిన వారు విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ అధ్యక్షురాలు ప్రముఖ గజల్ రచయిత్రి శ్రీమతి విజయ లక్ష్మీ పండిట్ గారు విశ్వ పుత్రిక కలం పేరుతో రచించిన యోగరేఖలు తెలుగు గజళ్ళ సంపుటి. పలువురు ప్రముఖ గజల్ కవులు "యోగరేఖను మధురభక్తి కవిత్వంగా (సూఫీ) ప్రస్తుతించారు. ఏకత్వం అన్నది విశ్వ ప్రేమ

సందేశంగా ఉన్న గజల్ లో ఒక మత్లా...

"హృదయ ప్రణయ సీమలో విహరిద్దాం రా ప్రభూ...
ఆ అద్వైత సంగమ సీమలో పయనిద్దాం రా ప్రభూ"

అద్భుతమైన భక్తి ప్రణయ భావం.

"కడలి గర్భాన దాగిన పగడంలా విశ్వపుత్రికను
నీ హృదయ గర్భాన జ్యోతిగా దాగి పోనీ"

అచంచలమైన భక్తి నివేదన.

ఆ తర్వాత "పిల్లన గ్రోవి" అనే పేరుతో రాధా మాధవ రాగశృతి... పరమాత్ముడైన మాధవుని ప్రేమ కొరకు రాధ చెందే ఆవేదన ప్రధానాంశంగా తెలుగు మధుర భక్తి భావనతో నేను (విజయ గోలి) వ్రాసిన తెలుగు గజళ్ళ సంపుటి. అందులో 50 గజళ్ళు... రాధికా ప్రణయమే.

ప్రముఖులైన గజల్ కవులు చక్కటి సమీక్షలు చేసారు. ఒకే అంశంపై ఇన్ని గజళ్ళు రాయటాన్ని ఇష్క్–ఎ–హాకీకి గా (అలౌకిక ప్రేమ) గా ప్రసంశించారు.

"పిల్లన గ్రోవి" గజళ్ళ లోని కొన్ని షేర్లు ...

"పొంగి పోవు నీ ప్రేమల ప్రాణమిడిచి పోవాలని ఉన్నదిలె/తీరమెంక చూపులేల నే మునిగిన సాగరాలె నీవైతే"

నేను మునుగుతున్న ప్రేమ సాగరం నీవే కదా... తీరం వైపు నాచూపు వెళ్ళదు. అద్వితీయమైన ఆరాధనతో ఆత్మ నివేదన ... అనంతమైన అర్పణ అనుభూతి భావన.

"పెదవుల పై నీ నామమె పల్లవించు ప్రణవముగా/విశ్వమంత నీ రూపమె అగుపించెను మధురముగా"

ఓంకారం గా నా పెదవులపై ఎప్పుడు నీ నామమే... ఎటు చూసినా నీ రూపమే. మధురమైన ప్రేమ పారవశ్యం.

"ఎదురు చూపు చూచు వేళ ఎదుట పడవు న్యాయమా
మనసు పడిన వేళలలో మాటాడవు న్యాయమా"

"ఏరులైన కన్నీటిలో కలువనైతి నిను కోరి
కంటి కొసన కరుణ తోడ నను కానవు న్యాయమా"

"శిలగానే మారినావా శిల్పి నీవు కాలేవా
పలుమారులు వేడిననూ పలుకాడవు న్యాయమా"

వేదనా భరితమైన వియోగం... మధుర భక్తిలో... మనసు కరిగించే అనుభూతి సూఫీ కవిత్వంలో వియోగానికి, వేదనకు, కరుణకు ప్రాముఖ్యత ఇచ్చారు... ప్రముఖ గజల్ కవయిత్రి శ్రీమతి జంధ్యాల ఉమాదేవి గారు వ్రాసిన

**సూఫీ గజల్ మత్లా-:**

"ఇంతపెద్ద లోకంలో నాలోకం నువ్వేలే
పిడికెడంత గుండెలోన సందోహం నువ్వేలే"

సర్వము తానైన అనుభూతిలో... ఆలాపన... అనన్యమైన అనురాగ భావన.

ప్రఖ్యాత గజల్ కవయిత్రి శ్రీమతి గడ్డం శ్యామల గారి "హేమంత తుషారాలు" లోని ఒక గజల్ లో షేర్

"గాలి నన్ను తాక గానె వెతికినాను నీకోసం
పూలు నన్ను పలుకరించ నిలిచినాను నీకోసం"

ప్రకృతినే ప్రియతమగా భావిస్తూ గాలిలో, పూలలో వెదుకులాడుటనే ఒక మధురమైన

పరవశం మనోహరం.

పైన ఉదహరించిన వన్నీ మనసును తడిమే మధురభక్తి (సూఫీ) తెలుగు గజళ్ళు.

**తెలుగు భక్తి గజళ్ళు -:**

భక్తి అనేది ఏమతంలో అయినా సర్వ సాధారణం. మనిషి భౌతిక మైన కర్మల నుండి సేద తీరటం కొరకు భగవంతుడితో ఏర్పరుచుకున్న ఒకఆలంబన, ఒక సాంత్వన, విశ్వాసం.

మన హిందూ మతంలో భగవద్గీతలో భక్తియోగమనే ఒక అధ్యాయమే వుంది. ప్రతిఒక్కరికీ ఒక్కో దైవంపై విశ్వాసం. వారి వారి ఇష్టమైన పద్ధతిలో సేవించుకుంటారు. అర్చన, ఆరాధన, గానం... ఎన్నో రకాలుగా అర్చిస్తారు. అందులో గానం ఒకటి. ఎంతో మంది వాగ్గేయ కారులు తమ భక్తిని కీర్తనలుగా పాటలుగా పాడి పరమాత్ముడిని అర్చించుకున్నారు.

సి .నారాయణ రెడ్డి గారు... గజల్ ను ప్రేమతత్వం నుండి సామాజిక అంశాలపైకి మరల్చారు. నేటి తరం గజల్ కవులు. ఇంకొక అడుగు ముందుకు వేసి గజల్ కు కాదేదీ అనర్హం అన్నట్లుగా వారి వారి ఇష్ట దైవాలపై భక్తి గజళ్ళు వ్రాసి పుస్తకాలు కూడా ముద్రించారు. అలా భక్తి గజళ్ళు వ్రాసిన వారు చాలా మంది వున్నారు. వారిలో ఈ మధ్య కాలంలో... ప్రముఖ గజల్ రచయిత, కవి ద్యావరి నరేంద్ర రెడ్డి గారు వ్రాసిన శ్రీ వెంకటేశం, శ్రీ లక్ష్మి నారసింహం అనే తెలుగు భక్తి గజళ్ళ పుస్తకాలు ప్రాశస్త్యం పొందాయి.

అవగాహన కొరకు భక్తి గజల్ లోని రెండు షేర్లు...

"భక్తి తో మాయనే విడుచుకో హృదయమా
శ్రీవారి చూపునే నిలుపుకో హృదయమా"

"మాయలన్ని విడుతుంటే మనసు నాది వెలుగు తుంది
నరసింహుని కోవెలలో ప్రకాశాలు ఎన్నెన్నో"

విశ్వసించిన ఇష్టదైవానికి భక్తి నివేదనగా... ఈ భక్తి గజళ్ళను చెప్పుకోవచ్చు.

60 సంవత్సరాలుగా ఇప్పటి వరకు తెలుగు గజళ్ళలో మధుర భక్తి (సూఫీ) నడక ఇది. హృదయాంతరాళాల్లో అతీత మైన ప్రేమానుభూతుల పారవశ్యంలో ఒకరికొకరు వేరుగాని అర్పణ భావంలో పెల్లుబికిన ప్రేమ భక్తి సాహిత్యాన్ని గజల్ గా గానం చేయటమే తెలుగులో మధుర భక్తి తత్వంగా బలపడినది.

# విరహం

సత్య స్వరాళి 87907 00383

తను తిరిగొస్తాడేమో... గుండె తలుపు తీసి ఉంచు
కనురెప్పను మూయెుద్దని... ఈ రాత్రికి చెప్పి ఉంచు...

రాసుకున్న చివరి కవిత ఎద భారం పెంచుతోంది
తన ఊహను మోయలేను కడ ప్రాణం నిలిపి ఉంచు...

మనసు మారి తానొస్తే నీ హృదయం చదవద్దూ... ?
సమాధిపై తనకోసం ప్రేమలేఖ రాసి ఉంచు....

పొరపాటున ఎప్పుడైనా ఇటువైపుకు రాకపోడు
చిరుగాలికి నీ ఊపిరి గంధాలను పూసి ఉంచు...

గాయపడిన గుండె పాట వినిపించదు నీకిప్పుడు...
కడసారిగ వీడ్కోలు కి కఫన్ కాస్త తీసి ఉంచు...

# తెలుగు గజళ్ళు... ప్రగతిశీల భావాలు

శ్రీ టి. అనిల్ కుమార్
9948470211

తెలుగు సాహిత్యంలో నేడు విరివిగా వస్తున్న ప్రక్రియలలో ప్రథమ స్థానంలో గజల్ సాహిత్యం ఉందని చెప్పడంలో సందేహం లేదు. గజల్ ప్రక్రియలో అరబ్బీ భాష మూలభాషగా తీసుకుంటారు. అరబ్బీ నుంచి ఫారసీలోకి, ఫారసీ నుండి ఉర్దూలోకి ఉర్దూ నుంచి తెలుగులోకి గజల్ ప్రక్రియ వచ్చింది. గజల్ ప్రక్రియను మొదటగా దాశరథి కృష్ణమాచార్యులు తెలుగు సాహిత్యానికి పరిచయం చేశారు. సినారే గారు గజల్స్ ను సొంతంగా రాస్తూ, పాడుతూ గజల్ ప్రక్రియను ఒక తారాస్థాయికి తీసుకువచ్చారు. 9 వ శతాబ్దంలో అరబ్బీలో ప్రారంభమైన ప్రక్రియ నేటికి విరాజిల్లుతుంది.

గజల్ లోని రెండు పాదాలను కలిపి షేర్ అంటారు. షేర్ లోని మొదటి పాదాన్ని మిస్రా – ఎ – ఊలా లేక మిస్రా – ఎ –అవ్వల్ అంటారు. షేర్ లోని రెండవ పాదాన్ని మిస్రా – ఎ – సాని అంటారు. గజల్ లోని మొదటి ద్విపదను మత్లా అంటారు. ఇది పాటలోని పల్లవిలా ఉంటుంది. మత్లా అనగా ఉదయం, ఆకాశం అని అర్థం. గజల్ లోని అంత్యానుప్రాస నియమాన్ని 'రదీప్' అంటారు. రదీప్ అనగా అరబ్బీ భాషలో గుర్రం లేదా ఒంటె మీద కూర్చొని స్వారీ చేసే వ్యక్తికి వెనుక కూర్చునే వ్యక్తి, గజల్ లోని అంత్య ప్రాస నియమాన్ని 'కాఫియా' అంటారు. కాఫియా అనగా అరబ్బీ భాషలో గుర్రం లేదా ఒంటెకు రౌతు. గజల్ లోని చివరి చరణాన్ని 'మక్తా' అంటారు. మక్తాలో కవి పేరు ఉంటుంది. దీనినే 'తఖల్లూస్' అంటారు. తఖల్లూస్ నేటికాలంలో ఏ షేర్ లో నైనా వాడటం జరుగుతుంది.

తెలుగులో గజల్ ను మొదటిగా ప్రవేశపెట్టినవారు దాశరథి అయితే దానిని వ్యాప్తిలోకి తెచ్చి బాగా ప్రచారం చేసినవారు సినారె. ఆయన గజల్ ను స్వయంగా రాస్తూ, పాడుతూ గజల్ సాహిత్య పూలవనాల పరిమళాన్ని దశదిశలుగా వ్యాపింపచేశారు. ఆయన 1986లో తెలుగు గజళ్ళు అనే గ్రంథం

అచ్చయింది. దీనిలో 35 గజళ్ళు ఉన్నాయి. ఇదే తెలుగులో తొలి గజళ్ళ సంపుటి. ఆ తర్వాత రాసిన గజళ్ళలకు సినారె గజళ్ళు (1995) అని పేరు పెట్టారు. ఇందులో 38 గజళ్ళున్నాయి. వాటికి సినారె గజళ్ళు అని పేరుపెట్టి తెలుగు గజళ్ళు (1986)ను జోడించి ఒకే పుస్తకంగా ప్రచురించారు. గదిలో సముద్రం(1998) కవితా సంపుటిలో 29 గజళ్ళున్నాయి. 2001 కవితా సంకలనంలో "సప్తతి ఒక లిప్తగా" లో 18 గజళ్ళు ఉన్నాయి. అవి వార్త దిన పత్రిక ఆదివారం అనుబంధాలలో 'గజల్ లహరి' శీర్షికతో ధారవాహికగా వచ్చాయి. 2003లో కవితా సంకలనం "రెక్కల సంతకాలు"లో 6 గజళ్ళు ఉన్నాయి. మొత్తంగా 120 కి పైగా గజళ్ళను రాశారు సినారె.

**తెలుగు గజళ్ళలో మొదటి గజల్ ఏది అనే అంశంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.**

దాశరథి గజళ్ళలో ప్రణయ పరమైన అంశాలను ప్రస్తావిస్తే శృంగారానికి బదులుగా సినారె సామాజికాంశాలను, ప్రగతిశీల భావాలను వస్తువులుగా స్వీకరించి మానవుని సమాజ ప్రవర్తనలో మార్పు తెచ్చేందుకు ఎంతగానో, ఎందరినో ఆలోచింప చేశారు. సి.నా.రె గజళ్ళను గజల్ శ్రీనివాస్ చాలా సభలలో పాడారు. ఒకానొక సందర్భంలో సినారె తన గజళ్ళను గజల్ శ్రీనివాస్ గొంతుతో వినాలని ఆసక్తితో రాశారని వివరించారు.

తెలుగు గజళ్ళలో మొదటి గజల్ ఏది అనే అంశంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. జ్వాలాలేఖిని(1984)లో ప్రచురించబడిన గజళ్ళలో మొదటి గజల్ అయిన "రమ్మంటె చాలు గానీ రాజ్యాలు విడిచిరానా" అనే గజల్ దాశరథి గారి మొదటి గజల్ గా భావించవచ్చునని డా.తిరుమల శ్రీనివాసాచార్యుల వారన్నారు. అయితే కవితా పుష్పకం(1966) అచ్చయ్యే నాటికి రమ్మంటే చాలు గానీ.... అనే గజల్ ను దాశరథి రాసి ఉండకపోవచ్చు అని ఒకవేళ రాసి ఉంటే కవితాపుష్పకంలో చేర్చి ఉండేవారు కదా! కనుక కవితాపుష్పకంలోని కామన శీర్షికన ఉన్న "వలపునై నీ హృదయ సీమల నిలువవలెనని ఉన్నది" గజల్ నే దాశరథి తొలి గజల్ గా గుర్తించవలసి ఉంటుందని పెన్నా అభిప్రాయం.

## గజళ్ళలో సామాజిక చైతన్యం:

సమాజం అంటే వ్యక్తులు కలిసి మెలిసి ఒకరితో ఒకరు సంబంధాలు ఏర్పరుచుకొని ఒకే విధమైన నమ్మకాలు, ఆచారాలు, విలువలు పంచుకుంటూ జీవించే సమూహం. కాని నేడు సమాజంలో కులాల పేరుతో, మతాల పేరుతో ప్రజలను విడగొట్టి ఆర్థికంగా, రాజకీయంగా, సామూహికంగా, సామాజికంగా ప్రజల యొక్క ధన, మాన, ప్రాణాలను దోచుకుంటున్న వారి నుంచి ఈ సమాజాన్ని రక్షించడం కోసం పూనుకున్నారు కవులు. ప్రణయ రూపంలో ఉన్న గజల్ ప్రక్రియలో మొదటగా మానవతా దృక్పథాన్ని, ధిక్కార స్వరాన్ని సామాజిక కోణాన్ని, అభ్యుదయ, విప్లవ భావాలను సమాజంలో చొప్పించిన కవి సినారె. సినారె తరువాత గజళ్ళలో సామాజిక కోణంతో ప్రజలను చైతన్య పరిచే బాధ్యతను పెన్నా శివరామకృష్ణ, సూరారం శంకర్, గడ్డం శ్యామల, భైరి ఇందిర, కన్నెగంటి వెంకటయ్య, పోతగాని సత్యనారాయణ, ఇరువింటి వేంకటేశ్వరశర్మ, కోరప్రోలు మాధవ రావు, తిరునగరి శరత్ చంద్ర వంటి కవులు మరెందరో సమాజంలో మార్పు తేవాలన్న సంకల్పంతో రచనలు చేస్తున్నారు. అదేవిధంగా కాసోజు లక్ష్మీనారాయణ, రఘువీర్ ప్రతాప్, వెన్నెల సత్యం, వడ్డేపల్లి కృష్ణ కవులు కూడా సామాజిక మార్పుకై కృషి చేస్తున్నారు.

> పరుల కోసం పాటుపడని నరుని బ్రతుకు దేనికని?-
> మూగనేలకు నీరందివ్వని వాగు పరుగు దేనికని?

ముఖ్యంగా దాశరథి కృష్ణమాచార్యులు, సినారె ల తరువాత అత్యధికంగా గజల్ కు కృషి చేస్తున్న సీనియర్ కవులు పెన్నా శివరామకృష్ణ, సూరారం శంకర్ లు. వారు దాశరథి, సినారెల స్థానంలో ఉండి గజల్ సాహిత్యాన్ని నడిపిస్తున్నారు.

"పరుల కోసం పాటుపడని నరుని బ్రతుకు దేనికని?
మూగనేలకు నీరందివ్వని వాగు పరుగు దేనికని?" (తెలుగు గజళ్లు, సినారె)

పై షేర్ లో కవి సమాజంలో మనిషి ఉండాల్సిన తీరును తెలియజేస్తూ ప్రకృతిలో లభించే ప్రతీదీ చెట్టు, పుట్ట, గుట్ట, రాయి, రప్పలతో సహా పశుపక్ష్యాదులు చలనం ఉన్నవి, చలనం లేనివి పంచభూతాలు సైతం ఒక్కొక్కటి

సహాయం చేసుకుంటాయి. కాని మనిషి స్వార్థపు మడుగులో కొట్టుమిట్టాడుతూ తనని తాను నాశనం చేసుకుంటున్నాడని పరుల కోసం పాటు పడాలని 'పరోపకార్థం ఇదం శరీరం' అన్న పెద్దల మాటలు గుర్తు చేస్తున్నాడు. పరులకు సహాయం చేయని బ్రతుకు మానవాళికి బ్రతుకునిచ్చి ఆహారాన్ని అందించే నేలకు నీరివ్వని వాగు పరుగు ఉంటే ఏంటి లేకపోతే ఏంటి అంటూ సామాజిక చైతన్యాన్ని తన షేర్ లో తెలియపరిచాడు.

**అవినీతికి పట్టం కట్టి అభ్యుదయం పూడ్చిన జాతి - ఇకనైనా కళ్ళు నులుముకో ఇది రక్తఘోష**

"వేదం ఖురాను బైబిల్ వీధిలోన పడతాయా?
మతమేదైనా ఒకటేలే ప్రతి మనిషి శ్వాస" (తెలుగు గజళ్లు, సి.నా.రె)

పై షేర్ లో మనిషి మనుగడను ఏ విధంగా సాగించాలో హితోపదేశం చేస్తున్నాడు సినారె. వేదాలు హిందువులకు ఆత్మబంధువుకాగా, ఖురాను ముస్లిం సహోదరులకు, బైబిల్ క్రైస్తవ మతస్తులకు ఆరాధ్యంగా నిలుస్తున్నాయి. ఏ గ్రంథంలో అయినా శాంతి, అహింస, పరోపకారాలను తెలియపరిస్తే మిడిమిడి జ్ఞానం కలిగిన మానవ మృగాలు దాన్ని ఆసరాగ తీసుకుని ఒకరినొకరు హింసాత్మకంగా అంతం చేసుకుంటున్నారని తెలియజేస్తున్నాడు. మతం ఏదైనా ఒకటే అది కేవలం శాంతిని మాత్రమే బోధిస్తుంది అదే ప్రతి మనిషి శ్వాసగా ఉంటుందని మానవాళిని చైతన్య పరుస్తున్నాడు కవి.

మరో షేర్ లో

"అవినీతికి పట్టం కట్టి అభ్యుదయం పూడ్చిన జాతి
ఇకనైనా కళ్ళు నులుముకో ఇది రక్తఘోష" ( తెలుగు గజళ్లు, సినారె)

మానవ మనుగడ మొత్తం స్వార్థపు చింతనతో, పేరాశతో డబ్బు మాత్రమే శాశ్వతం అది లేకుంటే మానవ మనుగడ శూన్యం అనే చందంగా తయారయింది అని చెప్తున్నాడు. అవినీతిని అక్షయపాత్రగా భావించి కుంభాలు కుంభాలు గా లాగించే బకాసురులు ఈ కలియుగంలో ఉన్నారంటూ అదే అభ్యుదయంగా భావిస్తున్నారని అది రక్త ఘోష లాంటిది అనీ ఇకనైన కళ్ళు తెరుచుకోవాలని సమాజానికి కవి హితోపదేశం చేస్తున్నాడు.

"విసుగొచ్చింది జనమంటే వెర్రివాడా
ఆ జనమే నిను నడిపించే అడుగుజాడ" ( తెలుగు గజళ్లు, సినారె)

పై షేర్ లోని మత్లాలో సామాజిక చైతన్యాన్ని చమత్కారికంగా తెలియజేసే ప్రయత్నం చేస్తున్నాడు. కుళ్ళు, కుతంత్రాలు, అవినీతి స్వార్థపు మడుగులో మునిగిన అధికారులు, రాజకీయ నాయకులే కాకుండా మానవతా దృక్పథం కలిగిన మనుషులు ఉన్నారని చెప్తున్నాడు. జనం అంటే అందరూ భయపడే దృక్పథం నుండి నలుగురు ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకుంటూ మెలగాలనే సందేశాన్ని సమాజానికి వ్యక్తపరుస్తున్నాడు. ఇక్కడ మానవతా దృక్పథాన్ని మనుషుల ఆలోచనలో చొప్పిస్తున్నాడు.

> లోబుల కొలువున ఎన్నాళ్లున్నా లోకువ బతుకేలే -
> చెమటగ రక్తం స్రవించినా నెలజీతం పుడుతుందా

"మతమంటే ఒక అభిమతమనీ ప్రతి మనిషి అనుకుంటే
జగమంతా రూపుగొంటుంది సహజీవన మందిరమై" ( తెలుగు గజళ్లు, సినారె)

పై షేర్ లో మనిషి సమాజంలో ఏ విధంగా నడవాలి అనే అంశాలను బోధిస్తున్నాడు. మనిషిని మనిషి నిలువెల్ల కాల్చుకు తినే విధంగా మతాన్ని వాడుకుంటున్నాడు. శాంతిని ప్రబోదించి నలుగురికి ఏ హాని కలిగించరాదనే సత్యాన్ని మతాలు బోధిస్తుంటే మూఢులైన, అల్పజ్ఞానం కలిగిన మూర్ఖులు నేడు నరహంతకులుగా మారుతున్నారని మతం అనేది ఒక అభిమతం అని ఘాటుగా కవి విమర్శిస్తూ హితోపదేశం చేస్తున్నాడు. అందరూ మతం పట్ల ఇష్టాన్ని కలిగి ఉంటే పరమత సహనం అలవడుతుందని అప్పుడు సహజీవన మందిరంగా ఈ విశ్వం కనపడుతుందని తెలియ పరుస్తున్నాడు.

"లోబుల కొలువున ఎన్నాళ్లున్నా లోకువ బతుకేలే
చెమటగ రక్తం స్రవించినా నెలజీతం పుడుతుందా" (సినారె గజళ్లు, సినారె)

పై షేర్ లో పురాతన కాలం నాటి రాజకీయ, కుల, మత, రాచరిక పరిస్థితులను తెలియజేసే ప్రయత్నం చేస్తున్నాడు. ఆనాటి కాలంలో

అక్షరజ్ఞానం లేనటువంటి నిరక్షరాస్యులు దొరల దగ్గర, రాజుల దగ్గర, భూస్వాముల దగ్గర, పెత్తందారుల దగ్గర లోభితనంతో అమాయక ప్రజలను రాచి రంపాన పెడుతూ ధన, మాన, ప్రాణాలను దహించారు. అందరూ కూడా చైతన్యవంతులుగా మారాలి. లోభుల కొలువున ఉంటే ఎప్పుడైనా జీవితం లోకువగానే ఉంటుందని చెమటను రక్తంగా మార్చి కష్టపడినా కనీసం నెల జీతం కూడా పుట్టదని 'దున్నపోతుకు పాలు పితికిన' చందంగా ఉంటుందనే సత్యాన్ని కవి తెలియజేస్తున్నాడు.

**ఎంత తెగించిన సాహసమో నినదించే ఊరేగింపులకు - వట్టి పిడికిలే అనుకోకు అది చట్టాలను పేల్చేస్తుంది**

మరో షేర్ లో

"విసిగితె నసిగితె చెదిరిపోవులే ముసిరిన చీకట్లు
పరిస్థితులు ఎరుపెక్కకపోతె ప్రభాతం పుడుతుందా" (సినారె గజళ్లు, సినారె)

పై షేర్ లో సమాజంలో ఏ విధంగా ఉండాలి లేక ఎలా నడుచుకోవాలి అనే అంశాలను తెలియజేస్తూ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఉన్న పరిస్థితులను దాటాలంటే తప్పని సరిగా ప్రశ్నించాలి అని, ఎదురు తిరగాలనే సందేశాన్ని తెలుపుతున్నాడు. ముసిరిన చీకట్లను తెగ నరకాలంటే చిరుదీపంతో సూర్య భగవానుడు ఎరుపెక్కుతూ ఈ ప్రపంచానికి వెలుగు(ప్రభాతం)ను ప్రసరింపచేస్తాడని ఇంట్లో ఉండి విసుక్కుంటూ, నసక్కుంటూ కూర్చుని ఉంటే పనులు కావనే సందేశాన్ని విప్లవ భావంతో అభ్యుదయం కోరాలని హితోపదేశం చేస్తున్నాడు.

"ఎంత తెగించిన సాహసమో నినదించే ఊరేగింపులకు
వట్టి పిడికిలే అనుకోకు అది చట్టాలను పేల్చేస్తుంది" ( సినారె గజళ్లు, సినారె)

పై షేర్ లో సామాజిక ఉద్యమాలు ఏ విధంగా రూపుదిద్దుకున్నాయో తెలిపే ప్రయత్నం చేస్తున్నాడు. అనాది కాలం నుంచి ఎక్కడ అణచివేత మొలకెత్తుతుందో అక్కడ ఉద్యమం పుడుతుంది అన్నట్లుగా ఒకరికొకరు తోడై సాహసించి ఒక్కసారి బయటకు వస్తే ఎంతటి రాజ్యమైనా, సామ్రాజ్యమైనా తలొగ్గాల్సిందే.

ఆనాటి స్వాతంత్ర్యోద్యమం, ఆంధ్ర ఉద్యమం, తెలంగాణ ఉద్యమాలు, భూదానోద్యమం, సామాజిక ఉద్యమాలు అన్ని కూడా చట్టాలను మార్చేసాయి కాబట్టి అందరూ ఐక్యమత్యంగా ఉండాలనే సందేశాన్ని సామాజిక చైతన్యాన్ని వ్యక్త పరుస్తున్నాడు కవి. సాహసం నుంచే సమాజ పరివర్తనలో మార్పు జరుగుతుంది అందరు పిడికిళ్ళు బిగించి ఊరేగింపు తలపిస్తే రాజ్యాలు కూలుతాయి అనే నిజాన్ని తెలుపుతున్నాడు.

**పరిస్థితుల పంజా తనపైకి దూసుకొస్తే - ఉత్త బుర్రలోనైనా వ్యూహం పుడుతుంది**

"స్వార్థం కోసం ఓయి సినారే స్వజాతి పరువును ఆరేస్తే
అంగడిలోపల కన్నతల్లినే అమ్మి వేసినట్టవుతుంది" (సినారె గజళ్లు, సినారె)

పై షేర్ లో మనిషి మనుగడ కోసం ఏ విధంగా తనను తాను నిలువున ముంచు కుంటున్నాడో చెబుతూ మనిషి ఆర్థిక, సామాజిక, రాజకీయాల కోసం రాష్ట్రాన్ని, దేశాన్ని, తన ఉనికిని నేడు అంగట్లో పెట్టి అమ్ముకుంటున్న దృశ్యాన్ని మనం నేడు చూస్తున్నాం. ఆ విధంగా చేసే మూర్ఖులు తనని నవమాసాలు పెంచి పోషించిన, మనకు ఆరాధ్య దైవమైనా కన్నతల్లి ని అమ్ముకున్నట్లుగా ఉంటుందని అందరూ ఇకనైనా మారాలని సామాజికంగా చైతన్య పరుస్తున్నాడు. ప్రతి అడుగులో కూడా సామాజిక చైతన్యమే ధ్యేయంగా, సామాజిక నేపథ్యమే ఆరాధనగా కవి అంటేనే సామాజిక బాధ్యతగా ఉండడం అనే ఆలోచన తన ఆలోచనలో కన్పిస్తుంది. పై షేర్ లో సినారె అనేది కవినామ ముద్ర అయిన తఖలూస్ గా వాడడం జరిగింది.

"పరిస్థితుల పంజా తనపైకి దూసుకొస్తే
ఉత్త బుర్రలోనైనా వ్యూహం పుడుతుంది" (సినారె గజళ్లు, సినారె)

పై షేర్ లో సమాజంలో వ్యక్తిగా, సామాజికంగా ఎలా మెలగాలో తెలుపుతూ నేడు మనం అనుకున్న పరిస్థితులు ఈ ప్రకృతిలో నాలుగు కాలాలు ఉన్నట్లే మన జీవితాలలో కూడా శిశిర ప్రభావం రావచ్చు అని చెబుతున్నాడు. అప్పుడు మనిషి తనకు అనుకూలంగా లేని స్థితులను పసిగట్టి మంచి ఉత్తమమైన వ్యూహరచన చేయాలని హితోపదేశం చేస్తున్నాడు. నాలుగు గోడల మధ్య ఉన్న ఇంటిలో వేసి పిల్లిని కొట్టాలని చూస్తే అది ఎదుటి వారి ప్రాణాలు తీసే విధంగా

మనుషులు కూడా సమాజంలో సమస్యలపై ఎదురు తిరగాలని చైతన్య పరుస్తున్నాడు కవి.

"చెరగని సంకల్పం కావాలోయ్ చెడును పెరికి వేయాలంటే

చిత్తుగ తడిసిన అగ్గిపుల్లతో చీకటినెలా దహిస్తావు" (సినారె గజళ్లు, సినారె)

పై షేర్ లో కవి ఈ సమాజంలో పేరుకు పోయినటువంటి చెడుదారి పరిస్థితులైన అవినీతి, ఆర్థిక, సామాజిక అసమానతలను పెరికి వేయాలంటే ఎర్రగ మండేటటువంటి అగ్గిపుల్లతో చీకటిని చెరిపేయగలం కాని వాన నీటితో తడిసిన అగ్గిపుల్లతో వెలుగును ప్రసరింప చేయడం సాధ్యం కాదు కదా అనే ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రతి మనిషి అగ్ని గుండంగా మారి చెడుపై కురుక్షేత్రంలో పాల్గొనే యోధులుగా మారాలని సామాజిక చైతన్యాన్ని తెలియజేస్తున్నాడు కవి.

**జీవితం వసివాడుతుంటే చిగురులాగా ఎదిగిపో - పిచ్చి మూకలు రెచ్చగొడితే చిచ్చులాగా రగిలిపో**

"కుళ్ళి పోయిన వ్యవస్థను పట్టుకు వేళ్లాడితె అది వ్యర్థమే

కొత్తసృష్టి జరగాలంటే పోటెత్తే ప్రళయం అవసరం" (సినారె గజళ్లు, సినారె)

పై షేర్ లో సామాజిక స్థితిగతులను తెలిపే ప్రయత్నం చేస్తూ నేడు కుళ్ళిపోయిన వ్యవస్థను పట్టుకొని కుల, మత, రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యర్థాలను పట్టు విడవాలని పిలుపునిస్తూ కొత్త సృష్టి ఈ సమాజంలో జరగాలంటే పోటెత్తుకుని ఉబికివచ్చే ప్రళయం అవసరం. అప్పుడు మాత్రమే ధన, ప్రాణ మానాలపై వాంఛను విడుస్తారని సామాజిక చైతన్యాన్ని కలిగిస్తున్నాడు కవి.

"జీవితం వసివాడుతుంటే చిగురులాగా ఎదిగిపో

పిచ్చి మూకలు రెచ్చగొడితే చిచ్చులాగా రగిలిపో" ( సినారె గజళ్లు, సినారె)

పై షేర్ లో మనిషి సమాజంలో ఎటు పాలుపోని పరిస్థితులలో ఉన్నప్పుడు అర్థం పర్థం లేని ఆలోచనలో ఉన్నప్పుడు శిశిరంలో వాడిపోయిన వృక్షం వసంతంలో చిగురించిన విధంగా మనిషి ఎదగాలని చెప్తున్నాడు. నీ చుట్టూ చేరి నిన్ను అవమానంగా చేసే పిచ్చిమూకలపై చిచ్చులాగా (అగ్గి) లాగా రగిలిపోవాలని సామాజిక చైతన్యాన్ని వ్యక్త పరుస్తున్నాడు కవి.

"గువ్వలపై గురిపెడతావెందుకు గుండాలకు గురిపెట్టు
జాతి విముక్తికి నెత్తుట తడిసిన జండాలకు జై కొట్టు" (గదిలో సముద్రం, సినారె)

పై షేర్ లో సమాజంలో స్థితిగతులను తెలుసుకొని ఏ విధంగా మెలగాలో చెబుతున్నాడు. ఏ అన్యం పుణ్యం ఎరుగని ఆకాశంలో రివ్వున ఎగిరే స్వచ్ఛమైన గువ్వలపై గురిపెడుతావెందుకు ఈ సమాజాన్ని భ్రష్టు పట్టిస్తూ నిలువున దోస్తున్న ఆ అవినీతి రాజకీయ గుండాలపై నీ గురి ఉండాలంటాడు కవి. అదేవిధంగా బానిస బ్రతుకులను తరిమె జెండాలకు జై జై కొట్టాలి కాని ధన, మాన, ప్రాణాలను దోచుకునే నీచ నాయకులకు కాదని ఘాటుగా ప్రశ్నిస్తున్నాడు కవి.

**జీవము నిలిపే శ్వాసగమారుతు వీచే గాలికి కులమేది - కాలం తీరీ కాటికి చేరితె కాల్చే నిప్పుకు కులమేది**

"కులం ఎంత కుటిలమైనదో కుములుతున్న జాతినడుగు
మతం ఎంత మలినమైనదో మండుతున్న చితులనడుగు"

(వెంకటయ్య కన్నెగంటి, మమతల హృదయాలు)

పై షేర్ లోని మత్లాలో కులం, మతం అనేవి దుష్టశక్తులు లాంటివని వాటి ఆసరగా తీసుకొని సంఘవిద్రోహక శక్తులుగా మారి మనుషులను పెడదారిన పెడుతున్నారు. కులం ఎంత కుటిలమైనదో దాని నుంచి ఇబ్బందులకు గురవుతున్న జాతిని అడగమని, మతం ఎంత మలినమైనదో మతం వల్ల మరణించి మండుతున్న చితులను అడగమని కవి తన గజల్ ద్వారా ప్రశ్నిస్తున్నాడు.

"జీవము నిలిపే శ్వాసగమారుతు వీచే గాలికి కులమేది
కాలం తీరీ కాటికి చేరితె కాల్చే నిప్పుకు కులమేది"

(సత్యనారాయణ పోతగాని, స్వప్నశిల్పాలు)

పై షేర్ లోని మత్లాలో మానవులందరికి పంచభూతాలలో భాగమై మనిషి ఆయువుతో ఉండటానికి కారణమైన స్వచ్ఛమైన గాలికి కులమేదని మనిషి తనువు చాలించిన తరువాత కాటికి చేరితే శవాన్ని కాల్చే నిప్పుకు కులమేదని శాశ్వతంగా ఉండే పంచ భూతాలకు లేని కులం మనుషుల కెక్కడిదని కవి ప్రశ్నిస్తూ తన గజల్ ద్వారా సమాజాన్ని చైతన్య పరుస్తున్నాడు.

"మీరు పాదము నుంచి ఎందుకు పుట్టలేదంటే
విప్రనాగుల పడగలన్నీ జడుసుకున్నాయి"
(శివరామకృష్ణ పెన్నా, శిశిరవల్లకి)

పై షేర్‌లో మేం పాదాల నుంచి పుట్టాము సరే మరి మీరెందుకు పాదాల నుంచి పుట్టలేదని అగ్రకులం వారిని నిమ్న కులాల వారు అడగగానే విప్రనాగుల పడగలన్నీ జడుసుకున్నాయి అంటూ కవి తన గజల్ ద్వారా అగ్రకులాల వారిని ప్రశ్నిస్తున్నాడు. మనిషి మనిషిలాగా చూస్తే చాలు ఇక్కడ ఎవ్వడూ కూడా పై నుంచి దిగిపడలేదు. అందరూ అమ్మ కడుపు నుంచే వచ్చారు అని సమాజాన్ని హితోపదేశం చేస్తున్నాడు కవి.

**సత్యాన్నే సరి తూచగ త్రాసెక్కడ దొరుకుతుంది - ధర్మాన్నే తెలియచెప్ప పదమెక్కడ దొరుకుతుంది**

"హంతకుడె పలు సూక్తులను వల్లించుతూ ఉంటే
న్యాయానికే సరికొత్త అర్థం కల్పించుకోవాలి"
(శివరామకృష్ణ, పెన్నా. శిశిర వల్లకి)

పై షేర్లో సమాజాన్ని భ్రష్టు పట్టిస్తున్న హంతకుడే నీతి సూక్తులను వల్లె వేస్తూ ఉంటే న్యాయం మరో సరికొత్తనైన అర్థాన్ని, భావాన్ని స్ఫురించుకోవాలని చాలా ఘాటుగా విమర్శిస్తున్నాడు కవి. ఇంకో విధంగా సమాజాన్ని, పరిస్థితులను బట్టి న్యాయం, ధర్మం అనేవి వాటి విధానాలను మార్చాలి అనే సిద్ధాంతాన్ని కవి తన గజల్ ద్వారా తెలుపుతున్నాడు.

"సత్యాన్నే సరి తూచగ త్రాసెక్కడ దొరుకుతుంది
ధర్మాన్నే తెలియచెప్ప పదమెక్కడ దొరుకుతుంది"
(శ్యామల గడ్డం, వాసంత సమీరాలు)

పై షేర్ లోని మత్లాలో ఈ సమాజంలో సత్యాన్ని సరితూచగలిగేటటువంటి త్రాసు ఎక్కడ దొరుకుతుంది అదేవిధంగా ధర్మాన్ని తెలియజెప్పేటటువంటి పదం ఎక్కడ దొరుకుతుందని ప్రశ్నిస్తూ, ఇవి ఇప్పుడున్న సమాజంలో దొరకడం కష్టమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాడు హరిశ్చంద్రుడు సత్యం కోసం తన ప్రాణాలను, కుటుంబాన్నే ఫణంగా పెట్టాడు. అలా ఎవరున్నారో ప్రస్తుత సమాజంలో వెతకాలని సమాజానికి హితోపదేశం చేస్తున్నారు కవయిత్రి.

"నీతిలేని సమాజాన్ని చూసి తలను వంచుకో
నీకు నీవెరక్ష అని తెలిసి బలము పెంచుకో" (ఇందిర బైరి, సవ్వడి)

పై షేర్ సమాజాన్ని గూర్చి కళ్ళకు కట్టినట్లు చూపిస్తూ నీతి లేనటువంటి సమాజాన్ని చూసి నీ తప్పు లేకున్నను తలను వంచుకోవాలని అదేవిధంగా నిన్ను నీవు రక్షించుకోవాలి ఎవరి మీద ఆధారపడకుండ అప్పుడు మాత్రమే ఆత్మ స్థైర్యంతో దేన్నైనా ఎదుర్కోగలమని హితవు పలుకుతున్నారు.

ఎవరిని నమ్మమంటావు? మనసును విరిచే వాళ్ళే అంతా శరసంధానం చేసి, గుండెను గాయం చేసే వాళ్ళే అంతా

"నమ్మకం చెడి లోకం సొంతం భద్రత కోల్పోయింది
క్రుంగిన విలువలు చూస్తూ వుంటే గిరులు సిగ్గు పడుతున్నాయి."
(శంకర్ సూరారం, సౌపర్ణిక)

పై షేర్ లో ఈ లోకంలో నమ్మకం అనేది కోల్పోయి ఈ సమాజం మొత్తం భద్రత కోల్పోయింది అని కవి వివరిస్తున్నాడు. కుంగిపోయినటువంటి సమాజ విలువలను చూస్తే ఎంతో కఠినంగా ఉండేటటువంటి గిరులు సైతం సిగ్గుపడుతున్నాయి అంటూ మనిషి దిగజారే స్వభావాన్ని తన గజల్ ద్వారా కవి విమర్శిస్తున్నాడు. ఇకనైనా నిన్ను నీవు ఆదమరిచి ఉండకు, ఇకనైనా మేలుకో అని సమాజాన్ని చైతన్య పరుస్తున్నాడు కవి.

"ఎవరిని నమ్మమంటావు? మనసును విరిచే వాళ్ళే అంతా
శరసంధానం చేసి, గుండెను గాయం చేసే వాళ్ళే అంతా"
(శంకర్ సూరారం, సౌపర్ణిక)

పై షేర్ లో నేడు సమాజంలో జరుగుతున్న మనుషుల విధానాలను వివరిస్తూ ఈ సమాజంలో ఎవరిని నమ్మలేని పరిస్థితులలో ఉన్నామని అందరూ కపటబుద్ధి కలవారని చెపుతున్నాడు. అదేవిధంగా శిరసును తీసేసి గుండెను కోసేవాళ్ళే ఎక్కువ ఈ సమాజంలో అని కవి తన గజల్ ద్వారా వివరిస్తున్నాడు.

"మాయ చేయ మతమెందుకు తెలివొక్కటి చాలదా
బతికించని కులమెందుకు గుణమొక్కటి చాలదా"
(సత్యనారాయణ పోతగాని, – స్వప్నశిల్పాలు)

పై షేర్ లో ఈ సమాజంలోని పరిస్థితులను గూర్చి కవి తెలుపుతూ మాయచేయు మతమెందుకు మనిషికి తెలివి ఒక్కటి ఉంటే సరిపోతుంది అని కవి తెలుపుతున్నాడు. అదేవిధంగా మనిషిని బతికించని కులమెందుకు గుణము ఉంటే సరిపోతుంది మనిషికి కులమతాలు అవసరం లేదని హితవు పలుకుతున్నాడు కవి.

"మనసు లోపల తలచే దొకటి బయటకు పలికేదింకొకటి
లౌక్యమనే ముసుగు వేయకుంటే పప్పులు వుడకని కాలమది"
(వెంకటయ్య కన్నెగంటి, మమతల హృదయాలు)

పై షేర్‌లోకవిమనిషిఆలోచనవిధానాన్నినిజస్వరూపాన్నితెలుపుతున్నాడు. మనిషి తన లోపల తలచుకునేది ఒకటి బయట ప్రవర్తించేటటువంటి ముసుగు ఒకటిని పైకి లౌక్యపు మాటలు వల్లెవేస్తాడని వివరిస్తున్నాడు. అదేవిధంగా మనిషి జిత్తులమారి నక్కలాంటివాడని పరోక్షంగా ఘాటుగ విమర్శిస్తూ సమాజంలో జాగ్రత్తగా ఉండాలని చైతన్యపరుస్తున్నాడు కవి.

మాటలతోటి కోటలు కడితే ఎలాగ నమ్మేది
క్షణక్షణానికి పార్టీ మార్చితే ఎలాగ నమ్మేది
(శరత్ చంద్ర తిరునగరి, చైతన్యలహరి)

పై షేర్ లో సమాజంలో నాయకులు అవలంబించే తీరును కవి తెలియపరుస్తున్నాడు. బూటకపు మాటలతోటి ఎన్ని కోటలు కట్టిన క్షణక్షణానికి పార్టీలు మార్చి అజెండాలను మరిచి జెండాలకే విలువ నిచ్చే స్వార్థపు కుటిల బుద్ధితనాన్ని చూపించే దౌర్జన్యపు నాయకులను ఎలాగ మేము నమ్మేది అని కవి ప్రజల తరపున ఘాటుగా ప్రశ్నిస్తున్నాడు.

"రుచిని చూసి విలువనిచ్చు లోకంలో ఇరువింటీ
పూతకాత లేనితీగ రాగమెవరు వింటారు?"
(వెంటేశ్వరశర్మ ఇరువింటి, మధువర్షిణి)

పై షేర్‌లో సమాజంలోని పరిస్థితులను కవి కళ్ళకు కట్టినట్టు వివరిస్తున్నాడు. మనిషి ప్రవర్తన అనేది మనిషి గుణాన్ని కాక ధనాన్ని చూసి, పలుకుబడిని చూసి విలువనిస్తారు అని చెబుతున్నాడు. పూత, కాత లేని తీగను ఎలాగ అయితే ఎవరు పట్టించుకోరో, అదేవిధంగా పేదవాని బాధను కూడా ఎవరు పట్టించుకోరని కవి విమర్శనాత్మకంగా తెలుపుతున్నాడు. ఇక్కడ ఇరువింటీ అనేది కవి నామముద్ర అయిన తఖల్లూస్ గా భావించవచ్చు.

"లోక కళ్యాణమే విధియౌను ఇరువింటి
వసుధైక భావనతో జీవించు వారికి" (వెంకటేశ్వరశర్మ ఇరువింటి, మధువర్షిణి,)

సమాజాన్ని వసుధైక కుటుంబంగా చూసేవారికి లోకకళ్యాణమే విధి అవుతుందనీ, అంటే జీవన విధానం అవుతుందని ఈ షేర్ లో కవి ఉపదేశిస్తాడు. అదేవిధంగా భారత దేశం వసుధైక కుటుంబం అనే విషయాన్ని గర్వంతో చెబుతున్నాడు. అందరూ కలిసి మెలిసి మెలగాలని హితవు పలుకుతున్నాడు కవి.

"ప్రతిభ చూసి ప్రోత్సహించు లోకమే గ లోకమంటె
డబ్బు పోసి కొనుక్కున్న పూలముళ్ళు అవసరమా"

(మాధవరావు కోరుప్రోలు, మాధవ మందారాలు – 2)

పై షేర్ లో సమాజపు స్థితులను తెలుపుతూ ఒకవ్యక్తి యొక్క ప్రతిభను చూసి ప్రోత్సహించాలి కాని డబ్బును చూసి, పలుకుబడిని చూసి ధనంతో కొనుకున్న ప్రోత్సహం అనేది పూలపాన్పు పై ముళ్ళకిరీటం లాంటిదని కవి తెలుపుతున్నాడు. లోకంలో ప్రతిభకే పట్టం కట్టాలి కాని ధనంతో వచ్చిన ఏ పదవులైన వ్యర్థమే అని కవి చెబుతూ నిస్వార్థమైన లోకమే లోకమని తెలుపుతూ శ్రీనాథకవిని గుర్తు చేస్తున్నాడు.

"హిమనదాలు సైతం కూలే తరుణమొకటి వస్తుంది
అడుగడుగన సుడులుంటాయి ఎవరూ చూడలేదనుకోకు"

(శంకర్ సూరారం, లహరిక)

పై షేర్ లో సమాజపు నిశిత పరిశీలనను గురించి ఘాటుగా స్పందిస్తూ హిమనదాలు సైతం కూలిపోయే ప్రమాదాలు వస్తాయి చూడు నాయకులారా మీరు నేను గొప్ప అని విర్రవీగుతూ ఉంటే మీకై మీరే నాశనం అవుతారంటున్నారు. అదేవిధంగా నీవు వేసే ప్రతి అడుగులో ఎందరో గమనించే చురుకైన చూపులుంటాయి. ఎవరు చూడలేదు అనుకోకు. ఒకానొక సందర్భంలో ప్రకృతి కన్నెర్ర చేస్తే అగ్ని పర్వతాలే బద్దలవుతాయి. నీవెంత అని రాజకీయ నాయకులను ఘాటుగా విమర్శిస్తున్నాడు కవి.

# ధన్యోస్మి

జులై -సెప్టెంబర్  2025 సంచిక ని తెలుగు గజల్స్ కి సంబంధించిన ప్రత్యేక సంచికగా వెలువరిస్తున్నాము. ఈ సంచిక కి  సమన్వయ సంపాదకులుగా వ్యవహరించి సంచిక రూపకల్పనలో ప్రధాన పాత్ర పోషించిన డాక్టర్ గడ్డం శ్యామలా దేవి గారికి అభినందన పూర్వక ధన్యవాదాలు. ఈ సంచికలో  ప్రచురణ  కోసం మంచి వ్యాసాలు, కవితలు రాసి పంపిన  వ్యాసకర్తలకి  శతకోటి నమస్సులు. ఈ సంచిక వెలువరించడంలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సహకరించిన వారందరో, వారందరికీ  వందనములు.

సంపాదక మండలి  సహకారంతో ప్రకాశిక ని మరింత ఉన్నతమైన పత్రికగా నడిపే ప్రయత్నం చేస్తాను.

ప్రచురణ కోసం కథలు, కవితలు, పరిశోధనా వ్యాసాలు పంపమని రచయితలను కోరుతున్నాము.

ఎప్పటిలాగే పాఠకులు ఈ సంచిక ను కూడా చదివి ఆనందిస్తారని ఆశిస్తాను.

చదవండి, చదివించండి

భవదీయుడు

**ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ**

ప్రధాన సంపాదకులు

ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక

## సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక

సంపుటి 5 | సంచిక 3 జులై-సెప్టెంబర్ 2025

మమత-సమత-మానవత
www.gurajada.org




# కీ.శే. మండలి వెంకట కృష్ణారావు

(ఆగస్టు 4, 1926-సెప్టెంబరు 27, 1997)